6-8Pg1exHMNWJQE_6-8Pg1exHMNWJQE.qxd 05/Aug/26 11:44 PM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

గుంటూరు

: fb.com/vaartha Digital

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

6-8-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 187 పేజీలు: 12 వెల: 6.50

పార్లమెంటుకు గైర్హాజరు కావొద్దు: ఎంపీలతో ప్రధాని

ప్రెషర్ గ్రూప్‌గా మాత్రమే పనిచేస్తాం: కాక్రోచ్ పార్టీ 9లో

# రాష్ట్రమంతా సమతుల్య అభివృద్ధి

## • నిర్దిష్ట ప్రణాళికతో కార్యాచరణ • ప్రజల ఆకాంక్షల మేరకు విఇఆర్ అభివృద్ధి • విశాఖ ఎకనమిక్ రీజియన్ సమగ్ర అభివృద్ధికి మైక్రోప్లానింగ్ సమీక్షలో సిఎం చంద్రబాబు

**విజయవాడ.ఆగస్టు 5,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో అన్ని ప్రాంతాల్లో సమాంతర అభివృద్ధిని సాధించేందుకు ప్రభుత్వం నిర్దిష్ట ప్రణాళికతో కార్యచరణ చేపట్టిందని సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు. అమరావతితో పాటుగా ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలను అభివృద్ధి చేస్తుందన్నారు. పారిశ్రామికంగాను, విద్యా, వైద్య, రవాణా రంగాల్లో అభివృద్ధి జరుగుతుంది. ఇందుకోసం రూ.వేలకోట్లు పెట్టుబడులను ఆహ్వానించడమే కాకుండా, వాటన్నింటి గ్రౌండ్ చేయించే దిశలో కృషి జరుగుతుంది. ఈ క్రమంలోనే అభివృద్ధిలో అత్యంత కీలకమైన విశాఖ ఎకనామిక్ రీజియన్ (విఇఆర్) అభివృద్ధి ప్రణాళికలపై అమలు చేయనున్నా మన్నారు. ఈ ప్రణాళికలపై సిఎం చంద్రబాబు అమరావతిలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ బృహత్ ప్రాజెక్టు ద్వారా సుమారు రూ.9.50 లక్షల కోట్ల భారీ పెట్టుబడులను ఆకర్షించడం లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఈ సమీక్షా సమావేశంలో విఇఆర్ ప్రాజెక్టు ఆర్థిక స్వరూపాన్ని, కార్యాచరణను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మొత్తం పెట్టుబడులలో భాగంగా ప్రభుత్వం రూ.3.50 లక్షల కోట్ల నుంచి రూ.4 లక్షల కోట్ల వరకు



బుధవారం అమరావతిలో జరిగిన ఎకనమిక్ రీజియన్ అభివృద్ధి ప్రణాళికల సమీక్షలో సిఎం చంద్రబాబు

సమకూర్చాలని, మిగిలిన రూ.5.30 లక్షల కోట్లను ప్రైవేట్ రంగం నుంచి రాబట్టేలా పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలని లక్ష్యంగా నిర్దేశించారు. విఇఆర్ ప్రాజెక్టు ఆర్థిక స్వరూపాన్ని, కార్యాచరణను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మొత్తం పెట్టుబడులలో భాగంగా ప్రభుత్వం రూ.3.50 లక్షల కోట్ల నుంచి రూ.4 లక్షల కోట్ల వరకు సమకూర్చాలని, మిగిలిన రూ.5.30 లక్షల కోట్లను ప్రైవేట్ రంగం నుంచి రాబట్టేలా పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఎఐ డేటా సెంటర్ల ఎకో సిస్టం, పోర్టు ఆధారిత పరిశ్రమలు, పర్యాటకం, హైడ్రోజన్, క్లీన్‌టెక్ ఎనర్జీ వంటి కీలక రంగాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సిఎం ఆదేశించారు. వివిధ ప్రాజెక్టులను పరస్పరం అనుసంధానించడం ద్వారానే విశాఖ ఎకనామిక్ రీజియన్ వేగంగా ప్రగతి సాధిస్తుందని ఆయన పేర్కొన్నారు.

నిధుల కన్వర్జెన్స్ పద్ధతిని అనుసరించాలని, అవసరమైన చోట వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (విజిఎఫ్) స్కీంను కూడా అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు, విఇఆర్ ప్లానింగ్ కోసం ఆంధ్రా యూనివర్శిటీ సేవలు తీసుకుంటున్నట్లు వివరించారు.మూలపేట పోర్టు నుంచి రాజమహేంద్ర వరం అఖండ గోదావరి ప్రాజెక్టు వరకూ విఇఆర్ అభివృద్ధిలో భాగంగా ఉండాలని సిఎం సూచన చేసారు. వివిధ ప్రాజెక్టులను అనుసంధానించటం ద్వారా విశాఖ ఎకనామిక్ రీజియన్ ప్రగతి సాధించాలని స్పష్టం చేసారు. నిధుల కన్వర్జెన్స్ ద్వారా విఇఆర్ పరిధిలో అభివృద్ధి చేపట్టాలని నిర్దేశించారు. అవసరమైన మేరకు విజిఎఫ్ స్కీంను అమలు చేయాలని సూచించారు. వివిధ ప్రాజెక్టులను అనుసంధానించటం ద్వారా విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్ ప్రగతి సాధించాలని సిఎం చంద్రబాబు స్పష్టం చేశారు. నిధుల కన్వర్జెన్స్ >>2

# క్షమించండి

## భారత్‌కు క్షమాపణ చెప్పిన జుకర్‌బర్గ్

### తమ ప్లాట్‌ఫాంలపై అభ్యంతరకర, డీప్‌ఫేక్ కంటెంట్ వ్యాప్తిపై విచారం ప్రకటించిన 'మెటా' సిఇఒ

### ప్రధాని మోడీ ఫేస్‌బుక్ పోస్టును మెటా కొద్దిసేపు తొలగించడంపై కేంద్రం ఆగ్రహం



**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** ప్రముఖ సోషల్ మీడియా సంస్థ మెటా సిఇఒ మార్క్ జుకర్‌బర్గ్ భారత ప్రభుత్వానికి క్షమాపణలు తెలిపారు. ప్రధాని మోడీ విడియో తొలగింపు, తమ ప్లాట్‌ఫామ్‌లపై చైల్డ్ సెక్సువల్ అబ్యూజ్ మెటీరియల్, డీప్‌ఫేక్ కంటెంట్ వ్యాప్తి చెందడంపై ఆయన చింతిస్తున్నట్లు వెల్లడించారు. వీటితో పాటు, తమ ప్లాట్‌ఫామ్‌ల నిర్వహణలో జరిగిన లోపాలను కూడా అంగీకరిస్తూ ఆయన విచారం వ్యక్తం చేసినట్లు ప్రభుత్వ వర్గాలు బుధవారం వెల్లడించాయి. ఇటీవల ప్రధాని నరేంద్ర మోడీకి చెందిన ఓ ఫేస్‌బుక్ పోస్ట్‌ను కొద్దిసేపు తొలగించడంపై పార్లమెంటరీ కమిటీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. ఈ వివాదంపై చర్చించేందుకు మెటా ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం ఢిల్లీలో ఐటీ కార్యదర్శి ఎస్. కృష్ణన్‌తో సమావేశమైంది. ఈ సందర్భంగా, అభ్యంతరకర, తప్పుడు కంటెంట్ వ్యాప్తిపై భారత ప్రభుత్వం లేవనెత్తిన ఆందోళనలను మెటా ప్రతినిధులు అంగీకరించారని, ప్లాట్‌ఫామ్ నిర్వహణలో జరిగిన పొరపాట్లపై >>2

# క్రీడా రాజధానిగా విశాఖకు కొత్త రూపు




బుధవారం విశాఖలో స్పోర్ట్స్ అకాడమీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి లోకేష్

## పివి సింధు స్పోర్ట్స్ అకాడెమీకి శంకుస్థాపన చేసిన మంత్రి లోకేష్

## క్రీడాకారులకు సంపూర్ణ సహకారం అందిస్తాం

**విశాఖపట్నం, జులై 5, ప్రభాతవార్త:** విశాఖలో నిర్మించనున్న పివి సింధు స్పోర్ట్స్ అకాడమీ వేలాది మంది భవిష్యత్ ఛాంపియన్లను తీర్చిదిద్దే వేదికగా నిలుస్తుందని రాష్ట్ర విద్య, ఐటీ శాఖలమంత్రి నారా లోకేష్ అన్నారు. బుధవారం అకాడమీ నిర్మాణ పనులకు భూమిపూజ అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పివి సింధు సాధించిన విజయాల వెనుక ఆమె తల్లిదండ్రులు, కోచ్‌ల త్యాగం, క్రమశిక్షణ, అచంచల పట్టుదల ఉన్నాయని లోకేష్ పేర్కొన్నారు. సింధు తన వ్యక్తిగత విజయాలను భవిష్యత్ తరాలకు అందించాలనే సంకల్పంతో అకాడమీ ఏర్పాటుకు ముందుకు రావడం అభినందనీయ మన్నారు. కేవలం బ్యాడ్మింటన్‌కే పరిమితం కాకుండా స్విమ్మింగ్, జిమ్నా >>2

# చంపినా సరే.. ప్రజలమధ్యే ఉంటా

## అది విద్యార్థి ఉద్యమం కాదు.. ప్రభుత్వ మార్పుకోసం కుట్ర

### ఉద్యమం మొదటి నుంచి హింసాత్మకమే

### మహ్మద్ యూనస్‌పై తీవ్ర ఆరోపణలు చేసిన షేక్ హసీనా

### రెండేళ్ల తర్వాత బహిరంగంగా బంగ్లా మాజీ ప్రధాని ప్రసంగం



**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** బంగ్లాదేశ్‌లో జరిగిందిన విద్యార్థుల స్వచ్ఛంద ఉద్యమం కాదని, ముందే రూపొందించిన ప్రభుత్వ మార్పు కుట్ర అని ఆరోపించారు. రిజర్వేషన్ కోటా ఉద్యమాన్ని ఉద్దేశపూర్వకంగా ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమంగా మార్చి తనను అధికారంలో నుంచి తొలగించే ఉద్యమంగా మార్చారని ఆరోపించారు. ఉద్యమం మొదటి నుంచే శాంతియుతంగా లేదని హసీనా పేర్కొన్నారు. ప్రభుత్వం హైకోర్టు కోటా తీర్పుపై అప్పీల్ చేసిందని, విద్యార్థి నాయకులతో చర్చలకు సిద్ధమైందని కూడా ఆమె చెప్పారు. కొన్ని గుంపులు ఈ >>2

# రాయలసీమ దాహానికి శ్రీశైలం జలాలు

### - మంత్రి నిమ్మల రామానాయుడు



**విజయవాడ, ఆగస్టు 5, ప్రభాతవార్త ప్రతినిధి:** రాయలసీమ మంచినీటి అవసరాల కోసం శ్రీశైలం నుంచి నీటిని విడుదల చేస్తున్నామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రకటించారు.రాయలసీమ తాగునీటి అవసరాల కోసం శ్రీశైలం నుంచి నీటి విడుదల. ఎల్‌నినో నేపథ్యంలో మంచినీటి కోసం భద్రపరచుకోవాలన్నారు. 2027 జూన్ వరకు శ్రీశైలం జలాలను తాగునీటి కోసం భద్రపరచుకోవాలి అన్నారు. రాబోయే 10 రోజుల్లో శ్రీశైలానికి మరో 100 టిఎంసిలు రావచ్చని అంచనా అన్నారు.అమరావతి సచివాలయంలో జలవనరుల నిర్వహణ, నీటి విడుదలపై అధికారులతో మంత్రి రామానాయుడు సమీక్ష నిర్వహించారు. కృష్ణా జలాల్లో ఎపి 63 శాతం వాటాను ప్రథమంగా తాగునీటికే ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. హంద్రీనీవా పరిధిలోని రిజర్వాయర్ల తాగునీటి అవసరాలకు 13 టిఎంసిలు అవసరం. పోతిరెడ్డిపాడు పరిధిలోని రిజర్వాయర్లకు మంచినీటి కోసం 10 టిఎంసిలు రేపటినుంచి విడుదల చేస్తున్నామన్నారు.

తెలుగుగంగ ద్వారా చెన్నై తాగునీటికి 10 టిఎంసిలు విడుదల చేయాల్సి ఉంది. నాగార్జున సాగర్ రైట్ కెనాల్, లెఫ్ట్ కెనాల్ పరిధి తాగునీటికి 32 టిఎంసిలు అవసరం అన్నారు.ఎల్‌నినో విపత్తును ఎదుర్కొనేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడతాం అన్నారు. 2027 జూన్ వరకు నీటిని భద్రపరుచుకోవడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఎల్‌నినో విపత్తు ముప్పు పొంచి ఉన్నందున కృష్ణా జలాల్లో ఎపికి ఉన్న 63 శాతం వాటాలో తాగునీటికే ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామని స్పష్టం చేశారు. ప్రస్తుతం శ్రీశైలంలో 119 టిఎంసిల నీరు నిల్వ ఉందని, రాబోయే 10 రోజుల్లో మరో 100 టీఎంసీల వరకు >>2




బుధవారం విజయవాడలో బిసి ముసాయిదా రక్షణ చట్టంపై జరిగిన సమావేశంలో పాల్గొన్న మంత్రులు సవిత, అచ్చెన్నాయుడు, పార్థసారధి తదితరులు

# ప్రత్యేక చట్టంతో బిసిలకు రక్షణ

## కులం, వృత్తిపేరిట దూషిస్తే కఠిన శిక్షలు

## వీలయినంత త్వరగా చట్టం చేస్తాం: మంత్రులు అచ్చెన్నాయుడు, సవిత, పార్థసారధి

**విజయవాడ,ఆగస్టు5,ప్రభాతవార్తప్రతినిధి:** బిసి రక్షణ చట్టంతో వెనుబడిన వర్గాలు గౌరవ ప్రదంగా సామాజిక జీవనం కొనసాగించేలా రక్షణ కల్పిస్తున్నామని, కులం, వృత్తుల పేరుతో దూషిస్తే కఠినంగా శిక్షించేలా చట్టం రూపొందిస్తున్నామని మంత్రులు ఎస్.సవిత, అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ చట్టంపై మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీల అభిప్రాయాలు తీసుకున్నామని, త్వరలో జిల్లా స్థాయిలోనూ బిసి సంఘాల ప్రతినిధుల నుంచి సలహాలు తీసుకుంటామని తెలిపారు. బిసి ముసాయిదా రక్షణ చట్టం జాతీయ బిసి కమిషన్ దృష్టికి తీసుకెళతామని, అక్కడ అనుమతి రాగానే అసెంబ్లీలో ఆమోదానికి ప్రవేశపెడతామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ >>2

# ఎమ్మెల్సీ అనంత బాబు బెయిల్ పిటిషన్ రద్దు 2లో

# మరో 4 రోజులు భారీ వర్షసూచన

**విజయవాడ,ఆగస్టు5,ప్రభాతవార్తప్రతినిధి:** పశ్చిమ మధ్య బంగాళాఖాతంలోని ఉపరితల ఆవర్తన ప్రభావంతో రాబోయే నాలుగైదు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్‌లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో బుధవారం నుంచి మరో మూడు రోజుల పాటు మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ స్పష్టం చేసింది. కోస్తా, ఉత్తరాంధ్ర అలాగే రాయలసీమ జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని అధికారులు ప్రత్యేక సూచనలు చేశారు. భారీ వర్షాల సమయంలో చెట్ల కింద తలదాచుకోరాదని హెచ్చరించారు. వేటకు వెళ్లే మత్స్యకారులు వాతావరణ శాఖ హెచ్చరికలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలవకుండా యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తాజాగా రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలు, ఎగువన వస్తున్న వరదతో జలాశయాల్లో నీటి నిల్వలు పెరుగుతున్నాయి. దీంతో రైతన్నలు పొలం పనులు వేగవంతం చేస్తున్నారు. మరో వైపు తుంగభద్ర డ్యాంకు వరద ప్రవాహం అంతకంతకూ పెరుగుతోంది. ప్రస్తుతం ఇన్‌ఫ్లో లక్ష క్యూసెక్కులు నమోదవగా, డ్యాం నీటిమట్టం పదహారు వందల పందొమ్మిది అడుగులకు చేరింది. మైత్తం 105.788 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యానికి గానూ ప్రస్తుతం 59 టీఎంసీల నీటి నిల్వ నమోదవడంతో అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. శ్రీశైలం జలాశయం యాభై శాతానికి పైగా నిండింది. జూరాల నుంచి రెండులక్షల నలభై ఐదువేల క్యూసెక్కుల వరద వస్తుండగా, ప్రస్తుతం నీటిమట్టం ఎనిమిదివందల అరవై మూడు అడుగులకు చేరింది. జలాశయంలో నూట పద్దెనిమిది టిఎంసిల నీటి నిల్వ నమోదైంది.

# ఐబిఎం సేవలు ఇక విస్తృతం

## విశాఖలో 'ఐబిఎం ఫ్యూచర్ నౌ' సెంటర్‌ను ప్రారంభించిన మంత్రి లోకేష్

**విశాఖపట్నం, ఆగస్టు5 ప్రభాత వార్త :** ప్రపంచ దిగ్గజ ఐటీ సంస్థ ఐబిఎం, విశాఖపట్నంలో తన నూతన ఐబీఎం కన్సల్టింగ్ ఫ్యూచర్ నౌ సెంటర్ ను ప్రారంభించింది. ప్రపంచవ్యాప్తంగా ఏఐ, డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ సేవలకు మద్దతుగా విశాఖ ఇసుకతోట జంక్షన్ లోని లాన్సమ్ స్క్వేర్ భవనంలో ఐబీఎం సంస్థ ఏర్పాటుచేసిన ఫ్యూచర్‌నౌ సెంటర్‌ను ఐబీఎం ఇండియా, సౌత్ ఏసియా మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ పటేల్ తో కలిసి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఐ గవర్నెన్స్ ఇంటిలిజెన్స్, కెమికల్స్ అండ్ పెట్రోలియం ఇండస్ట్రీ ఆపరేషన్స్ గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా కన్సల్టింగ్ సేవలు, ఎఐ ఫస్ట్ ట్రాన్స్ ఫర్మేషన్ ప్రాజెక్టులకు మద్దతుగా ఐబీఎం కన్సల్టింగ్ ఫ్యూచర్‌నౌ సెంటర్ ను ఏర్పాటుచేయడం జరిగింది. భారతదేశ సాంకేతిక ఆవిష్కరణలు, ప్రతిభావంతులైన మానవ వనరుల అభివృద్ధిపై సంస్థ కొనసాగిస్తున్న పెట్టుబడులకు ఇది మరో కీలక ముందడుగు కానుంది. ఈ సెంటర్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఖాతాదారులకు కన్సల్టింగ్, సాంకేతిక సేవలను అందించనుంది. ఇందులో కృత్రిమ మేధస్సు (ఎఐ), హైబ్రిడ్ క్లౌడ్, సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్, డేటా, అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ, ఎంటర్‌ప్రైజ్ ట్రాన్స్‌ఫర్మేషన్ వంటి కీలక రంగాల్లో సేవలు అందించనున్నారు. అదేవిధంగా ఏఐ ఆధారిత క్లౌడ్ ట్రాన్స్‌ఫర్మేషన్, ప్లాట్‌ఫార్మ్ ఇంజనీరింగ్, సర్వీస్ ఇంటిగ్రేషన్, క్వాలిటీ ఇంజనీరింగ్, యూజర్ ఎక్స్‌పీరియన్స్ సేవలకు ఇది ప్రధాన కేంద్రంగా పనిచేయనుంది. ..ఫ్యూచర్ రెడీ టెక్నాలజీ వర్క్ ఫోర్స్ అభివృద్ధే లక్ష్యం భారతదేశంలోని అభివృద్ధి చెందుతున్న సాంకేతిక కేంద్రాల్లో ఆవిష్కరణలు, సేవల సామర్థ్యాలను విస్తరించాలన్న ఐబీఎం లక్ష్యానికి ఈ ఫ్యూచర్‌నౌ సెంటర్ ప్రతీకగా నిలుస్తోంది. విస్తృత సాంకేతిక ప్రతిభ, బలమైన విద్యాసంస్థలు, వేగంగా అభివృద్ధి చెందు తున్న సాంకేతిక పర్యావరణ వ్యవస్థతో విశాఖపట్నం ప్రపంచ >>2




బుధవారం విశాఖలో ఫ్యూచర్ నౌ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి లోకేష్

# అగ్రిగోల్డ్ భూములు 6వేల ఎకరాలు వేలం

## మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం

## 11 నాటికి విధివిధానాలు ఖరారు

**విజయవాడ.ఆగస్టు5,ప్రభాతవార్తప్రతినిధి:** అగ్రిగోల్డ్‌కు చెందిన 6,000 ఎకరాలకు పైగా భూములను వెంటనే వేలం వేయాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. సచివాలయంలో హోం మంత్రి వంగలపూడి అనిత అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో డిపాజిటర్ల ప్రయోజనాల పరిరక్షణపై సమగ్రంగా చర్చించారు. భూముల వేలం ప్రక్రియను వేగంగా ప్రారంభించాలని సిఐడి, పోలీసు శాఖలను సబ్ కమిటీ ఆదేశించింది. ఆస్తుల వేలానికి సంబంధించిన పూర్తి విధివిధానాలను ఈ నెల 11 నాటికి ఖరారు చేయనున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. బాధితుల కేసుల వేగవంతమైన విచారణ కోసం ఆగస్టు 15లోగా ప్రత్యేక కోర్టును కూడా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకుంది. 9 రాష్ట్రాల్లోని డిపాజిటర్లకు బాండ్లు అందించేందుకు ప్రతి రాష్ట్రంలో ప్రత్యేక సెల్స్, డిపాజిటర్ల సమాచారం కోసం ప్రత్యేక వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెస్తున్నారు. సెప్టెంబర్ 15 నాటికి బాండ్ల పంపిణీ ప్రక్రియ పూర్తి చేయాలని, సిఎం చంద్రబాబు నాయుడి ఆదేశాల మేరకు విడతల వారీగా చెల్లింపులు జరపాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అగ్రిగోల్డ్ డిపాజిటర్లకు న్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.. అగ్రిగోల్డ్‌కు చెందిన 20 వేల ఎకరాలు ఎపిలో ఉన్నాయి. 6 వేల ఎకరాల అగ్రిగోల్డ్ భూములను >>2



ఎగువ ప్రాంతాలలో కురుస్తున్న వర్షాలకు శ్రీశైలం జలాశయం నిండిన దృశ్యం

# ఉప్పొంగిన కృష్ణమ్మ

## శ్రీశైలం జలాశయానికి పోటెత్తిన వరద

## జూరాల 40 గేట్లు ఎత్తి నీటి విడుదల

## ఎస్సారెస్పీలో 37.37 టిఎంసిల నీటి నిల్వ

**హైదరాబాద్, ఆగస్టు 5, ప్రభాతవార్త:** ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న ఎడతెరిపి లేని భారీ వర్షాల కారణంగా కృష్ణమ్మ ఉప్పొంగి ప్రవహిస్తోంది. శ్రీశైలం జలాశయం పూర్తి నిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా ప్రస్తుతం 125.62 టీఎంసీల నీరు ఉంది. జలాశయానికి 24,518.3 క్యూసెక్కుల ప్రవాహం నమోదవుతుండగా, 800 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్, విద్యుత్ ఉత్పత్తి, దిగువ ప్రాంత అవసరాలకు అనుగుణంగా నీటి వినియోగం కొనసాగుతోంది. కర్ణాటకలోని రాయచూర్ జిల్లా కృష్ణ నదిపై నిర్మించిన గుర్జాపూర్, యాదగిరి జిల్లా గూడూరు భీమా నదిపై ఉన్న గుగ్గల్ బ్యారేజీకి వరద నీరు పోటెత్తడంతో ఈ బ్యారేజ్ 40 గేట్లను ఎత్తి దిగువకు నీటి విడుదల చేస్తున్నారు మూడులక్షల క్యూసెక్కుల నీటిని దిగువనున్న శ్రీశైలంకు వదులుతున్నారు. జూరాల వద్ద ఆయకట్టుకు దిగువన ఆరు యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. ఎగువ నుంచి భారీగా వస్తున్న వరద జలాలు తెలంగాణలోని జోగులాంబ గద్వాల జిల్లా జూరాల ప్రాజెక్టు కు చేరుతుండటంతో నది పరివాహక ప్రాంతం జలకళను సంతరించుకుంది. నది పూర్తిగా నీటితో నిండిపోవడంతో తెలంగాణకర్ణాటక సరిహద్దుల్లోని కృష్ణ బ్రిడ్జి కింద ప్రవహిస్తున్న వరద ప్రవాహం అద్భుతమైన దృశ్యాన్ని తలపిస్తోంది. ఈ దృశ్యాన్ని చూసేందుకు స్థానికులతో పాటు ప్రయాణికులు కూడా బ్రిడ్జి వద్ద చేరుకుని ఫోటోలు, వీడియోలు తీసుకుంటున్నారు. కృష్ణానదిలో రోజురోజుకు వరద ప్రవాహం పెరుగుతుండడంతో జూరాల ప్రాజెక్టు అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. నది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ఇదిలా ఉండగా, వరద ఉధృతి కారణంగా నదిలో స్నానాలు చేయకుండా, చేపల వేటకు వెళ్లకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. కృష్ణా నదిపై కర్ణాటకలో ఉన్న ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాలు నిండడంతో దిగువకు వరద కొనసాగుతోంది. ఆల్మట్టి నుంచి దిగువకు 1,49,597 క్యూసెక్కులు, నారాయణపూర్ నుంచి 1,47,776 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. తుంగభద్ర జలాశయంలో ప్రస్తుతం 51 టిఎంసిల నీరు ఉండగా 82వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. దిగువకు 1,589 క్యూసెక్కులు వదులుతున్నారు. నాగార్జునసాగర్ పూర్తి సామర్థ్యం 312 టిఎంసిలకు గాను ప్రస్తుతం 136 టిఎంసిల నిల్వ ఉంది .గోదావరిలో ఎగవ నుంచి తెలంగాణలోని తొలి ఎస్సారెస్పీ ప్రాజెక్టుకు 32831 క్యూసెక్కులు వదర వచ్చిచేరుతోంది. ప్రస్తుతం అందులో 37,37టిఎంసిలు నీరు నిలిచి ఉంది.

# ఐబిఎం సేవలు ఇక విస్తృతం

>> ఖాతాదారుల అవసరాలను తీర్చేందుకు అనువైన కేంద్రంగా ఎదుగుతోంది. ఈ సెంటర్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో ఐబీఎం తన కార్యకలాపాలను మరింత బలోపేతం చేయడంతో పాటు, భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన సాంకేతిక నైపుణ్యాలున్న మానవ వనరుల అభివృద్ధికి తోడ్పడాలని లక్ష్యంగా పెట్టుకుంది. ..ప్రపంచ డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో ఏపీ యువత భాగస్వామ్యం కావాలి ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ సేవలు, సాంకేతికత ఆధారిత ఆవిష్కరణలకు ప్రపంచ కేంద్రంగా విశాఖపట్నం ఆవిర్భవించడాన్ని ఐబీఎం ఫ్యూచర్‌నౌ సెంటర్ తోడ్పాటునందిస్తోందన్నారు. మా లక్ష్యం, కేవలం సాంకేతిక పెట్టుబడులను ఆకర్షించడం మాత్రమే కాదు, నాణ్యమైన ఉపాధిని సృష్టించడం, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న ప్రతిభను అభివృద్ధి చేయడం, ఆంధ్రప్రదేశ్ యువత ప్రపంచ డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో భాగమయ్యేలా చేసే ఒక సంపూర్ణ పర్యావరణ వ్యవస్థను నిర్మించడమే మా లక్ష్యమని అన్నారు.ఆంధ్రప్రదేశ్ పట్ల ఐబీఎం చూపుతున్న నిరంతర నిబద్ధతను మేం స్వాగతిస్తున్నామని, ఏఐ, డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ కోసం విశాఖపట్నాన్ని భారతదేశంలోని అగ్రగామి కేంద్రాలలో ఒకటిగా తీర్చిదిద్దడానికి ఐబీఎంతో కలిసి పనిచేయడానికిఎదురుచూస్తున్నామని అన్నారు. ..ప్రపంచ ఆవిష్కరణల గమ్యస్థానంగా భారత్‌ను తీర్చిదిద్దుతాం ఐబీఎం ఇండియా, సౌత్ ఏసియా మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ పటేల్ మాట్లాడుతూ... వికసిత్ భారత్2047 లక్ష్య సాధనలో భారతదేశానికి డిజిటల్ యుగంలో ప్రపంచానికి నాయకత్వం వహించే అపూర్వ అవకాశం ఉందన్నారు.ప్రతిభ, ఆవిష్కరణలు, సాంకేతిక సామర్థ్యాలను సమన్వయం చేసుకుంటూ ఈ లక్ష్యాన్ని సాధించవచ్చు. ఐబీఎంలో మేం, మా ఖాతాదారులు ఏఐతో పాటు ఇతర అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలను అందిపుచ్చుకుని, దీర్ఘకాలిక విలువను సృష్టించేందుకు అవసరమైన సామర్థ్యాలను నిర్మించడానికి కట్టుబడి ఉన్నామన్నారు.విశాఖపట్నంలోని ఐబీఎం కన్సల్టింగ్ ఫ్యూచర్‌నౌ సెంటర్ ఏర్పాటు ఇందుకు నిదర్శనం. అలాగే ప్రపంచస్థాయి ఆవిష్కరణలు, సాంకేతిక సేవల కేంద్రంగా భారతదేశ స్థాయిని మరింత బలోపేతం చేస్తుందని అన్నారు. ..యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పిస్తాం ఐబీఎం కన్సల్టింగ్ ఫ్యూచర్‌నౌ సెంటర్ ఇండియా మేనేజింగ్ పార్ట్‌నర్ ఉషా శ్రీకాంత్ మాట్లాడుతూ.. విశాఖపట్నంలో అభివృద్ధి చెందుతున్న సాంకేతిక ప్రతిభ, బలమైన విద్యాసంస్థలు, టెక్నాలజీ ఎకోసిస్టమ్ వల్ల ప్రపంచ ఖాతాదారుల డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ అవసరాలకు మద్దతు ఇచ్చే కీలక కేంద్రంగా మారుతోంది.

ఐబీఎం ఫ్యూచర్‌నౌ సెంటర్ ద్వారా అత్యాధునిక సాంకేతిక నైపుణ్యాలను స్థానిక ప్రతిభతో సమన్వయం చేస్తాం. ఏఐ, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌ను వేగవంతం చేయడంతో పాటు, స్థానిక యువతకు మరింత మెరుగైన ఉపాధి అవకాశాలను సృష్టించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. ప్రస్తుతం ఐబీఎం కన్సల్టింగ్ భారతదేశంలోని అహ్మదాబాద్, బెంగళూరు, భువనేశ్వర్, చెన్నై, కోయంబత్తూరు, గురుగ్రామ్, హైదరాబాద్, కొచ్చి, కోల్‌కతా, లక్నో, ముంబై, మైసూరు, నోయిడా, పుణె, విశాఖపట్నం సహా 15 ప్రాంతాల నుంచి ఫ్యూచర్‌నౌ సెంటర్లను నిర్వహిస్తోంది. ఐబీఎం ప్రపంచవ్యాప్తంగా హైబ్రిడ్ క్లౌడ్, ఏఐ, వ్యాపార సేవల రంగాల్లో అగ్రగామి సంస్థ. 175కి పైగా దేశాల్లోని సంస్థలు తమ డేటా నుంచి విలువైన సమాచారాన్ని పొందడం, వ్యాపార ప్రక్రియలను సరళీకృతం చేయడం, వ్యయాలను తగ్గించడం, పోటీ సామర్థ్యాన్ని పెంచుకోవడంలో ఐబీఎం సేవలను వినియోగిస్తున్నాయి. ఫైనాన్షియల్ సర్వీసెస్, టెలి కమ్యూనికేషన్స్, హెల్త్ కేర్ వంటి కీలక మౌలిక సదుపాయాల విభాగాల్లోని వేలాది ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు తమ డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్స్ ను వేగంగా, సమర్థంగా, భద్రంగా అమలు చేసేందుకు ఐబీఎం హైబ్రిడ్ క్లౌడ్ ప్లాట్‌ఫాం, రెడ్ హ్యాట్ ఓపెన్ షిఫ్ట్‌ను వినియోగిస్తున్నాయి.

# రాష్ట్రమంతా సమతుల్య అభివృద్ధి

>> ద్వారా విశాఖ పరిధిలో అభివృద్ధి చేపట్టాలని స్పష్టం చేశారు

**ఆర్థిక రాజధానిగా విశాఖ**

విశాఖ ప్రాజెక్టు ద్వారా లభించే ప్రయోజనాలు, ఉద్యోగావకాశాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు స్థానిక ప్రజలకు స్పష్టంగా వివరించాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రజా ఆకాంక్షలకు అనుగుణంగా పనులు చేపడుతూ విశాఖ రీజియన్‌ను ఆర్థిక రాజధానిగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. నీతిఆయోగ్ నిబంధనలు దాటకుండా పర్యావరణ పరిరక్షణతో కూడిన పారిశ్రామిక ప్రగతి సాధించేందుకు యంత్రాంగం సమన్వయంతో పని చేయాలని పిలుపునిచ్చారు. జాతీయ స్థాయిలో చర్చ జరుగుతున్న ఈస్ట్‌వెస్ట్ కనెక్టివిటీ ఆధారంగా విశాఖ ప్రాజెక్టు రూపకల్పన వేగవంతం కావాలని సిఎం చంద్రబాబు తెలిపారు. తూర్పు తీరంలో ఉన్న కాకినాడ, విశాఖ పోర్టులను పశ్చిమ భారత్‌లోని కీలక ప్రాంతాలతో రోడ్డు, రైలు మార్గాల ద్వారా అనుసంధానించాలని ఆదేశించారు. విశాఖ పరిధిలోని 4 విమానాశ్రయాలు, 3 ప్రధాన రేవులను అనుసంధానించడం ద్వారా భారీగా పెట్టుబడులతో పాటు రవాణా రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తాయని వివరించారు. గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు, ఫిన్‌టెక్, లాజిస్టిక్స్ రంగాలు ఒకదానితో ఒకటి ఇంటిగ్రేట్ అయ్యేలా కార్యాచరణ ఉండాలని అధికారులను కోరారు. పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడంలో భాగంగా విశాఖలోని జంతు ప్రదర్శనశాలను అంతర్జాతీయ ప్రమాణాలతో మరింత అభివృద్ధి చేయాలని స్పష్టం చేశారు.

**బీ సిటీ కోసం ప్రత్యేక ఎగ్జిక్యూటివ్ కమిటీ**

'బీసిటీ ప్రాజెక్ట్ అమలు కోసం ఎగ్జిక్యూటివ్ కమిటీని ఏర్పాటు చేయాలని సిఎం చంద్రబాబు ఈ సమీక్ష సమావేశంలో పేర్కొన్నారు. అన్ని ప్రాజెక్టులను అనుసంధానం చేస్తే మెరుగైన ఫలితాలు వస్తాయి. జీసీసి, ఫిన్ టెక్, లాజిస్టిక్స్ ఇంటిగ్రేషన్ రంగాలపై దృష్టి సారించాలి. ఈస్ట్ టూ వెస్ట్ కనెక్టివిటీపై ఇప్పుడు జాతీయ స్థాయిలో చర్చ జరుగుతోంది. ఇటీవలే ప్రధాని నరేంద్ర మోడీ కూడా ఇదే అంశాన్ని ప్రస్తావించారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రాజెక్టుల రూపకల్పన.. పెట్టుబడుల సాధన జరిగేలా ప్రణాళికలను సిద్దం చేయండి. రోడ్డు, రైల్ ఇంటిగ్రేషన్ జరగాలి. కాకినాడ, విశాఖలతో పశ్చిమ భారత్‌లోని వివిధ ప్రాంతాలను అనుసంధానం కావాలి. ముఖ్యంగా 4 ఎయిర్ పోర్టులు, 3 పోర్టులు లింక్ చేస్తే పెట్టుబడులు వేగంగా జరుగుతాయి... పెట్టుబడులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది. విశాఖలో జంతు ప్రదర్శన శాలను మరింత అభివృద్ధి చేసేలా చర్యలు చేపట్టాలి. అంతర్జాతీయ నగరంగా విశాఖ ఎదుగుతోంది. ఇలాంటి ప్రాంతంలో ఉన్న జంతు ప్రదర్శన శాల మంచి పర్యాటక ప్రాజెక్టు అవుతుంది." అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ సమీక్షకు సిఎస్ సాయి ప్రసాద్, ఆర్థిక, పరిశ్రమలు, పురపాలక, అటవీ, ఇంధన, పర్యాటక, విద్య, వైద్య శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# శ్రీశైలం జలాలు

>> ఇన్‌ఫ్లో వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నట్లు మంత్రి నిమ్మల వెల్లడించారు. పోతిరెడ్డిపాడు పరిధిలోని రిజర్వాయర్ల మంచినీటి కోసం గురువారం నుంచే 10 టిఎంసిల నీటిని విడుదల చేస్తున్నామని, హంద్రీనీవా పరిధికి 13 టిఎంసిలు, తెలుగుగంగ ద్వారా చెన్నై తాగునీటి సరఫరాకు 10 టిఎంసిలు, నాగార్జునసాగర్ రైట్, లెఫ్ట్ కెనాల్స్ పరిధికి 32 టిఎంసిల నీరు అవసరమవుతుందని వివరించారు. ప్రతి వారం పరిస్థితులను సమీక్షించుకుంటూ వర్షాలు, వరదల ఆధారంగా చర్యలు చేపడతామని మంత్రి నిమ్మల వెల్లడించారు. కలెక్టర్లు, ఇరిగేషన్, రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నీటి భద్రతను నిర్ధారించాలని మంత్రి ఆదేశించారు. శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతుంది. జూరాల నుంచి శ్రీశైలానికి 2 లక్షల 45 వేల క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తోంది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 863.90 అడుగులకు చేరింది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215 గిలీదిలు కాగా, ప్రస్తుతం 119 గిలీదిల నీటినిల్వ ఉంది. శ్రీశైలానికి వరద ప్రవాహం కొనసాగుతుండడంతో ఎడమ గట్టు జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించారు. విద్యుత్ ఉత్పత్తి చేసి 4,267 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 800 క్యూసెక్కుల వరద నీరు వదులుతున్నారని మంత్రి వివరించారు.

# 6వేల ఎకరాలు వేలం

>> వేలానికి సిద్ధం చేశామన్నారు. వేలం ప్రక్రియ వెంటనే ప్రారంభించాలని సిఐడిని ఆదేశించామన్నారు.ఆస్తుల వేలం విధివిధానాలు ఈ నెల 11లోగా ఖరారు చేస్తామన్నారు.అగ్రిగోల్డ్ చరాస్తుల స్వాధీనానికి ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామన్నారు.. సంస్థ రూ.6 వేల కోట్ల డిపాజిట్లు సేకరించింది. అగ్రిగోల్డ్ ఏపీ నుంచే రూ.3 వేల కోట్ల డిపాజిట్లు సేకరించింది. బాధితుల వివరాల కోసం ప్రత్యేక వెబ్‌సైట్ తెస్తాం. బాధితులకు బాండ్లు అందించేందుకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేస్తాం. సెప్టెంబర్ 15లోగా బాండ్ల ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం. అగ్రిగోల్డ్‌పై ఈ నెల 11న సీఎస్‌తో కీలక సమీక్షా సమావేశం ఉంటుంది. ఆగస్టు 15లోగా అగ్రిగోల్డ్ కేసులపై ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేస్తాం అన్నారు. ఈ ప్రక్రియపై ఈ నెల 11న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో మరో కీలక సమీక్ష సమావేశం జరగనుంది. ప్రభుత్వం భూముల వేలానికి శ్రీకారం చుట్టడంపై బాధితుల సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ, ఈ భూములను చిన్న బిట్లుగా విక్రయిస్తే బాధితులకు త్వరితగతిన పరిహారం అందుతుందని ముప్పాళ్ల నాగేశ్వరరావు అభిప్రాయపడ్డారు. సమావేశంలో అనగాని సత్యప్రసాద్, పయ్యావుల కేశవ్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# క్షమించండి

>> జుకర్‌బర్గ్ క్షమాపణలు చెప్పారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. యూజర్లకు ఏ కంటెంట్ చేరాలనేది ప్లాట్‌ఫామ్‌లే ఎంపిక చేసి పంపిణీ చేస్తున్నప్పుడు, వాటిని కేవలం మధ్యవర్తులుగా పరిగణించలేమని భారత అధికారులు మెటాకు స్పష్టం చేసినట్లు సమాచారం. ఇలాంటి పరిస్థితుల్లో ఐటీ చట్టం కింద లభించే సేఫ్ హార్బర్ రక్షణ వర్తించదని తేల్చిచెప్పారు. కొన్ని రకాల కంటెంట్‌ను ప్రోత్సహించేందుకు (బూస్టింగ్) భారీగా డబ్బులు చెల్లించినట్లు మెటా అంగీకరించిందని, ఈ తప్పులకు విచారం వ్యక్తం చేసిందని కూడా ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ప్రధాని మోడీ పోస్ట్ తొలగింపుపై మూడు రోజుల్లోగా బేషరతుగా క్షమాపణలు చెప్పాలని పార్లమెంటరీ ప్యానెల్ మెటానుఆదేశించింది. గడువులోగా స్పందించకపోతే మెటా సేఫ్‌హార్బర్ రక్షణను కోల్పోతుందని ఐటీమంత్రిత్వశాఖవర్గాలు హెచ్చరించాయి. ఈ పరిణామాల మధ్య మెటా ప్రతినిధులు ఐటీ కార్యదర్శితో భేటీ కావడం, కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో కూడా సమావేశం కానుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.

## వారం - వర్జ్యం

06-08-2026, గురువారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, దక్షిణాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, ఆశ్లేషకార్తె,
తి.అష్టమి సా.6.49 న.భరణి రా.8.10
వ.ఉ.6.24-ఉ.7.56
దు.1. ఉ.10.05-ఉ.10.56
దు.2. మ.3.12-సా.4.03
రాహు. మ.1.30-మ.3.00 శుభ లేదు.

## వార్తాఫలం

**మేషం :** ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా వుంటుంది. పెద్ద స్థాయిని కలిగిన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి.

**వృషభం :** ఇచ్చిన ఋణాలను తిరిగి వసూలు అవ్వటం కష్టమవుతుంది. కాంట్రాక్టులు దక్కుతాయి. ఆరోగ్యం జాగ్రత్త

**మిథునం :** మిత్రులతో చేయు నూతన కార్యక్రమములు ఉత్సాహకరముగా, లాభకరముగా ఉంటాయి. వస్త్ర లాభం.

**కర్కాటకం :** మీరు చెబితేనే గాని అభివృద్ధి పనులు మీ కార్యాలయములోని వారికి తెలియవు. వస్తువులు కొనుగోలు చేస్తారు.

**సింహం :** శత్రువుల మూలకముగా కొంత మానసిక ఆందోళనకు గురౌవుతారు. వాహన యోగం. మిత్రులను కలుస్తారు.

**కన్య :** స్త్రీలతో విభేదాలు ఏర్పడకుండా ముందుగానే జాగ్రత్తలు తీసుకోండి. మిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది.

**తుల :** అనేక లాభదాయక వ్యవహారములు మీకు అనుకూలముగా మారుట వలన అసూయ పెరుగుతుంది.

**వృశ్చికం :** కొన్ని త్యాగముల కొరకు నిర్బంధములను అతిక్రమించ వలసి వస్తుంది. ప్రయోషన్లకు అవకాశం ఉంది.

**ధనుస్సు :** సహోదర, సహోదరి వర్గీయులు కొన్ని కారణముల వలన దూరముగా వుంటారు. గృహనిర్మాణ యత్నాలు ఫలించవు. వాహన సౌఖ్యం.

**మకరం :** స్వజనుల నుండి సహాయ సహకారాలు అందుకుంటారు. విక్రయ ప్రదర్శనలు కలిసి వస్తాయి. ఇంటా బయటా అనుకూలం.

**కుంభం :** విద్యా సారస్వత, రాజకీయ రంగాలలో కొన్ని వివాదాలు రావచ్చు. వ్యాపార ప్రకటనలు ఆకర్షిస్తాయి.

**మీనం :** రహస్య విరోధులపై విచారణలు, అభియోగాలు సంభవం. ఉమ్మడిగా సాగించే కృషికి ప్రతిఫలం వస్తుంది.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ప్రత్యేక చట్టంతో బిసిలకు రక్షణ

>> సహకారంతో వీలైనంత త్వరగా బిసి రక్షణ అమలయ్యేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. విజయవాడలోని మురళీ ఫార్ప్యూన్ హోటల్ లో బిసి ముసాయిదా రక్షణ చట్టంపై రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత ఆధ్వర్యంలో బిసి సామాజిక వర్గానికి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో బుధవారం కీలక సమావేశం జరిగింది. సమావేశ అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రులు మాట్లాడారు. ముందుగా మంత్రి సవిత సవిత మాట్లాడుతూ.. ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు బిసి రక్షణ చట్టాన్ని కూటమి ప్రభుత్వం తీసుకొస్తోందన్నారు. బిసిలకు రాజకీయ, సామాజిక, ఆర్థిక గుర్తింపే సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. బిసిలను వేధించినా, జాతి, కుల వృత్తుల పేరుతో దూషించినా బిసి రక్షణ చట్టం కింద శిక్షార్హులున్నారు. బిసి రక్షణ చట్టం కేసుల్లో సత్వర పరిష్కారానికి ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సమావేశంలో ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అందజేసిన సలహాలు సూచనలను ఇప్పటికే రూపొందించిన బిసి ముసాయిదా రక్షణ చట్టం బిల్లులో పొందుపరుస్తామన్నారు. త్వరలో జిల్లాల్లోనూ బిసి సంఘాల ప్రతినిధుల అభిప్రాయాలను కూడా పరిగణలోకి తీసుకుంటామన్నారు. తుది నివేదికను త్వరలో జాతీయ బీసీ కమిషన్ కు అందజేస్తామన్నారు. బిసి కమిషన్ నుంచి గ్రీన్ సిగ్నల్ రాగానే, అసెంబ్లీలో ఆమోదానికి బిసి రక్షణ చట్టాన్ని సభలో ప్రవేశపెడతామన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో బిసి రక్షణ చట్టం అమలుకు కృషి చేస్తామని మంత్రి సవిత వెల్లడించారు. బిసిల అభ్యున్నతే లక్ష్యంగా అన్న ఎన్టీఆర్ పార్టీ ని స్థాపించారన్నారు. సిఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ సైతం బిసిలను అన్ని రంగాల్లో ముందంజలో ఉంచేలా వెన్నుదన్నుగా నిలుస్తున్నారన్నారు. బిసిలు సమాజానికి బ్యాక్‌బోన్లు అని వ్యక్తులు సిఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ అని మంత్రి సవిత తెలిపారు.

**బీసీలను వేధించిన గత ప్రభుత్వం: మంత్రి అచ్చెన్నాయుడు**

బిసి రక్షణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. మా పార్టీ ఆవిర్భావం నుంచి బిసిలు అండగా ఉంటూ వస్తున్నారన్నారు. వారు కుల వివక్షకు గురికాకుండా ఉండాలని భావించి బిసి రక్షణ చట్టానికి శ్రీకారం చుడుతున్నామన్నారు. దేశంలో ఎన్నో చట్టాలున్నా బిసిల రక్షణకు చట్టం లేదన్నారు. గత ప్రభుత్వ మధ్య పాలనలో బిసిలు తీవ్ర అన్యాయానికి గురయ్యారన్నారు. మంత్రి నారా లోకేష్ పాదయాత్ర సమయంలో బిసిలు తమ కష్టాలను ఆయన దృష్టికి తీసుకొచ్చారన్నారు. బిసిలకు రిజర్వేషన్లు కల్పించిన ఘనత అన్న ఎన్టీఆర్ దేనన్నారు. ఆ రిజర్వేషన్లను 27 శాతానికి సిఎం చంద్రబాబునాయుడు పెంచారన్నారు. ప్రభుత్వం మారాక గత ప్రభుత్వంలో బలహీన వర్గాలపై కక్ష కట్టి రిజర్వేషన్లు తగ్గించారని మండిపడ్డారు. న్యాయస్థానాలు చెప్పాయని బిసి రిజర్వేషన్లను తగ్గించేశారని, కాని, పైకోర్టుకు వెళ్లి గత ప్రభుత్వం న్యాయ పోరాటం చేయలేదని అన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే, రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో డెడికేటెడ్ బిసి కమిషన్ వేశామన్నారు. బిసి రిజర్వేషన్లను 34 శాతానికి పెంచేలా కృషి చేస్తామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. అంతకుముందు మంత్రి సవిత నేతృత్వంలో జరిగిన సమావేశంలో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తమ అభిప్రాయాలను తెలియజేశారు. బిసిలను వృత్తులపరంగా, కులాల పరంగా దూషించుకుండా ఉండేలా చట్టం అమలు చేయడంతో పాటు అవగాహన



బుధవారం ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో కురిసిన భారీ వర్షాలకు జలమయమయిన రోడ్లు

# విశాఖకు కొత్త రూపు

>> స్టిక్స్, షూటింగ్, వెయిట్‌లిఫ్టింగ్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్ తదితర క్రీడలకు ఈ అకాడమీ వేదికగా నిలుస్తుందని తెలిపారు. అత్యుత్తమ శిక్షణ, మౌలిక సదుపాయాలతో యువ క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసేలా స్పోర్ట్స్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తామని చెప్పారు.ఆంధ్రప్రదేశ్‌ను గొప్ప క్రీడాకారులను తయారు చేసే రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. ప్రతి చిన్నారిలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించడం ప్రభుత్వంతో పాటు తల్లిదండ్రులు, పాఠశాలల బాధ్యత అని అన్నారు. పిల్లలను క్రీడల్లో పాల్గొనేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. క్రీడలు కేవలం పతకాలు సాధించడానికే కాకుండా క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదల, ఓటమిని అధిగమించే ధైర్యాన్ని పెంపొందిస్తాయని లోకేష్ పేర్కొన్నారు. ప్రతి చిన్నారి తప్పనిసరిగా ఒక క్రీడలో పాల్గొనాలని సూచించారు.ఆంధ్రప్రదేశ్ క్రీడా రంగానికి సంబంధించిన ప్రభుత్వ విజన్‌ను సాకారం చేయడంలో పివి సింధు సహకారం ఎంతో అవసరమని మంత్రి అన్నారు. ముఖ్యంగా బాలికలు, మహిళలు క్రీడల్లో రాణించేలా అనుకూల వాతావరణాన్ని కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.రాష్ట్ర క్రీడాకారులకు అవసరమైన శిక్షణ, మౌలిక సదుపాయాలు, ఇతర సహాయాన్ని ప్రభుత్వం అందిస్తుందని హామీ ఇచ్చారు. ప్రతిభ ఉన్న ఏ చిన్నారి కూడా అవకాశాలు లేక క్రీడలకు దూరం కాకూడదన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. 'ఈ రోజు మనం కేవలం ఒక క్రీడా అకాడమీకి శంకుస్థాపన చేయలేదు.. భారతదేశ భావి ఛాంపియన్లకు బలమైన పునాది వేశాం' అని మంత్రి లోకేష్ పేర్కొన్నారు. భవిష్యత్తులో దేశం నలుమూలల నుంచి యువ క్రీడాకారులు విశాఖకు వచ్చి శిక్షణ పొందేలా పివి సింధు స్పోర్ట్స్ అకాడమీని అంతర్జాతీయ స్థాయి క్రీడా కేంద్రంగా అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.

# చంపినా సరే.. ప్రజలమధ్యే ఉంటా

>> ఉద్యమాన్ని హింసాత్మకంగా మార్చి, ఎన్నికైన ప్రభుత్వాన్ని గద్దె దించారని ఆరోపించారు.2024 అల్లర్ల సమయంలో 450కి పైగా పోలీస్ స్టేషన్లకు నిప్పు పెట్టారని, ప్రభుత్వ కార్యాలయాలపై దాడులు చేశారని, పలువురు పోలీస్ సిబ్బంది ప్రాణాలు కోల్పోయారని ఆమె ఆరోపించారు. తన ప్రసంగంలో 1975లో తన కుటుంబ సభ్యుల హత్యను గుర్తు చేసుకుంటూ హసీనా భావోద్వేగానికి గురయ్యారు. తన తండ్రి షేక్ ముజిబుర్ రెహ్మాన్‌తో పాటు 1971విమోచన పోరాటంలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరులకు నివాళలర్పించారు. ఇప్పుడున్న బంగ్లాదేశ్ తాము సృష్టించింది కాదని, గత రెండేళ్లుగా బంగ్లాదేశ్‌లో కష్టాలు పెరిగాయని అన్నారు. తాను దేశానికి దూరంగా ఉన్నా, ప్రజలకు ఎన్నడూ దూరంగా లేనని, తన కుటుంబం బంగ్లాదేశ్ కోసం పోరాడిందని చెప్పారు. మహ్మద్ యూనస్ పోలీసుల్ని చంపిన హంతకులకు క్షమాభిక్ష ప్రసాదించారని చెప్పారు. షేక్ హసీనా రెండేళ్ల తర్వాత తొలిసారి మౌనం వీడి బహిరంగంగా మాట్లాడారు. 2024 ఆగస్టు 5న బంగ్లాదేశ్ విడిచి భారత్ వచ్చిన ఆమె న్యూఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రసంగించారు. ఈ ప్రసంగం సందర్భంగా ఆమె చాలా సార్లు కన్నీరు పెట్టుకున్నారు. షేక్ హసీనా తర్వాత పాలనాధికారం చేపట్టిన తాత్కాలిక పాలకుడు మహ్మద్ యూనస్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. తన ప్రభుత్వాన్ని కూల్చేందుకు ముందే పక్కా ప్రణాళికను రూపొందించినట్లు ఆరోపించారు. ఈ కుట్ర నిజాన్ని మహ్మద్ యూనసే స్వయంగా బయటపెట్టారని అన్నారు. ఎన్నికైన తన ప్రభుత్వాన్ని అస్థిరపరచేందుకు వ్యవస్థీకృత రాజకీయ వర్గాలు పనిచేశాయని ఆరోపించారు. చివరకు ఈ ఉద్యమం తనను పదవి నుంచి తొలగించాలనే ఏకైకలక్ష్యంతో కొనసాగిందని పేర్కొన్నారు. విద్యార్థిఉద్యమాన్ని అడ్డంగా పెట్టుకుని బ్యాలెట్‌కు వెలుపల అధికారాన్ని చేజిక్కించుకోవాలనే ప్రయత్నం జరిగిందని విమర్శించారు. ఏ రాజకీయ పార్టీ లేదా సంస్థ పేరును ప్రస్తావించకపోయినా, దుష్ప్రచారంవల్లే పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారాయని వ్యాఖ్యానించారు. సంక్షోభం మొత్తం కాలంలో తమ ప్రభుత్వం చర్చలకే ప్రాధాన్యత ఇచ్చిందని, ఉద్యమం చాలా ముందుగానే రాజకీయ ప్రయోజనాల కోసం దారి మళ్లించబడిందని ఆమె పునరుద్ఘాటిం చారు. నన్ను జైలుకు పంపవచ్చు.. చంపేయవచ్చుకూడా. అయినప్పటికీ నా ప్రజల మధ్యకే తిరిగి వస్తాను. వారితో కలిసి ఉంటానని హసీనా భావోద్వేగంగా అన్నారు.దేశ ప్రజలు తీవ్ర కష్టాలు అనుభవిస్తు న్నారని, వారి బాధను ఇకపై చూస్తూ ఉండలేనని చెబుతూ తాను స్వదేశానికి తిరిగి వెళ్లాలని నిర్ణయించు కున్నానని వెల్లడించారు. డిసెంబర్ మా విజయమాసం. అందుకే డిసెంబర్‌లోనే బంగ్లాదేశ్‌కు తిరిగి రావాలని అనుకుంటున్నాను. ఆ ప్రయాణంలో ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు.

# ఎమ్మెల్సీ అనంత బాబు బెయిల్ పిటిషన్ రద్దు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 5,ప్రభాతవార్త:** కారు డ్రైవర్ దళితుడు సుబ్రహ్మణ్యం హత్య సంఘటనలో ప్రభావితం చేసి ప్రలోభాలకు గురిచేసిన కేసులో వైఎస్ఆర్సిపి ఎమ్మెల్సీ అనంత బాబు దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునేద్ అహ్మద్ మోలానా కొట్టి వేశారు. ఈ కేసులో బెయిల్ కోరుతూ వేసిన పిటిషన్‌పై బుధవారం కోర్టులో విచారణ జరిగింది. వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసులో ముద్దాయిగా ఉన్నటువంటి అనంత బాబు సాక్షులను బెదిరించి సుప్రీంకోర్టు ఇచ్చిన బెయిల్ నిబంధనలు ఉల్లంఘించారని హత్య కేసులో బెయిల్ రద్దు చేయడం జరిగింది. హత్య కేసులో సాక్షులను నిర్బంధించి బెదిరించి ఒక్కొక్కరికి లక్ష రూపాయలు బలవంతంగా ప్రోలోభపెట్టి తమకు అనుకూలంగా సుబ్రహ్మణ్యం హత్య కేసులో చెప్పాలని బెదిరించిన కేసులో నలుగురు సాక్షుల నుంచి సుమారు నాలుగు లక్షల రూపాయలు పోలీస్ వారికి స్వాధీనం చేయడం జరిగినది. అలాగే నాలుగో ముద్దాయిగా ఉన్న వ్యక్తి వద్దనుంచి పాతికవేల రూపాయలు ఒప్పుదల స్టేట్మెంట్ ద్వారా స్వాధీనం చేసుకోవడం అయినది. ప్రభావితం చేసి ప్రలోభాలకు గురి చేశారని సర్పవరం పోలీసులు పెట్టిన కేసులో ప్రథమ ముద్దాయిగా ఉన్నటువంటి అనంత బాబు రెండోసారి జిల్లా న్యాయమూర్తి కోర్టులో వేసుకున్న బెయిల్ కూడా డిస్మిస్ చేస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశాలు ఇవ్వడం జరిగినది. ప్రాసిక్యూషన్ తరపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ముప్పాల సుబ్బారావు వాదించారు.

## గుంటూరు, విజయవాడతో కలిపి

# అమరావతి మెగా సిటీ

## కృష్ణానదిపై వంతెనల కోసం అధ్యయన కమిటీ

## సిఆర్‌డిఏ అథారిటీలో నిర్ణయం

**విజయవాడ.ఆగస్టు5,ప్రభాతవార్తప్రతినిధి:** గుంటూరు, విజయవాడతో కలిపి అమరావతి మెగా సిటీని ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. ఈ మేరకు సిఆర్డిఏ అథారిటీ ప్రాథమిక ఆమోదం తెలిపినట్లు సమాచారం. దీనిలో భాగంగానే అమరావతి విజయవాడను కలిపేందుకు వీలుగా కృష్ణానదిపై మరిన్ని వంతెనలు నిర్మించేందుకు అవసరమైన నివేదిక తయారు చేసేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది.అమరావతి - విజయవాడ మధ్య ఎన్ని వంతెలను నిర్మించాలనే అంశాన్ని వీలైనంత త్వరగా అధ్యయనం చేయనున్నారు అమరావతి ఐ టెండర్ పిలిచేందుకు అథారిటీ అనుమతిచ్చిందని, టోటల్ క్యాపిటల్ సిటీ 217 కిలో మీటర్లకు 4 ఎస్ టీ పీలు వస్తాయని చెబుతున్నారు.అమరావతి మెగా సిటి అయితే కోటి జనాభా టార్గెట్ పెట్టుకున్నామని ఇప్పటికే సిఆర్‌డిఏ నిర్ణయాలను ఉటంకిస్తూ మంత్రి నారాయణ వెల్లడించారు.దీనికి వీలుగా ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. దీంతోపాటు కేంద్రీయ విద్యాలయం భూ కేటాయింపులకు సంబంధించి రిజిస్ట్రేషన్ స్టాంపుడ్యూటీ ఫీజును మినహాయించాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు.

# సాయికృష్ణ కేసులో ముగిసిన సిఐ నాగరాజు సిట్ కస్టడీ

**విజయవాడ.ఆగస్టు 5, ప్రభాతవార్తప్రతినిధి:** లాకప్‌డెత్ మృతుడు గాదె సాయికృష్ణ కేసులో సీఐ నాగరాజును సిట్ ఏడో రోజు బుధవారం విచారించింది.అయితే సీఐ నాగరాజు వారం రోజుల కస్టడీ నేటితోముగిసింది. విచారణ అనంతరం మధ్యాహ్నం విజయవాడ కోర్టులో హాజరు పరిచారు. ఎసీబీ కోర్టు ఆదేశాల మేరకు నాగరాజును సిట్ రాజమహేంద్రవరం కారాగారానికి తరలించనున్నది.వారం రోజుల విచారణలో సీఐ నాగరాజు దాదాపు సిట్‌కు సహకరించలేదంటున్నారు.

అయితే లాకప్‌డెత్ గోప్యతపై కీలక సమాచారాన్ని సిట్‌కు అందించారని సమాచారం,ఇక ఈ కేసులో కానిస్టేబుళ్లు అశోక్, నాని, బాబూరావు, సాంబయ్యను నేటి నుంచి సిట్ కస్టడీకి తీసుకోనున్నారు. నేటినుంచి 5 రోజుల పాటు నలుగురిని కస్టడీకి తీసుకోనుంది. సాయికృష్ణ కేసులో సీఐ నాగరాజు ఇప్పటివరకు ఎలాంటి సమాధానాలు ఇవ్వనట్లు తెలుస్తుంది.

# తెలుగు జాతి ఆత్మగౌరవానికి చిరునామా 'అమరావతి'

## • హోంమంత్రి వంగలపూడి అనిత • అమరావతి నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రులు

**విజయవాడ, ఆగస్టు 5 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ ఆత్మగౌరవానికి ప్రతీకగా అమరావతి ఆవిర్భవించిందని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. ప్రపంచ స్థాయి రాజధానిగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం దృఢ సంకల్పంతో పనిచేస్తోందన్నారు. బుధవారం రాష్ట్ర మంత్రులు నారాయణ, కొండపల్లి శ్రీనివాస్‌తో కలిసి హోంమంత్రి అమరావతి రాజధాని నిర్మాణ ప్రాంతాలను విస్తృతంగా పరిశీలించారు. మంత్రుల నివాస సముదాయాలు, ఎమ్మెల్యేలు- ఎమ్మెల్సీల నివాసాలు, సచివాలయ సముదాయం, హెచ్‌వోడీ ఐకానిక్ టవర్లు, ప్రధాన రహదారుల నిర్మాణ పనులు, ఇతర కీలక ప్రాజెక్టులను సందర్శించి పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా హోంమంత్రి మీడియాతో మాట్లాడుతూ, అమరావతి అంటే కేవలం రాజధాని కాదు, అది ప్రతి తెలుగు వ్యక్తి ఆత్మగౌరవానికి ప్రతీక అని అన్నారు. రాష్ట్ర విభజన తర్వాత శాసనసభలో అమరావతిని రాజధానిగా ఏకగ్రీవంగా ఆమోదించిన విషయాన్ని గుర్తు చేస్తూ, ఆ సమయంలో మద్దతు తెలిపిన వారే తర్వాత అధికారంలోకి వచ్చి


అమరావతి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రులు వంగలపూడి అనిత, పి.నారాయణ, కొండపల్లి శ్రీనివాస్

రాజధాని నిర్మాణాన్ని నిలిపివేసి రాష్ట్ర అభివృద్ధిని ఐదేళ్ల వెనక్కి నెట్టారని విమర్శించారు. ప్రజలు 2024లో ఎన్డీయే కూటమిపై విశ్వాసం ఉంచి ఇచ్చిన స్పష్టమైన తీర్పుతో అమరావతి నిర్మాణం మళ్లీ వేగం పుంజుకుందని తెలిపారు. మంత్రి నారాయణ నాయకత్వంలో రాజధాని నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని, ప్రతి నిర్మాణంలో నాణ్యత, ప్రణాళిక, వేగం స్పష్టంగా కనిపిస్తున్నాయని కొనియాడారు. అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయం, హెచ్‌వోడీ టవర్లు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల నివాస సముదాయాలు ఒకే పరిపాలనా కేంద్రంలో నిర్మితమవుతున్నాయని, ఇది దేశానికే ఆదర్శంగా నిలిచే రాజధానిగా అమరావతిని తీర్చిదిద్దుతుందని పేర్కొన్నారు. నిర్మాణంలో నిమగ్నమైన ప్రతి కార్మికుడు, నిర్మాణ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఇంజినీర్లు, కార్మికులు అమరావతితో భావోద్వేగ అనుబంధం పెంచుకొని పనిచేస్తున్నారని తెలిపారు. 2014లో ప్రారంభించిన నిర్మాణాలను మళ్లీ కొనసాగించడం సంతోషంగా ఉందని పలువురు ఇంజినీర్లు చెప్పడం అమరావతిపై ఉన్న నమ్మకానికి నిదర్శనమన్నారు.

**అమరావతే మా సంకల్పం:** అమరావతిని విమర్శించే వారు ఒకసారి స్వయంగా వచ్చి జరుగుతున్న అభివృద్ధిని పరిశీలించాలని హోంమంత్రి సూచించారు. 'అభివృద్ధి మా సమాధానం... అమరావతి మా సంకల్పం... ప్రజల విశ్వాసమే మా బలం' అని ఆమె స్పష్టం చేశారు. రాజధాని నిర్మాణ పనులు నిరాటంకంగా కొనసాగేందుకు శాంతిభద్రతలు, ట్రాఫిక్ నిర్వహణ, భద్రతా చర్యలకు ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. అమరావతి నిర్మాణాన్ని అడ్డుకునే ఎలాంటి అరాచకాలు, విధ్వంసక చర్యలను ప్రభుత్వం ఉపేక్షించదని హెచ్చరించారు. 2028 నాటికి అమరావతి తొలి దశ నిర్మాణాలను పూర్తి చేసి, ప్రపంచం గర్వించే రాజధానిగా, ప్రతి తెలుగు వ్యక్తి గర్వించే నగరంగా అమరావతిని నిలబెట్టడం ప్రభుత్వ లక్ష్యమని హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు.

# అక్టోబర్‌లో నోటిఫికేషన్.. డిసెంబర్‌లో పరీక్షలు

## డిఎస్సీపై మంత్రి నారా లోకేశ్ స్పష్టీకరణ



### • టెట్ ప్రారంభం, అభ్యర్థులకు మంత్రి శుభాకాంక్షలు

**విజయవాడ, ఆగస్టు 5 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో 'ఉపాధ్యాయ అర్హత పరీక్ష' (టెట్) ప్రారంభ నేపథ్యంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ 'ఎక్స్' వేదికగా అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసి విజయం సాధించాలని ఆకాంక్షించారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న టెట్ పరీక్షలను పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని పరీక్షా కేంద్రాల్లో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. ఇచ్చిన హామీ ప్రకారమే జాబ్ క్యాలెండర్ షెడ్యూల్ మేరకు తదుపరి డిఎస్సీ ప్రక్రియను కూడా పూర్తి చేస్తామని లోకేశ్ స్పష్టం చేశారు. అక్టోబర్‌లో డిఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి, డిసెంబర్‌లో పరీక్షలు నిర్వహించేలా విద్యాశాఖ చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఇప్పటికే 16,347 ఉపాధ్యాయ పోస్టులతో మెగా డిఎస్సీని విజయవంతంగా పూర్తి చేసిన విషయాన్ని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు.

# సమగ్ర శిక్ష ఉద్యోగుల జీతాల, డైట్ చార్జీల కోసం రూ.137.98 కోట్లు విడుదల

**విజయవాడ, ఆగస్టు 5 ప్రభాతవార్త ప్రతినిధి:** సమగ్ర శిక్ష పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందితో పాటు వివిధ కేడర్ల సిబ్బంది, ఉపాధ్యాయుల జూన్, జులై నెలల వేతనాలతో పాటు డైట్ చార్జీల చెల్లింపుల కోసం రూ.137.98 కోట్లు నిధులను విడుదల చేసినట్లు సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీ బి.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధుల విడుదల ప్రక్రియ పూర్తవ్వడంతో, రెండు నెలల బకాయి వేతనాలు, సంబంధిత అలవెన్సుల మొత్తం విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఈ నిధులను వెంటనే ఉద్యోగుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలని సిబ్బందికి సూచించారు.

# ఎపిఎన్ఆర్‌టి 292 కోఆర్డినేటర్ల నియామకం

**విజయవాడ, ఆగస్టు 5 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపి ఎన్ఆర్‌టి రెండో విడత జాబితాలో కోఆర్డినేటర్లను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించింది. రెండో విడతలో 292 మందిని కోఆర్డినేటర్లుగా నియమించింది. ప్రవాసాంధ్రుల అభ్యున్నతికి సంక్షేమం కోసం ఈ నియామకాలు చేపట్టినట్లు ఎపి ఎన్ఆర్‌టి ప్రకటించింది. భారత ఎంబసీలు, స్థానిక ప్రభుత్వాలతో సమన్వయం చేసుకుంటూ స్వచ్ఛంద సేవలు అందించేందుకు కోఆర్డినేటర్లు సహకరిస్తారని తెలిపింది. కొత్తగా కోఆర్డినేటర్లుగా నియమితులైన వారికి ఎన్ఆర్ఐ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎపి ఎన్ఆర్‌టి సొసైటీ ప్రెసిడెంట్ వేమూరి రవికుమార్ శుభాకాంక్షలు తెలిపారు.

# చట్టం ముందు అందరూ సమానులే

## • జగన్ కేసుల్లో 13 ఏళ్ల జాప్యం దేనికి? • సత్వర న్యాయంపై రాజ్యసభలో ఎంపి చింతకాయల విజయ్



**విజయవాడ, ఆగస్టు 5 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజ్యసభలో ప్రతిపాదించిన సుప్రీంకోర్టు న్యాయమూర్తుల (సవరణ) బిల్లు 2026కు తెలుగుదేశం పార్టీ తరఫున ఎంపి చింతకాయల విజయ్ పరిపూర్ణ మద్దతు ప్రకటించారు. సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్యను 33 నుండి 37కు పెంచడం సకాలంలో తీసుకున్న అభినందనీయమైన నిర్ణయమని పేర్కొన్నారు. సత్వర న్యాయం అందించే దిశగా ఈకోర్టులు, ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీని, అమరావతిలో జ్యుడీషియల్ మౌలిక వసతుల కల్పనకు విశేష కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజన్‌ను ఆయన సభలో ప్రముఖంగా ప్రశంసించారు. చట్టం ముందు సామాన్యులైనా, అత్యంత బలవంతులైనా సమానులేనని, న్యాయం ఆలస్యం అవ్వడం అంటే న్యాయం నిరాకరించబడటమేనని ఎంపి విజయ్ స్పష్టం చేశారు. ఇదే సందర్భంలో ఎపి మాజీ సిఎం వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసులను ఆయన రాజ్యసభలో విజయ్ తన ఉద్వేగభరిత ప్రసంగంలో ప్రస్తావించారు. జగన్‌పై 2013లో నమోదైన సిబిఐ, ఇడి కేసులు 13 ఏళ్లు గడుస్తున్నా విచారణ ముందుకు సాగాలేదు అని అన్నారు. డిశ్చార్జ్ పిటిషన్లు, న్యాయమూర్తుల బదిలీల సాకుతో ఉద్దేశపూర్వకంగానే జాప్యం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. తప్పు చేసిన వారు ఎంతటి వారైనా సకాలంలో విచారణ జరగాలని, ఇలాంటి సుదీర్ఘ జాప్యాల వల్ల న్యాయవ్యవస్థపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లుతుందని ఆయన కుండబద్దలు కొట్టారు. భారత జనాభా 150 కోట్లకు చేరుకున్న ప్రస్తుత తరుణంలో, సామాన్యులకు సైతం వేగంగా, పారదర్శకంగా న్యాయం అందాలన్నదే తమ ఆకాంక్ష అని ఎంపి తెలిపారు. వ్యవస్థపై ప్రజలకు పూర్తి భరోసా కలగాలంటే కేవలం అత్యున్నత న్యాయస్థానంతో పాటు హైకోర్టులు, కింది స్థాయి కోర్టులు, ముఖ్యంగా ప్రత్యేక సిబిఐ కోర్టులను సైతం ఏకకాలంలో బలోపేతం చేసి తీర్పులు వేగవంతం చేయాలని ఎంపి విజయ్ డిమాండ్ చేశారు.

# 8నుండి విజయవాడ- వాడపల్లి టూర్ ప్యాకేజీ

## - ఎపిటిడిసి జనరల్ మేనేజర్ టి.ఎస్.వి. నారాయణ

**విజయవాడ, ఆగస్టు 5 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఎపిటిడిసి) ఆధ్వర్యంలో ఈనెల8 (శనివారం) నుండి విజయవాడలోని సెంట్రల్ రిజర్వేషన్ ఆఫీస్ కేంద్రంగా ఒక రోజు 'విజయవాడ - వాడపల్లి టూర్ ప్యాకేజీ'ని అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు ఎపిటిడిసి జనరల్ మేనేజర్ టి.ఎస్.వి. నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులకు, పర్యాటకులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అత్యంత సౌకర్యవంతమైన రవాణా, ఆహార వసతులతో ప్రణాళికాబద్ధమైన తీర్థయాత్ర అనుభవాన్ని అందించడమే లక్ష్యంగా ఈ ప్యాకేజీని రూపకల్పన చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ టూర్ ప్యాకేజీ ఆగస్టు 8న ఉదయం 4:00 గంటలకు విజయవాడలోని సెంట్రల్ రిజర్వేషన్ ఆఫీస్ వద్ద ప్రారంభమై, తిరిగి సాయంత్రం 7:00 గంటలకు విజయవాడ చేరుకుంటుందన్నారు. ప్యాకేజీ ధర పెద్దలకు రూ.1,160, పిల్లలకు రూ.1,000గా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ రుసుములో సౌకర్యవంతమైన బస్సు రవాణా ఛార్జీలతో పాటు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజన వసతి కలిగి ఉంటాయని, అయితే ఆలయ దర్శనం టికెట్ ఛార్జీలను పర్యాటకులే స్వయంగా భరించాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రత్యేక యాత్రను సద్వినియోగం చేసుకోవాలనుకునే భక్తులు, పర్యాటకులు సంబంధిత వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో గానీ, లేదా విజయవాడ బందర్ రోడ్, లెమన్ ట్రీ హోటల్ పక్కన ఉన్న సెంట్రల్ రిజర్వేషన్ ఆఫీస్ వద్ద నేరుగా సంప్రదించి తమ సీట్లను ముందుగానే బుక్ చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ లిమిటెడ్ జనరల్ మేనేజర్ టిఎస్‌వి నారాయణ ఆ ప్రకటనలో తెలిపారు.

# గోదావరిలో ఏ ఘాట్‌లో స్నానం చేసినా పుణ్యం వస్తుందనే విశ్వాసం భక్తుల్లో కల్పించాలి

## • స్నాన ఘట్టాలవారి భక్తుల రద్దీ నిర్వహణకు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయండి • పుష్కరాల విశిష్టను తెలియజేయాలి
## • మఠాధిపతులు, పీఠాధిపతులు, ప్రముఖ ప్రవచనకర్తల సూచనలు సలహాలు తీసుకోండి • ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్



**సచివాలయం, ఆగస్టు 5 ప్రభాతవార్త:** రానున్న గోదావరి పుష్కరాల సమయంలో గోదావరి నది వెంబడి ఏస్నాన ఘట్టంలో పుష్కరస్నానం ఆచరించినా పుణ్యం లభిస్తుందనే విశ్వాసాన్ని భక్తుల్లో కల్పించేందుకు ఇప్పటి నుండే తగిన కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ అధికారులను అదేశించారు. గోదావరి పుష్కరాలు 2027పై బుధవారం సచివాలయంలో ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ గోదావరి పుష్కరాల విశిష్టతను ఏవిధంగా ప్రజల్లోకి తీసుకెళ్ళాలనే దానిపై ఇప్పటి నుండి ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు స్పష్టం చేశారు. ముఖ్యంగా 'స్నానం-దానం-పితృతర్పణం' వంటి నినాదంతో గోదావరి పుష్కరాల్లో రాష్ట్ర,దేశ విదేశీ భక్తులు అధిక సంఖ్యలో వచ్చి పుష్కర పుణ్యస్నానాలు ఆచరించే విధంగా తగిన కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. వివిధ మఠాధిపతులు, పీఠాధిపతులు, ఇతర ప్రముఖ స్వామీజీలు, ప్రముఖ ప్రవచన కర్తలను స్వయంగా కలిసి వారి సూచనలు, సలహాలను తీసుకొని పుష్కరాల సమర్ధ నిర్వహణతో పాటు విజయవంతానికి తగిన ప్రణాళికలను సిద్ధం చేసి, ఆసూచనలను పుష్కరాల కమ్యూనికేషన్ ప్లాన్‌లో పొందు పర్చాలని సిఎస్ చెప్పారు. పలానా స్నాన ఘట్టంలో స్నానం ఆచరిస్తేనే పుణ్యం వస్తుందనే అపోహను ప్రజల్లో తొలగించాలని సూచించారు. భక్తుల రద్దీ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యంగా రైలు, రోడ్డు మార్గాల్లో లక్షల్లో తరలివచ్చే భక్తులను ఏవిధంగా క్రమబద్ధీకరించాలనే కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని సిఎస్ అధికారులను ఆదేశించారు. గోదావరి పుష్కరాల ప్రత్యేకాధికారి, వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి జి.వీరపాండ్యన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తూ గత పుష్కరాలకు సుమారు 4కోట్ల 80లక్షల మంది భక్తులు రాగా వచ్చే ఏడాది జరిగే గోదావరి పుష్కరాలకు ఆసంఖ్య రెట్టింపు కానుందని అంచనా వేస్తున్నట్లు వివరించారు. గోదావరి పుష్కరాలకు సంబంధించి పోలవరం, ఏలూరు, తూర్పు, పశ్చిమ గోదావరి కాకినాడ, బిఆర్ అంబేద్కర్ కోనసీమ 6జిల్లాల్లో 3వేల 161కోట్ల రూ.ల అంచనాలతో 21శాఖల ద్వారా 4వేల 695వివిధ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇప్పటికే రూ.60కోట్ల పనులు మొదలయ్యాయని చెప్పారు. ప్రతి 15రోజులకు ఒకసారి అధికారులు అందరితో సమీక్ష నిర్వహించడం జరుగుతుందని వివరించారు.

సమావేశంలో రాష్ట్ర జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్, పిఆర్ అండ్ ఆర్డి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కాంతిలాల్ దండే, ఆర్థికశాఖ కార్యదర్శి రోనాల్డ్ రోజ్, పౌర సరఫరాల శాఖ కమీషనర్ కె.కన్నబాబు, ఐ అండ్ డిఆర్ డైరెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, ఏపి మారిటైం బోర్డు సిఈవో ప్రవీణ్ ఆదిత్య, దేవాదాయ శాఖ కమీషనర్ రామచంద్ర మోహన్, పర్యాటకాభివృద్ధి సంస్థ ఎండి పద్మావతి తదితర అధికారులు పాల్గొన్నారు. అదేవిదంగా సమావేశానికి వర్చువల్‌గా హోంశాఖ ముఖ్యకార్యదర్శి కుమార్ విశ్వజిత్, ఎంఎయూడి ముఖ్యకార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్, పోలవరం, ఏలూరు, తూర్పు, పశ్చిమ గోదావరి, కాకినాడ, బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఏలూరు రేంజ్ ఐజిలు అశోక్‌కుమార్, ఐజి రవిప్రకాశ్, ఇంకా పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# తక్కువ ఫీజుతో 'జర్నలిజంలో డిప్లొమా'

## సిఆర్ మీడియా అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేశ్‌కుమార్

**విజయవాడ, ఆగస్టు 5 ప్రభాతవార్త ప్రతినిధి:** అతి తక్కువ ఫీజుతో 'జర్నలిజంలో డిప్లొమా కోర్సు' చేసే మంచి అవకాశాన్ని సి.ఆర్. మీడియా అకాడమీ అందిస్తోందని ఛైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కోర్సు ప్రత్యేకంగా వర్కింగ్ జర్నలిస్టులకోసం ఉద్దేశించినదైనా, జర్నలిజం వృత్తిలో అభిరుచి కలిగిన డిగ్రీ ఉత్తీర్ణులైన సాధారణ అభ్యర్థులు కూడా ఈ డిప్లమా కోర్సుకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. జర్నలిజంలో ఉన్నత ప్రమాణాలు నెలకొల్పే లక్ష్యాలకు అనుగుణంగా ఈ కోర్సును రూపొందించామన్నారు. జర్నలిస్టులకు వృత్తిపరమైన విద్యార్హత ఉంటే మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. ఈ కోర్సు కాల వ్యవధి 6 నెలలని ఆయన తెలిపారు. ఎంపిక చేసిన రిటైర్డ్ అధ్యాపకులు, సీనియర్ జర్నలిస్టులచే క్లాసులు నిర్వహిస్తామన్నారు. ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు నాగార్జున యూనివర్సిటీ డిప్లొమా సర్టిఫికెట్ జారీ చేస్తుందన్నారు. వర్కింగ్ జర్నలిస్టులు డౌన్ లోడ్ చేసుకున్న దరఖాస్తులో తమ వివరాలు నింపి ఇంటర్ మీడియట్ సర్టిఫికెట్, అక్రిడిటేషన్ కార్డు లేదా ఐ.డి.కార్డు లేదా సర్వీసు ధ్రువీకరణ పత్రం జెరాక్స్ కాపీలను సెక్రెటరీ, సి.ఆర్. మీడియా అకాడమీ పేరున తీసిన రూ.2వేలు డిమాండ్ డ్రాఫ్ట్‌ను జతపరచి అప్లికేషనలను పంపుకోవాలని ఆయన సూచించారు. దరఖాస్తులను సెక్రెటరీ, ఆంధ్రప్రదేశ్ సి.ఆర్. మీడియా అకాడమీ, 406/48, 4వ అంతస్తు, రెవెన్యూ కాలనీ, మొగల్రాజపురం, విజయవాడ. 520 010కు పంపాలని సూచించారు. దరఖాస్తులు పంపేందుకు చివరి తేదీ ఆగస్టు 20 అని ఆయన తెలిపారు. సెప్టెంబర్ మొదటివారం నుంచి క్లాసులు ప్రారంభమౌతాయన్నారు.

# స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లపై ముఖ్య కార్యదర్శి శ్యామలరావు సమీక్ష



**విజయవాడ, ఆగస్టు 5 ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని పెరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్న స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లపై జి.ఎ.డి ముఖ్య కార్యదర్శి జె. శ్యామల రావు బుధవారం సమీక్షించారు. పెరేడ్ గ్రౌండ్స్‌లో జరుగుతున్న ఏర్పాట్లను సి.ఆర్.డి.ఏ కమిషనర్ విజయరామ రాజు, జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ, సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు కె.ఎస్.విశ్వనాథన్, పోలీస్ సూపరింటెండెంట్ వకుల్ జిందాల్, సి.ఆర్.డి.ఏ అదనపు కమిషనర్లు ఏ.భార్గవ తేజ, కొల్లాబత్తుల కార్తీక్, అభిషేక్‌లతో కలసి పరిశీలించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు, న్యాయాధికారులు, అధికారులు వచ్చే మార్గాలను, స్థలాలను పరిశీలించారు. స్వాతంత్ర్య దినోత్సవ ఆహ్వానాల ముద్రణ, పంపిణీపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. పెరేడ్ ఏర్పాట్లు పక్కా ఉండాలని అన్నారు. వేల సంఖ్యలో సాధారణ ప్రజానీకం హాజరు అయ్యే అవకాశాలు ఉంటాయని, అందుకు తగిన విధంగా కూర్చునే ప్రదేశాలు, తాగు నీరు, మరుగుదొడ్లు వంటి సదుపాయాలు దృష్టిలో పెట్టుకోవాలని చెప్పారు. పార్కింగ్ ప్రదేశం, వాహనాల రద్దీ దృష్ట్యా ట్రాఫిక్ ప్లాన్ పక్కాగా ఉండాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ శాఖలు తమ ప్రగతిని ప్రదర్శించే శకటాలు తయారీ పూర్తి చేయాలని, 13వ తేదీన జరిగే తుది రిహార్సల్స్‌లో ప్రదర్శన చూపాలని ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, తెనాలి రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీరమణి, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ ఐ.కిషోర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె విజయ లక్ష్మి, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి బి.వి.రంగా రావు, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె.కళ్యాణ చక్రవర్తి, విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజనీర్‌లు సి.హెచ్.రమేష్, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగసాయికుమార్, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయ లక్ష్మి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్, తదితరులు పాల్గొన్నారు.

# ఎసిబి వలలో లోపెంట విఆర్‌ఒ

**శ్రీకాకుళం, ఆగస్టు 5 ప్రభాతవార్త:** అవినీతి నిరోధక శాఖ అధికారుల వలకు మరో ఉద్యోగి చిక్కాడు. లావేరు మండలం లోపెంట సచివాలయంలో విఆర్‌ఒ ఏ.మల్లేశ్వరరావు రైతు నుంచి నగదు తీసుకుంటుండగా బుధవారం ఎసిబి అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. లోపెంట పరిధిలోని సహపురంలో చేపడుతున్న రీసర్వే కోసం రైతు నుంచి డబ్బులు డిమాండ్ చేయడంతో బాధిత రైతు ఎసిబి అధికారులను ఆశ్రయించినట్టు తెలిసింది. ఎసిబి అధికారుల సూచనతో విఆర్‌ఒ మల్లేశ్వరరావు బాధిత రైతు నుంచి నగదు తీసుకుంటుండగా ఎసిబి అధికారులకు చిక్కాడు. రణస్థలం కొవ్వాడ అణువిద్యుత్ కేంద్రం పునరావాసంలోనూ అవినీతికి పాల్పడినట్లు మల్లేశ్వరరావుపై అనేక అభియోగాలు ఉన్నాయి. ప్రస్తుతం ఎసిబి తనిఖీలు ఎంత మొత్తం తీసుకున్నాడన్న వివరాలు తెలియాల్సి ఉంది. లోపెంట సచివాలయంలో ఎసిబి అధికారులు తనిఖీలు నిర్వహించి ఉద్యోగులందరినీ విచారిస్తున్నారు. దాడుల వివరాలను ఎసిబి ఉన్నతాధికారులు వెల్లడిస్తారని రైడ్‌లో పాల్గొన్న అధికారులు స్పష్టం చేశారు. తనిఖీల్లో ఎసిబి డిఎస్‌పితో పాటు సిఐలు ఎస్‌వి రమణ, భాస్కరరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థినులతో మసాజ్.. ఇద్దరు సస్పెన్షన్

## నంబులపూలకుంట కెజిబివి టీచర్, ప్రిన్సిపల్‌పై వేటు

**అనంతపురం(క్రైమ్) ఆగస్టు 5 ప్రభాతవార్త:** శ్రీసత్యసాయి జిల్లా నంబుల పూలకుంట కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులతో మసాజ్ చేయించుకున్న ఘటన తీవ్ర కలకలం రేపిన నేపథ్యంలో బాధ్యులైన హిందీ టీచర్ రూపారాణి, విధుల్లో నిర్లక్ష్యం వహించిన ప్రిన్సిపల్ రెహానాలను ఉద్యోగం నుంచి తొలగిస్తూ విద్యాశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. నంబులపూలకుంట కెజిబివి పాఠశాలలో హిందీ టీచర్‌గా పని చేస్తున్న రూపారాణి, విద్యార్థినులకు పాఠాలు చెప్పాల్సింది పోయి వారిచేత సొంత పనులను చేయించుకోవడం, తలకు కొబ్బరి నూనె రాయించుకోవడం, ఒళ్ళంతా మసాజ్ చేయించుకోవడం, ఒళ్లు నొక్కించుకోవడం వంటి వ్యక్తిగత పనులు చేయించుకునేవారు. ఈ వ్యవహారం గత కొన్నాళ్ళుగా జరుగుతున్నా బయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. విద్యార్థినులతో టీచర్ రూపారాణి మసాజ్ చేయించుకుంటున్న దృశ్యాలను పాఠశాలలో ఉన్న కొందరు రహస్యంగా ఫోటోలు, వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ ఫోటోలు నెట్టింట తీవ్రంగా వైరల్ కావడంతో ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ వ్యవహారంపై స్పందించిన జిల్లా విద్యాశాఖ అధికారులు, ప్రత్యేక అధికారుల బృందంతో ప్రాథమిక విచారణకు ఆదేశించారు. పాఠశాలను సందర్శించిన విచారణాధికారులు స్థానిక విద్యార్థినులు, సిబ్బంది నుంచి సమాచారం సేకరించి విచారణ పూర్తి చేశారు. విచారణలో టీచర్ రూపారాణి విద్యార్థులతో అనైతికంగా మసాజ్ చేయించుకున్నట్లు ఆధారాలతో సహా రూఢీ కావడంతో అధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రిన్సిపల్ రెహానా విఫలమవ్వడం, ఈ విషయాన్ని దాచిపెట్టే యత్నం చేశారన్న ఆరోపణలతో ఇద్దరినీ విధుల నుంచి తొలగిస్తూ అధికారులు కఠిన చర్యలు తీసుకున్నారు.




# చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరిస్తాం

## వారికి అండగా నిలుస్తాం: బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

**విజయవాడ, ఆగస్టు 5 ప్రభాతవార్త ప్రతినిధి:** బిజెపి ఒబిసి మోర్చా ఆధ్వర్యంలో చేనేత సమ్మేళనం ఏర్పాటు చేశారు. రాఘవయ్య పార్కు నుంచి తుమ్మలపల్లి కళాక్షేత్రం వరకు ప్రదర్శన నిర్వహించారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ వివేకానంద విగ్రహానికి నివాళులర్పించి ర్యాలీ నిర్వహించారు. మగ్గం, రాట్నం, చేనేత కులాల రుషుల చిత్రపటాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఈ సందర్భంగా చేనేత కులాల ఐక్యత, సంక్షేమమే చేనేత సమ్మేళనం ప్రధాన లక్ష్యమని మాధవ్ అన్నారు. చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించి వారికి అండగా నిలుస్తామన్నారు.

చేనేత కుటుంబాలకు స్థిర ఉపాధి, ఆదాయం పెరిగేలా చర్యలు తీసుకోవాలని, సంప్రదాయ చేనేత కళను పరిరక్షించడం అందరి బాధ్యత అని మాధవ్ అన్నారు. వృత్తికారులకు బిజెపి మాత్రమే పూర్తి న్యాయం చేస్తోందన్నారు. వారి ఉత్పత్తులు మార్కెట్‌లో గిరాకి పెంచుతుందన్నారు.

# విఆర్ఎల పదోన్నతులకు లైన్‌క్లియర్

## నిబంధనల్లో సవరణలు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

**విజయవాడ, ఆగస్టు 5 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో పనిచేస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకులకు (విఆర్ఎ) గుడ్ న్యూస్ చెప్పింది. వారు విఆర్‌ఒగా ప్రమోషన్లు పొందేందుకు వీలుగా నిబంధనల్లో కీలక సవరణలు చేసింది. ఈ మేరకు జీవో కూడా జారీ చేసింది. దీని ప్రకారం విఆర్ఎలు గ్రేడ్-2 విఆర్‌ఒలుగా ప్రమోషన్ పొందేందుకు అవసరమైన డిగ్రీ అర్హత సంపాదించేందుకు షరతులతో అనుమతి మంజూరు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో తెలిపింది. రాష్ట్రంలో విఆర్ఎలకు విఆర్‌ఒలుగా ప్రమోషన్లు పొందేందుకు ఉన్న నిబంధనల్ని సడలిస్తూ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ అధికారుల సర్వీస్ రూల్స్, 2008లో సవరణలు చేసింది. ఈ సవరణల ప్రకారం 2023 మార్చి 10న జారీ చేసిన జి.ఓ.ఎం.ఎస్. నెం.104కు ముందు నియమితులైన విఆర్ఎలు ప్రస్తుతం డిగ్రీ అర్హత లేకపోయినా షరతులతో విఆర్‌ఒ గ్రేడ్-2గా నియామకం పొందేందుకు అర్హులు అవుతారు. అయితే వారికి ఓ కీలక షరతు పెట్టింది. ఈ జీవో అమల్లోకి వచ్చిన తేదీ నుంచి ఐదేళ్లలోపు వారు తప్పనిసరిగా డిగ్రీ పూర్తి చేయాలి. నిర్ణీత గడువులో డిగ్రీ అర్హతను సాధించలేకపోతే, వారిని తిరిగి విఆర్ఎ పోస్టుకే తిరిగి పంపిస్తారు. చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ పతిపాదనల ఆధారంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం సర్వీసులో ఉన్న ఇంటర్మీడియట్ అర్హతతో పనిచేస్తున్న విఆర్ఎలకు పదోన్నతి అవకాశాన్ని కల్పించడంతో పాటు, ఉన్నత విద్యను పూర్తి చేసుకునేందుకు సమయం ఇవ్వడమే ఈ సవరణ ఉద్దేశమని ప్రభుత్వం జీవోలో పేర్కొంది. ఈ సవరణతో రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది విఆర్ఎలకు విఆర్‌ఒ గ్రేడ్-2 పోస్టుకు ప్రమోట్ అయ్యేందుకు మార్గం సుగమం కానుంది. అయితే, ఐదేళ్లలోపు డిగ్రీ పూర్తి చేయడం తప్పనిసరి అని ప్రభుత్వం స్పష్టం చేసింది.

వార్త

ఆరోగ్యం, మంచి శరీరం బంగారం కంటే మించినవి. మంచి మనసు అంతులేని సంపద కంటే విలువైనది.

న- ఎమర్సన్

# వలసలకేదీ దారి?


చరిత్రలో వలసలు, వలస రాజ్యాల ఊసులు మనకు కొత్తేమీ కాదు. కానీ ఆధునిక ప్రపంచంలో కూడా ఎందరో తామున్న చోట దుర్భర దారిద్ర్యాన్ని అనుభవించలేక హుటాహుటిన మరో ప్రాంతానికి తరలివెళ్లడమే విచిత్రం. నాలుగు రోజుల నాడు మొరాకో నుంచి స్పెయిన్‌లోకి దాదాపు అరవై వేల మంది శరణార్థులు వలస వచ్చారు. ఒక్కొక్కరుగా వస్తే తెలిసేది కాదు. ఒకేసారి మిడతల దండులా స్పెయిన్ మీద పడటమే వారిని ఇబ్బందులపాల్జేసింది. ఇదే ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. వాళ్లు ఎలాంటి పరిస్థితుల్లో వచ్చారో ఆలోచించడం మానిస్పెయిన్ పాలకులు అవాక్కయ్యారు. అంతేకాదు ఏమిచేయాలోపాలుపోని పరిస్థితులలో స్పెయిన్ దళాలు కాల్పులు కూడా జరిపాయి. ఈ హఠాత్పరిణామానికి హతాశులై అటు ఇటూ పరుగెట్టిన వలసదారులు 72 మంది మరణించారని అంచనా. అలా వెళ్లిన వారిలో సుమారు 45 వేల మందికి పైగా మొరాకోవాసులు తిరిగిస్పెయిన్‌కు వెళ్లిపోయారు. ఇలా వలసల ధాటికి యూరప్ ఎంతో ఆందోళన చెందుతోంది. ఈ విషయమై యూరోపియన్ యూనియన్ స్పెయిన్‌లోని సెయూటాగరంలోకి చొరబడిన మొరాకో వాసుల సంఖ్యను బట్టి చూస్తే ఆ నగర జనాభాలో దాదాపు 70 శాతం మంది ఉన్నారు. వారందరినీ స్పెయిన్ యువత తీవ్రంగానే అడ్డుకొంది. సముద్రతీరం నుంచి పర్వత ప్రాంతమైన సరిహద్దు దాటి కూడా వాళ్లు వలసవచ్చేశారు. పడవల్లో ఎందరో ప్రయాసతో వచ్చి చేరుకున్నారు. అయినా స్పెయిన్‌లో పరిస్థితులు సానుకూలపడక నరకయాతన అనుభవించారు. సముద్రంలో ఈదుకుంటూ వచ్చిన వారిలో సుమారు 100 మంది మరణించారు. వలసదారుల్ని అదుపు చేయడంలో స్పెయిన్ దళాలు వాటర్ కెనాన్‌లు, బాష్పవాయు ప్రయోగాలు, కొన్ని సందర్భాల్లో కాల్పులకు తెగబడ్డారు. ఈ తొక్కిసలాటలో చనిపోయిన వారెందరో, ప్రాణాలకు తెగించి అయిదు గంటలపాటు సముద్రాన్ని ఈదుకొంటూ వచ్చినా స్పెయిన్ భద్రతా దళాలు ఆటంకపరచడమే కాకుండా సెయూటాలో తమకు ఆశ్రయమే కాదు ఆహారం, నీరు కూడా లభించలేదని కొందరు మొరాకో వాసులు ఆవేదన వెలిబుచ్చిన సందర్భాలు కూడా గోచరించాయి. చెప్పాలంటే మొరాకో వాసులపై ఎన్నో దాష్టీకాలే జరిగాయి. యూరోపియన్ యూనియన్‌కు ఆది నుంచీ వలసదారుల బెడద ఎక్కువగానే ఉంది. ఆఫ్రికా దేశాలతో అస్థిరత, అంతర్యుద్ధాలు, ఆర్థిక సంక్షోభాల కారణంగా వేలాదిమంది శరణార్థులు, వలసదారులు యూరప్‌వైపు పరుగులు తీస్తున్నారు. దాంతో ఆఫ్రికా శరణార్థులను నీచంగా చూస్తూ యూరప్ దేశాలు తీసుకుంటున్న నిరోధక చర్యలు ఎంతో ఇబ్బందికరంగా పరిణమిస్తున్నాయి. వలసదారుల భారాన్ని గ్రీస్, ఇటలీ, స్పెయిన్ వంటి సరిహద్దు దేశాలుమాత్రమే మోయలేవు కనుక పదేళ్లనాడే దాదాపు యూరోపియన్ దేశాలన్నీ ఒక ప్రణాళికను రూపొందించుకుంది. ఆ మేరకు అన్ని దేశాలు శరణార్థుల్ని నేరుగా స్వాగతించాలి. కానీ చాలా యూరప్ దేశాలు అందుకు భిన్నంగా అనుసరించే వైఖరి వలసదారులకు ప్రాణాంతకమౌతోంది. ఆఫ్రికా దేశాలు ఏమంత సంపన్నదేశాలు కావు. అలాఅని అభివృద్ధి చెందిన దేశాలు కావు. ఆ కారణం చేత అక్కడ జీవన పరిస్థితులు దుర్భరమైనప్పుడు సరిహద్దు దేశాల్లోకి వలసలు వచ్చేస్తున్నారు. సరిహద్దు దేశాలంటే అతిసమీపంలో ఉన్నా ఎంతో శ్రమకోర్చి అక్కడికి చేరుకోవాల్సిందే. గత్యంతరం లేకనే ఈ వలసలు. ఈ 'సాలిడారిటీ' పథకం కింద శరణార్థులను స్వాగతించలేకపోయినట్లయితే వారికి భారీ మొత్తంలోఆర్థిక వితరణ అందించాలి. అవేమీ లేకుండానే తాజా వలసదారులపై స్పెయిన్ కొరడా ఝుళిపించింది. కనీస ఆతిథ్య మర్యాదలలో భాగంగా మంచినీరు కూడా అందించలేకపోయింది. సరిహద్దుల రక్షణ ఎంతముఖ్యమో, శరణార్థుల పట్ల మానవతా దృక్పథం చూపించడమూ అంతే ముఖ్యం. కానీ ఈ రెండు అంశాల మధ్య యూరోపియన్ యూనియన్ నలిగిపోతోంది. మానవ హక్కుల ఉల్లంఘనలో హంగేరి, పోలాండ్ వంటిదేశాలు కూడా స్పెయిన్ వంటి యూరోపియన్ దేశాల చర్యలకు వంత పాడుతున్నాయి. ఈయుకు వెలుపలనున్న మొరాకో వంటి దేశాలతో సత్సంబంధాలుమంచివేనని, అదే సమయంలో స్పెయిన్‌లో అక్రమ ప్రవేశాలను కట్టుదిట్టం చేయడం అవసరమని బుధవారం జరిగిన యూరోపియన్ యూనియన్ దేశాల ఐక్యతా సమావేశం నిర్ణయించింది. ఆయా దేశాల భద్రతా చర్యలతోపాటు వలసదారుల పట్ల మానవ హక్కుల పరిరక్షణకూడా ప్రాధాన్యత నివ్వాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పాయి. ఉత్తర ఆఫ్రికాలోని ఆర్థిక అసమానతలు, నిరుద్యోగం, సామాజిక అసంతృప్తి, ఐరోపా వలస విధానాల పరిమితులపై అవగాహన, ఇరు దేశాల మధ్య ఉండే దౌత్యసంబంధాల సంక్లిష్టతలను మెరుగుపరుచుకోవాల్సిన ఆవశ్యకత ఉంది. స్వదేశంలో అవకాశాల కొరత, జీవన భద్రతలో సమస్యలు ఏర్పడినప్పుడే వలసల సమస్య ఏర్పడ్తుందని అన్నిదేశాలు గుర్తించదగినది. మొరాకో, స్పెయిన్‌ల మధ్య వలసల సంక్షోభం సరిహద్దుల భద్రతకే కాదు, మానవత్వానికే పరీక్ష అన్న ధోరణిలో శరణార్థుల పట్ల సుహృద్భావ ధోరణితో వ్యవహరించడానికి అన్ని కట్టుబాట్లు సిద్ధం చేసుకునేందుకు యూరోపియన్ యూనియన్ ముందుకొచ్చింది. అనేకమంది యువత మెరుగైన జీవితంకోసం ప్రాణాలను పణంగా పెట్టడమంటే స్వదేశంలో వారికి అవకాశాలకొరత ఎంత బలీయంగా ఉందో తెలుస్తుంది. పైగా వలసల వ్యవహారంలో కొన్ని మానవ అక్రమరవాణా ముఠాలు ప్రేరేపణలపైకన్నేసి ఉంచాలని, ఇప్పటికే తమదేశాల్లో అపరిచితుల్లా ఉండిపోయిన శరణార్థులను బలప్రయోగంలేకుండా తిప్పిపంపడంపై శ్రద్ధవహించే దిశగా ఆయాదేశాలు పయనిస్తున్నాయి. వలసలకుమూల కారణాలను అన్వేషించి పరిష్కరించే సమగ్ర విధానాలే ఈ తరహా సంక్షోభాలకు శాశ్వత పరిష్కారం చూపగలవు.

సలహా ఇచ్చేటప్పుడు విచక్షణ పాటించాలి. స్వీకరించేటప్పుడు వినమ్రంగా ఉండాలి.



స్వామి వివేకానంద

సోమరిలా, బలహీనంగా నూరేళ్లు బతకడం కన్నా, దృఢసంకల్పంతో కొద్ది కాలమైనా జీవించడం ఉత్తమం.



అరిస్టాటిల్

## ప్రజావాక్కు



### అల్లూరి సీతారామరాజు విమానాశ్రయం

ఉత్తరాంధ్ర అభివృద్ధి చరిత్రలో భోగాపురంలో నిర్మితమైన అల్లూరి సీతారామరాజు గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం ఒక కీలక ఘట్టం. రాజకీయాలకుఅతీతంగా ఈవిమానాశ్రయం ఆంధ్రప్రదేశ్‌కు, ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రాంతానికి దీర్ఘకాలిక ఆర్థికాభివృద్ధికి బలమైన పునాది వేయనుంది. గిరిజనుల హక్కుల కోసం పోరాడిన మహనీయుడు అల్లూరి సీతారామరాజు పేరును ఈ విమానాశ్రయానికి ఇవ్వడం చారిత్రకంగా సముచిత నిర్ణయం. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు ఇదికొత్తఆర్థిక ద్వారంగా మారనుంది. పర్యాటక రంగానికి ఊత మివ్వడంతో పాటు, సముద్ర ఉత్పత్తుల ఎగుమతులు, ఔషధ పరిశ్రమలు, సమాచార సాంకేతిక రంగం, లాజి స్టిక్స్, గిడ్డంగుల ఏర్పాటు, విమానయాన అనుబంధ పరిశ్రమల విస్తరణకు ఇది విశేష అవకాశాలు కల్పిస్తుంది. ఉద్యోగాలసృష్టితోపాటుపెట్టుబడులను ఆకర్షించి యువతకు ఉపాధిఅవకాశాలను పెంచేసామర్థ్యంఉంది.

- హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### అందరి ప్రాణాలు ఫోన్‌లోనే..

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో పని చేయుచున్న ఉపాధ్యాయుని ఉపాధ్యాయుల కోసం, విద్యార్థిని విద్యార్థుల కోసం లీప్ యాప్ ప్రవేశపెట్టింది. అందరి హాజరుతో పాటు, వార్షిక పరీక్షల్లో వచ్చిన మార్కులు, టెస్టులలో వచ్చిన మార్కులు, అసెస్మెంట్ చేసినప్పుడు వచ్చిన మార్కులు, కరికులర్ కోరికులర్ ఎక్స్ట్రా క్యులర్ యాక్టివిటీస్ అన్ని నమోదు చేసే విధంగా హోలిస్టిక్ ప్రెస్ కార్డును కూడా ప్రవేశపెట్టింది. అయితే బైజుస్ కంటెంట్‌కి బదులుగా క్లికర్స్ అనే కంటెంట్‌ని ఉపయోగించమని అధికారులకు సూచించారు. ఇది డేంజర్ యాప్.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### నీటి వృథాను అరికట్టాలి

తెలంగాణ కాంగ్రెసు ప్రభుత్వం తమ ప్రాబల్యంగల ప్రాంతాలను అశాస్త్రీయంగా గ్రేటర్ హైదరాబాద్‌లో కలుపుతూ గ్రేటర్‌పై ఆధిపత్యానికి పాకులాడ్తోందని బిజెపి రాష్ట్ర చీఫ్ అన్నట్లు పత్రికల్లో వచ్చింది. మున్సిపాలిటీలలో అంతటా విలువైన వర్షపునీరే కాక జలమండలిచే శుద్ధి చేయబడిన తాగునీరు పైపుల లీకేజీ ద్వారా రోడ్లపైకి వచ్చి మ్యాన్‌మోల్స్ ద్వారా డ్రైనేజీలో కలిసిపోతున్నాయి. ఈ నీటి వృథాను అరికట్టాలి.

-వి.ఆర్.ఆర్.ఎ.రాజు, హైదరాబాద్

### ఉత్తుత్తి మాటలేనా..

ముఖ్యమంత్రి గారూ తిరుపతిజిల్లా, ప్రకాశం జిల్లాలలో కల్కి, దొంగస్వామీ ప్రభుత్వ భూములు ఆక్రమించి ఆశ్రమాల పేరుతో మోసంచేస్తుంటే, రెవెన్యూ అధికారులు దొంగ స్వాములకు సాష్టాంగ పడుతున్నారు. మీరు జోక్యం చేసుకోరా? ప్రభుత్వ భూములాక్రమిస్తే జైలే గతి అన్నారు కదా. ఉత్తుత్తి మాటలేనా? తిరుపతి జిల్లాలో కల్కి దళితుల అసైన్డ్ భూములు, అటవీ భూములు ఆక్రమించి ఆశ్రమం పేరుతో చెక్కభజనలు ,యజ్ఞాలు యాగాలు చేస్తున్నారు. అటవీ భూమిలో విదేశీయులను రప్పించి, అటవీ నిబంధనలకు వ్యతిరేకంగా రాత్రుళ్ళు భజనలు చేస్తున్నారు. కల్కి పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. బాధ్యతారహితంగా రెవెన్యూ యంత్రాగం ఉంది. అదేవిధంగా ప్రకాశం జిల్లాలో దొంగ రామదూత కూడా కోట్లాది రుపాయల చెరువు పోరంబోకు ఆక్రమించి దీక్షలు చేస్తున్నారు. ప్రిన్సిపల్ సెక్రెటరీ2021లో దొంగస్వామి ఆక్రమించిన భూములను స్వాధీనం చేసుకోవాలని ఆదేశించింది. ఇంత వరకు అతీగతిలేదు. మీరేమో ఆక్రమిస్తే జైలే అంటున్నారు. అధికారులేమో దాసోహం అంటున్నారు. మీరు జోక్యం చేసుకొని ఆక్రమించిన భూములను స్వాధీనం చేసుకోవాలి.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### కుంటల తవ్వకంతో చేపల పెంపకం

తెలంగాణ ప్రభుత్వం నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచాలనే ఉద్దేశంతో చేపట్టిన జలసిరి కార్యక్రమంలో పంట కుంటలు తవ్వించాలి అని నిర్ణయించారు. ఒక రకంగా ఇది రాజస్థాన్ మోడల్ అయినా తెలంగాణకు సరిపోయే మోడల్ ఇది. ఒక తెలంగాణకు మాత్రమే కాదు భూ పరివేష్టిత రాష్ట్రలాన్నింటికి సరిపోయే మోడల్ ఇది. తెలంగాణలో సగటు కమతం పరిమాణం తక్కువ కాబట్టి 8..8ఫారం పాండ్స్‌ని ఎక్కువ మొత్తంలోచేయాలి. తెలంగాణలో ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న 75 వేల చెరువులు నూతన ఆర్థిక విధానాలు అభివృద్ధి పేరుతో కల్లోలం ఆయినాక మిగిలిన 46531 చెరువులలో పూడికపనులు అయినాక చేపలపెంపకం ఎక్కువ అయింది.

- భారత అవినాష్, జనగామ

### దళితుల భూములను అభివృద్ధి చేయాలి

తెలంగాణ రాష్ట్రంలో అధిక పేద సామాజిక వర్గమైన షెడ్యూల్ కులాల వ్యవసాయ భూములను, బావులను అభివృద్ధి చేయవలసిన అవసరంఉంది. షెడ్యూల్ కులాల కార్పొరేషన్, సోషల్ వెల్ఫేర్, డిపార్టుమెంట్‌ల పర్యవేక్షణలో రాష్ట్ర వార్షిక బడ్జెట్ నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి | ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# ఉచిత వైద్యసేవలే ప్రజలకిచ్చే వరం

***ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ ద్వారా పేషంట్ల మెడికల్ హిస్టరీని ట్రాక్‌చేసే విధానాన్ని ఎక్కువగా పబ్లిక్ ప్రైవేట్ ఇన్స్టిట్యూట్స్ చేపట్టే హెల్త్ మేనేజ్మెంట్ విధానాన్ని అవలంభించాలి! డ్రగ్ క్వాలిటీ రెగ్యులేషన్లను తప్పక పాటించాలి! కొత్త కొత్త విధా నాలతో రెగ్యులేషన్లను అప్డేట్ చేసుకోవాలి! తక్కువ స్థాయి లో ఉత్పత్తిచేసే మాన్యుఫ్యాక్చర్ సంస్థలను నిరంతర తనిఖీల ద్వారా అదుపులో వుంచాలి! సబ్ స్టాండర్డ్ మాన్యుఫ్యాక్చరర్లను శిక్షించాలి! ప్రజా ఆరోగ్య విధానాలు ఎన్నో పాటించగులుగుతేనే ప్రభుత్వాలు, మెడికల్ సంస్థలూ ఆసుపత్రుల ద్వారా రోగులకూ వ్యాధిగ్రస్తులకు నిరంతర సేవను చేసేందుకు ఆస్కారం వుంటుంది! అన్నిటికంటే మించి ఉచిత వైద్య సౌకర్యం ప్రభుత్వాలు కల్పించగలిగితే అంతకంటే మించిన వైద్య సేవ మరొకటి వుండదు! అప్పుడే డాక్టరును ప్రజలు 'దేవుడి'గా భావిస్తారు!***



రావులపాటి సీతారాంరావు

ప్రజారోగ్య విధానాలు నిర్దిష్టంగా రూపొందించటం ప్రతి ప్రభుత్వం ప్రథమ కర్తవ్యం! అయితే విధానాల రూపకల్పన ఆర్థిక శక్తి మీద ఆధారపడి వుంది! ఆర్థిక పురోగతి సాధించిన దేశాలలో ప్రజారోగ్యం ప్రాథమిక అవసరంగా గుర్తించటం వల్ల చాలావరకు ప్రభుత్వమే ఉచిత ఆరోగ్య సేవలు అందజేస్తున్నది! సరాసరి తలసరి ఆదాయం కొన్ని దేశాల్లో ఎక్కువగా వున్నప్పటికిని, ఆ దేశ లెక్కల ప్రకారం తక్కువగా వున్న క్రింది తరగతి ప్రజానీకానికి మరింతగా ఆరోగ్యం పట్ల ఖర్చు చేస్తున్నది! కోవిడ్ 19 పెండమిక్ ఈ విధానాలను దాదాపు ప్రతి దేశంలో దెబ్బ తీసింది! దానితో ఆరోగ్య విధానాలకు సహాయకారిగా వుండే 'డెవలప్మెంట్ అసిస్టెన్స్ ఫర్ హెల్త్ (డి.ఎ.హెచ్) కోవిడ్ తర్వాత తగ్గ ముఖం పట్టింది! ప్రతి రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ ప్రజారోగ్యం కోసం బడ్జెట్లో నిధులను కేటాయించటం జరుగుతుంది! వేరు వేరు శాఖలకు కేటాయించిన బడ్జెట్ నిధులను లెక్కిస్తే 'హెల్త్ కేర్'కు కేటాయించిన నిధులను ఖర్చుచేసే విధానాలలో ఈ మధ్య కాలంలో లోపాలు పెరుగుతున్నాయి! ప్రతి సంవత్సరం గ్లోబల్ వ్యవస్థలో అమెరికా, హెల్త్ కోసం ఇచ్చే సహాయం కోవిడ్19 తర్వాత దాదాపు 67 శాతం(ఫారిన్ అసిస్టెన్స్ ప్రోగ్రాం)లో తగ్గించింది. అమెరికా మాదిరే యు.కె., ఫ్రాన్స్, జర్మనీ గూడా 39శాతం, 35 శాతం, 12 శాతం (దేశాల వరుసలో) తగ్గించాయి! దీంతో ప్రజారోగ్యానికి తోడ్పడే ఆర్థిక సహకారం తగ్గుమొహం పట్టటంతో ఆరోగ్య పరిస్థితులు మన దేశంలో కూడా గడ్డ పరిస్థితులను ఎదుర్కోవలసి వచ్చింది! ఎంతకాలం ఇతర దేశాల సహాయ సహకారాల మీద కాలం గడుపుతాం? స్వయం కృషితో ఆర్థిక వ్యవస్థ పురోభివృద్ధి సాధనతో ఆరోగ్య విధానాలను పరిస్థితుల దృష్ట్యా మార్చుకుంటూ మెరుగుపర్చుకోక తప్పదు!. జాతీయ బడ్జెట్ కూడా కొన్ని పరిస్థితుల వల్ల (అంటే అప్పులు వడ్డీలు) అనుకున్నంతగా ఆరోగ్య వ్యవస్థకు ఆర్థిక సహకారం అందించలేకపోతున్నది! దాదాపు 102 ట్రిలియన్స్ 2024లో వడ్డీ రికార్డు స్థాయికి గ్లోబల్ పబ్లిక్ డెత్ చేరుకుంది! అందుకోసమే ఉన్నంతలో ఆరోగ్య వ్యవస్థకు ఎక్కువ డబ్బు సమకూర్చక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఎంతయితే బడ్జెట్ ప్రకారం కేటాయించబడిందో ఆ మొత్తం డబ్బు ఆరోగ్య భద్రత కోసమే ఖర్చు పెట్టాలి! ఖర్చు అవసరమైన వాటి కోసమే పెట్టాలి. తక్కువ డబ్బు వెచ్చించటం వల్ల మన దేశ ప్రజల ఆరోగ్యాలను కాపాడటంలో వెనకడుగు వేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. నేషనల్ హెల్త్ మిషన్



(ఎన్.హెచ్.ఎం) లెక్కల ప్రకారం అంటువ్యాధులు, అంటు వ్యాధులు కాని ప్రోగ్రాంస్కు చెందాల్సిన డబ్బుల్లో కేవలం 26 శాతం మాత్రమే ఖర్చు చేయటం దారుణం! పాలసీలకు క్షేత్రస్థాయిలో అమలుకు భారతప్రభుత్వం నిర్దిష్టమైన సంస్థాగత, రెగ్యులేటరీ పర్యవేక్షణ ఆరోగ్య శాఖ విషయంలో అవసరంగా మారింది. వైద్య విద్యా విధానం కూడా దేశ మంతటా ఒకే మాదిరిగా తీర్చిదిద్దాలి! వైద్యులుగా బయట ప్రపంచంలోకి అడుగుపెట్టేవారు మౌలికమైన వృత్తి నైపుణ్యాన్ని నేర్చుకున్నారని స్పష్టమైన నమ్మకం ప్రభుత్వాలకూ ప్రజలకూ కలిగేందుకు 'నేషనల్ ఎగ్జిట్ టెస్ట్' అన్ని రాష్ట్రాలలోనూ నిర్వహించిన తర్వాతనే వారిని మెడికల్ గ్రాడ్యుయేట్సుగా గుర్తించాలి! చాలా మెడికల్ కాలేజీలు దేశమంతటా వెలుస్తున్నాయి! దానికి కారణం నేషనల్ మెడికల్ కమీషన్ (ఎన్.ఎమ్.సి) నిబంధనలను సడలించటం వల్ల! కొత్తగా వచ్చిన ఈ కాలేజీలలో కావల్సిన రీతిలో స్టాండర్డ్స్ అవలంబిస్తున్నారా లేదా అని మానిటరింగ్ చేయాలి! అంతేగాదు పేరుకే ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న 'ఘోస్ట్ ఫ్యాకల్టీ'ని కనిపెట్టేందుకు సరియైన చర్యలు క్షుణ్ణంగా తీసుకోవాలి! రీజనల్, డిస్ట్రిక్ట్ హాస్పిటల్స్‌లో పోస్ట్ గ్రాడ్యుయేట్, సూపర్ స్పెషాల్టీ ట్రైనింగ్ సీట్లను పెంచటం వల్ల లోకల్ డాక్టర్లు అందుబాటులో లేని సమస్యను పరిష్కరించినట్లవుతుంది! ఆయుష్మాన్ భారత్ (ఎబిపియంజె) ఎకో సిస్టమ్‌ను పెంచటం వల్ల అవుట్ పేషంట్ల కవరేజ్ ఎక్కువవుతుంది. ఆ పని సత్వరం చేపట్టాలి! ఈ సౌకర్యంతో ఎక్కువ మందికి మెడికల్ సదుపాయం కలుగుతుంది! ప్రాథమికంగా కేర్ తీసుకోవటంతో పాటు, ప్రివెంటివ్ చర్యలు గ్రామ సీమలలో ప్రైమరీ హెల్త్ సెంటర్ల ద్వారా చేపట్టాలి! ఆ చర్యల వల్ల పెద్ద హాస్పిటల్స్ చుట్టూ చిన్న చిన్న ఆరోగ్య సమస్యలతో తిరిగే వారి సంఖ్య తగ్గుతుంది! డ్రాఫ్ట్ నేషనల్ హెల్త్ రిసెర్చ్ పాలసీ 2026 ను త్వరితగతిన యాక్టుగాచేయాలి! పేషంట్లను దృష్టిలో పెట్టుకొనిపబ్లిక్ ఫండ్స్‌ను సమకూర్చాలి! కేవలం పబ్లిసిటీ చర్యలతో కార్యక్రమాలు తలపెట్టినట్లుగా పైపై కంటి తుడుపు చర్యలు మానేయాలి! వైద్యంలో కొత్త కొత్త ప్రయోగాలను పేషంట్లను ఆధారం చేసుకొని చేపట్టినట్లయితే సంతృప్తికర, ఉపయోగకరమైన ఫలితాలు రోగులకు రిలీఫ్ నిచ్చే విధంగా వుంటాయి. క్షేత్రస్థాయి ప్రయోగాలకు ఎక్కువ అవకాశాలు ఇవ్వాల్సిన సమయం ఆసన్నమయింది! ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ ద్వారా పేషంట్ల మెడికల్ హిస్టరీని ట్రాక్ చేసే విధానాన్ని ఎక్కువగా పబ్లిక్ ప్రైవేట్ ఇన్స్టిట్యూట్స్ చేపట్టే హెల్త్ మేనేజ్మెంట్ విధానాన్ని అవలంభించాలి! డ్రగ్ క్వాలిటీ రెగ్యులేషన్లను తప్పక పాటించాలి! కొత్త కొత్త విధానాలతో రెగ్యులేషన్లను అప్డేట్ చేసుకోవాలి! తక్కువ స్థాయిలో ఉత్పత్తిచేసే మాన్యుఫ్యాక్చర్ సంస్థలను నిరంతర తనిఖీల ద్వారా అదుపులో వుంచాలి! సబ్ స్టాండర్డ్ మాన్యుఫ్యాక్చరర్లను శిక్షించాలి! ప్రజా ఆరోగ్య విధానాలు ఎన్నో పాటించగులుగుతేనే ప్రభుత్వాలు, మెడికల్ సంస్థలూ ఆసుపత్రుల ద్వారా రోగులకూ వ్యాధిగ్రస్తులకు నిరంతర సేవను చేసేందుకు ఆస్కారం వుంటుంది! అన్నిటికంటే మించిఉచిత వైద్య సౌకర్యం ప్రభుత్వాలు కల్పించగలిగితే అంతకంటే మించిన వైద్య సేవ మరొకటి వుండదు! అప్పుడే డాక్టరును ప్రజలు 'దేవుడి'గా భావిస్తారు!

# దేశ ప్రగతికి బాటలు వేస్తున్న 'ఆర్థికం'

ఇస్కా రాజేష్ బాబు

దేశీయ లావాదేవీలు సహా దిగుమతుల ద్వారా పన్ను వసూళ్లు పెరగడంతో జులైలో స్థూల జీఎస్టీ వసూళ్లు రూ.2.11 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. గతేడాది జులైతో పోలిస్తే ఈ వసూళ్లు 15.4శాతం ఎక్కువని కేంద్ర ఆర్థిక శాఖ తెలిపింది. సీజీఎస్టీ రూ.39,835 కోట్లు, ఎస్జీఎస్టీ రూ.47,881 కోట్లు, ఐజీఎస్టీ వసూళ్లు రూ.1,23,000 కోట్లుగా ఉన్నాయి. గతనెలలో రిఫండ్లు 13.1 శాతం పెరిగి రూ.29,968 కోట్లకు చేరుకున్నాయి. రిఫండ్లను మినహాయించిన అనంతరం నికర జీఎస్టీ ఆదాయం 1.81లక్షల కోట్లుగా ఉంది. దేశీయ వ్యాపార లావాదేవీలు ఊపందుకోవడం, విదేశాల నుంచి దిగుమతులు భారీగా పెరగడంతో భారత ఆర్థిక వ్యవస్థ మరోసారి తన బలాన్ని చాటుకుంది. జూలై నెలలో దేశవ్యాప్తంగా వస్తు, సేవల పన్ను వసూళ్లు రూ.2.11 లక్షల కోట్లకు చేరుకుని కొత్త రికార్డు నమోదు చేశాయి. గత ఏడాది ఇదే నెలతో పోలిస్తే 15.4 శాతం వృద్ధి నమోదవగా, గత 14 నెలల్లో ఇదే అత్యధిక వృద్ధి రేటు కావడం విశేషం. దిగుమతులపై వసూలైన జీఎస్టీ 28.8 శాతం పెరిగి రూ.66,511 కోట్లకు చేరగా, దేశీయ లావాదేవీల ద్వారా వచ్చిన జీఎస్టీ 10.1శాతం వృద్ధితో రూ.1.45లక్షల కోట్లుగా నమోదైంది. దేశంలో వినియోగం, వ్యాపార కార్యకలాపాలు మరింత బలపడుతున్నాయనే సంకేతాలను ఈ గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో రెండోసారి రూ.2 లక్షల కోట్ల మార్కు. ఏప్రిల్‌లో రూ.2.43 లక్షల కోట్ల ఆల్‌టైమ్ రికార్డు నమోదైన తర్వాత, మేలో రూ.1.94 లక్షల కోట్లు, జూన్‌లో రూ.1.95లక్షల కోట్లు వసూలయ్యాయి. జూలైలో మళ్లీ రూ.2.11 లక్షల కోట్లతో రూ.2 లక్షల కోట్ల మార్కును దాటి మరోసారి రికార్డు సృష్టించింది. వ్యాపారులకు రూ.29,968 కోట్ల రీఫండ్లు చెల్లించిన తర్వాత ప్రభుత్వానికి వచ్చిన నికర జీఎస్టీ ఆదాయం రూ.1.81 లక్షల కోట్లు. ఇది గత ఏడాదితో పోలిస్తే 15.8 శాతం అధికం. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జులై వరకు మొత్తం జీఎస్టీ వసూళ్లు రూ.8.43 లక్షల కోట్లకు చేరాయి. గత ఏడాది ఇదే కాలంలో వసూలైన రూ.7.66 లక్షల కోట్లతో పోలిస్తే 10.1శాతం వృద్ధి నమోదైంది. ఈసారి జీఎస్టీ వృద్ధికి ప్రధాన కారణం దిగుమతులపై పన్ను వసూళ్లు భారీగా పెరగడమేనని అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. అదే సమయంలో దేశీయ ఆర్థిక కార్యకలాపాలు కూడా బలంగా కొనసాగడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయం గణనీయంగా పెరిగింది. రాష్ట్రాల వారీగా పరిశీలిస్తే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ జీఎస్టీ వసూళ్లలో రెండంకెల వృద్ధిని నమోదు చేసి దేశంలోనే అత్యుత్తమ ప్రదర్శన కనబర్చాయి. ఇది రెండు రాష్ట్రాల్లో ఆర్థిక కార్యకలాపాలు వేగంగా పెరుగుతున్నాయనే విషయాన్ని స్పష్టం చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నెలవారీ జీఎస్టీ ఆదాయ నివేదిక ప్రకారం, జులై నెలలో మొత్తం జీఎస్టీ వసూళ్లు రూ.2.11 లక్షల కోట్లకు చేరుకున్నాయి. గతేడాది జూలై నెలతో పోలిస్తే వార్షిక ప్రాతిపదికన 15.4 శాతం పెరుగుదల కనిపించింది. డొమెస్టిక్ ట్రాన్సాక్షన్స్, దిగుమతులకు సంబంధించిన ఆదాయం వలన జీఎస్టీ వసూళ్లు జోరు కొనసాగుతోందని తాజా గణాంకాలు సూచిస్తున్నాయి. డొమెస్టిక్ ట్రాన్సాక్షన్స్‌ద్వారా వచ్చిన గ్రాస్ జీఎస్టీ ఇన్‌కమ్, గత ఏడాది ఇదే నెలలో నమోదైన రూ.1.31లక్షల కోట్ల నుంచి 10.1శాతం పెరిగి, 2026 జూలైలో రూ. 1.45 లక్షల కోట్లకు చేరింది. దీనితోపాటు దిగుమతులపై వసూలైన జీఎస్టీలో గణనీయమైన పెరుగుదల కనిపించింది. దిగుమతులకు సంబంధించిన జీఎస్టీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 28.8శాతం పెరిగి రూ.66,511 కోట్లకు చేరింది. ఇది ఆ నెలలో దేశం మొత్తం స్థూల జీఎస్టీ వసూళ్లను రూ.2.11 లక్షల కోట్లకు పెరిగేందుకు కారణమైంది. జూలై నెలలోప్రభుత్వం ఎక్కువ మొత్తంలో జీఎస్టీ రీఫండ్లను కూడా జారీ చేసింది. గత ఏడాదితో పోలిస్తే మొత్తం రీఫండ్లు 13.1 శాతం పెరిగి రూ. 29,968 కోట్లకు చేరాయి. ఈ రీఫండ్స్ విషయంలో ఎక్కువగా గణనీయంగా ఎగుమతిదారుల వాటా ఉంది. ఐన్‌గేట్ సిస్టమ్ ద్వారా ప్రాసెస్ చేయబడిన రీఫండ్స్ ఏడాదితో పోలిస్తే 22.7శాతం పెరిగి రూ. 12,288 కోట్లకు చేరినట్లు గణాంకాలు చెబుతున్నాయి. జీఎస్టీరీఫండ్స్‌ను పరిగణనలోకి తీసుకున్న తర్వాత, నికర జీఎస్టీ వసూళ్లు రూ.1.81 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. ఇది జూలై 2025తో పోలిస్తే 15.8 శాతం పెరుగుదల. నెట్ డొమెస్టిక్ రెవెన్యూ 10.5 శాతం పెరిగి రూ. 1.27 లక్షల కోట్లకు చేరగా, నికర కస్టమ్స్ జీఎస్టీ ఆదాయం 30.3 శాతం భారీవృద్ధితో రూ.54,223 కోట్లకు పెరిగింది. కేంద్ర ఆర్థిక శాఖ తెలిపిన వివరాల ప్రకారం, గత ఏడాది ఏప్రిల్ నెలలో జీఎస్టీ వసూళ్లు రూ.2.43 లక్షల కోట్లు వచ్చాయి. ఈ ఏడాదిలో దేశీ దిగుమతుల ద్వారా జీఎస్టీ రెవెన్యూ 28.8 శాతం పెరిగింది. దీంతో వరుసగా జీఎస్టీ వసూళ్లు పెరుగుతుండటం దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధికి సంకేతమని నిపుణులు భావిస్తున్నారు. జీఎస్టీ వసూళ్లలో హరియాణా రాష్ట్రం అత్యధిక వృద్ధిని సాధించింది. పెద్ద రాష్ట్రాలతో పోల్చి హర్యానా రాష్ట్రం అత్యధిక వార్షిక వృద్ధి రేటును నమోదు చేసింది. గుజరాత్, తెలంగాణ రాష్ట్రాలు ఆ తర్వాత జాబితాలో ఉన్నాయి. జీఎస్టీ వసూళ్లలో 19శాతం వృద్ధిని నమోదు చేశాయి. పంజాబ్, కేరళ రాష్ట్రాలు 16 శాతం, ఉత్తరప్రదేశ్ జీఎస్టీ వసూళ్లలో 15 శాతం పెరుగుదలను నమోదుచేశాయి. జీఎస్టీ ఆదాయానికి దేశంలోనే అత్యధికంగా సహకరిస్తున్న మహారాష్ట్ర 13 శాతం వృద్ధిని నమోదు చేయగా, కర్ణాటక 12శాతం పెరుగుదలను నివేదించింది. ఢిల్లీలో జీఎస్టీ వసూళ్లు 8శాతం పెరిగాయి. జులై నెలలో జీఎస్టీ కింద నమోదైన ఆదాయం సీజీఎస్టీ రూ. 39,835 కోట్లు ఉండగా, రాష్ట్ర వస్తు, సేవలపన్ను ఎస్జీఎస్టీ రూ.47,881 కోట్లు, ఇంటిగ్రేటెడ్ ఐజీఎసీ వసూళ్లు రూ.1.23 లక్షల కోట్లకు పైగా ఉన్నాయి. ●

# సనాతన ధర్మాచరణే అనుసరణీయం!



సరికొండ రవీంద్రనాథ్

భారతీయ జనతా పార్టీలో (బిజెపి)లో ఉన్న వారంతా సనాతనులు కాదు. అలాగే సనాతనులు అంతా బిజెపి వారు కాదు. కొంచెం స్పష్టంగా చెప్పాలంటే బిజెపి రాజకీయ పార్టీ. అనేక రకాలైనవారు, అనేక జీవన స్రవంతుల నుంచి వచ్చిన వారు, వేర్వేరు ప్రయోజనాలను ఆశించి వచ్చిన వారు ఆ పార్టీలో ఉన్నారు. వీరిలో సనాతన ధర్మాన్ని నమ్మని వారు, ఆచరించనివారు కూడా ఉన్నారు. అలాగే సనాతన ధర్మాన్ని నమ్మినవారు ఇతర పార్టీలలో కూడా ఉన్నారు. భారత దేశంలో సనాతన ధర్మం గొప్పతనం ఇది. దేశంలోని జీవితానికి ఇది అద్దం పడుతుంది. ఏ పార్టీవారైనా, కులం వారైనా సనాతన ధర్మం ఆచరణ విషయంలో ఏకాభిప్రాయంలోనే యుగాలుగా సహజీవనం సాగిస్తున్నారు. ఈ సజీవ స్రవంతిని మార్చే శక్తి ఏదీ ఇప్పటివరకూ జనించలేదు. సనాతన ధర్మం అంటే అనేక అభిప్రాయాలున్నాయి. వివేచనను, నేర్చుకున్న జ్ఞానాన్ని బట్టి సనాతనం అనే పదానికి నిర్వచనాలను వింటున్నాం, చూస్తున్నాం. ఎవరేం చెప్పినా పామరుల నుంచి పండితుల వరకూ హిందూ జీవన విధానం అంతా వేదాంత సారమైన సనాతనాన్నే అనుసరిస్తున్నారు. వేదాలు చదవని వారు సైతం తెలియకుండానే వేదాలు చెప్పే జీవన విధానాన్ని అనుసరిస్తున్నారు. ఇదే హిందూ జీవన విధానం. మనకు తెలియని, తెలిసిన చరిత్రల హిందూ జీవన విధానం అనేక మార్పులకు, సంఘర్షణలకు లోనైంది. అనేక ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ యుద్ధాలను చూసింది. జీవన విధానాలకు సంబంధించిన అనేక అంతర్గత సంఘర్షణలకు లోనైంది. కానీ అన్నింటికి మూలమైన వేదాల సారం ఈ కాల చక్రాన్ని నియంత్రిస్తూ వస్తోంది. ప్రపంచంలో అవినీతి, అక్రమాలు పెరిగిపోయినప్పుడు. ఆకలి దప్పులతో అరాచకాలతో, నియంతృత్వాలతో రాక్షస పాలనలో ప్రపంచం జీవనం గతి తప్పినపుడు ప్రజలకు రుజుమార్గం చూపించడానికి ఒక అవతార పురుషుడు జన్మిస్తాడు. ఒక ప్రవక్త ఉదయిస్తాడు. సనాతన ధర్మంలో నాటి వేదాల నుంచి నేటి వరకూ ప్రపంచ గతిని, నాగరికతను సరైన మార్గంలో పెట్టడానికి సనాతన ధర్మంలో అవతారాలు ఉదయించడం కనిపిస్తుంది. ఒక్కో అవతారం ఆ యుగంలో ప్రజలకు సరైన మార్గనిర్దేశం చేయడాన్ని చూస్తాం. సంభవామి యుగే యుగే అని గీతలో కృష్ణుడు చెప్పడం ఈ సనాతన ధర్మానికి పతాక శీర్షిక అని చెప్పాలి. ఇప్పుడు సనాతన ధర్మంలో బిజెపి పాత్ర ఏంటన్న ప్రశ్న గురించి కొద్దిగా మాట్లాడుకుందాం. దేశంలో గతంలో రాజ్యాలను ఏలిన రాజులకు సనాతన ధర్మానికి మధ్య సంబంధంలాంటిదే ఇది కూడా. సనాతన ధర్మ చరిత్రను పరిశీలిస్తే బిజెపి సముద్రంలో నీటి బిందువులాంటిది. యుగయుగాల చరిత్ర గతిలో రాజులు వచ్చిపోయారు. రాజ్యాలు ఎన్నో మారిపోయాయి. సనాతన ధర్మాన్ని పాటించిన రాజుల మనుగడ సాధించారు. సనాతన ధర్మాన్ని అనుసరించిన రాజ్యాల చరిత్రలో నిలిచాయి. ఇప్పుడు ఆరెస్సెస్, బిజెపిలను హిందుత్వ పార్టీలు అంటున్నారు. తప్పు లేదు. హిందుత్వాన్ని అనుసరించే వారిని హిందువులు, భారత దేశంలో ఉన్నవారిని భారతీయులు అనేకదా అంటారు. చరిత్రలో ఇతర మతాల నుంచి సనాతన ధర్మాన్ని కాపాడుకోడానికి యుద్ధాలు చేసిన రాజులు, జాతిని కాపాడుకోడానికి ప్రాణాలు అర్పించిన అమరవీరులు ఉన్నారు. వాళ్లు యుద్ధాలు చేసి, త్యాగాలు చేయకపోతే భరతమాతకు మరో వీరపుత్రుడో, వరపుత్రికో జనించేవారు. సంభవామి యుగే యుగే అనుకున్నాం కదా! వారిలాగే ఈరోజు ఆరెస్సెస్, బిజెపిలు, విహెచ్ పిలు 'సనాతన ధర్మాన్ని కాపాడటానికి కృషి చేస్తున్నాం' అని చెబుతున్నాయి. వీరు చేస్తున్న కృషివల్ల భరతజాతి ఎంతవరకు తలెత్తుకుని నిలబడగలదో. భవిష్యత్తులో చరిత్ర చెప్పకనే చెబుతుంది. సమాజం నడతను మార్చే క్రమంలో అనేక తత్వశాస్త్రాలు పుట్టాయి. వీటిలో కొన్నింటిని తత్వ, ఆర్థిక శాస్త్రాలని, కొన్నింటిని మతాలని అంటున్నాం. వీటిలో సైన్స్ ఆధారంగా సమానత్వాన్ని బోధించే ఫిలాసఫీలు కూడా ఉన్నాయి. సైన్స్ భూమిపై జరిగే పరిణామాలకు వివరణ ఇవ్వగలదు. కాని పరిష్కారాలను సూచించలేదు. సాంఘిక, రాజకీయ జీవితం ఇలా ఉండాలని సైన్స్ నిర్దేశించలేదు. ఇక్కడ సైన్స్ ఫెయిల్యూర్ కనిపిస్తుంది. సైన్స్ శోధించలేనిది సనాతన ధర్మం చేయగలదు. విశ్వాన్ని సైతం యుగాల క్రితమే సనాతన ధర్మం శోధించింది. సత్యం కోసం రాజ్యాలను తృణప్రాయంగా త్యాగం చేసిన రాజులను సనాతన హిందువుల్లో చూస్తాం. ప్రపంచంలోని ఏ చరిత్రలోనూ ఈ ఉదాత్తత, ఔన్నత్యం కనిపించదు. పెద్దలను, గురువులను గౌరవించడం ఇక్కడే ఉంది. అలాగే కుటుంబ బంధాలు, అనుబంధాలు సనాతన ధర్మంలోనే కనిపిస్తాయి. అందుకే ఈ ధర్మానికి ప్రపంచంలో అంతటి విశిష్ట స్థానం ఉంది. సనాతన ధర్మం తనను తాను సంస్కరించుకోగలదు. ఒకనాడు భారత స్త్రీ వంటింటి కుందేలుగానే ఉండాలనే సంప్రదాయం ఉండేది. ఇప్పుడు కుటుంబాన్ని ముందుకు నడిపించడంలో స్త్రీ ముందు ఉంటోంది. ఈ మార్పును సనాతనధర్మం ప్రకృతి సహజంగానే స్వీకరించింది. నేడు ఈ భారతావనిలో స్త్రీని దేవతగానే పూజిస్తారు. ప్రకృతిలో సగమైన స్త్రీకి ఏ ఇతర దేశంలోనూ భారతజాతి ఇచ్చిన గౌరవం ఇవ్వడం లేదు. సైన్స్ ఒక్కటి కాదు, తత్వశాస్త్రం, ఖగోళ, ఆరోగ్య శాస్త్రాలతో సకల శాస్త్రాలతో మానవాళికి భవిష్య మార్గం చూపించే యుగధర్మం సనాతనం. సనాతన ధర్మాన్ని అధ్యయనం చేయడానికి పండితులకి జీవితకాలం సరిపోని గ్రంథాలున్నాయి. ఈమధ్య కాలంలో మతం గురించి, సనాతన ధర్మం గురించి పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. కారణం ఏంటి అన్న ప్రశ్నలు తలెత్తడం సహజం. ఇద్దరు వ్యక్తులు ఇరుగు పొరుగున ఉన్నారు. ఒక వ్యక్తి అదే పనిగా పక్కింటిపైకి రాళ్లు వేస్తున్నాడు. రెండో వ్యక్తి మనకెందుకులే అని కొంతకాలం మౌనంగా ఉన్నాడు. ఒక రోజు రెండో వ్యక్తి తనను రక్షించుకోడానికి రాళ్లు వేయడం మొదలు పెట్టాడు. ఘర్షణ మొదలైంది. ఇప్పుడు మనకు సోషల్ మీడియాలో ఈ యుద్ధమే కనిపిస్తోంది. సనాతన ధర్మాన్ని, చరిత్రను, సంస్కృతిని అవమాన పరుస్తూ ఎవరు మాట్లాడినా కొన్ని తరాలవారు మౌనంగా, సహనంతో భరించారు. తమ దేవుళ్లను ఎవరుతూలనాడినా సహించారు. కానీ ఈ తరంలో ఆ సహనం కనిపించడం లేదు. జెన్‌జి తరం కదా! సనాతన ధర్మంపై దాడికి సరైన సమాధానం చెబుతున్నారు. అందుకే ఇంత కాలం తాము మాట్లాడిందే ధర్మమని ఏకపక్షంగా పిడివాదం చేసేవారు

6MN 5 PG-GNT_6MN 5 PG-GNT.qxd 05-08-2026 PM 09:18 Page 1



## 'జనసేన' కార్యాలయంలో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల వినతి

ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం, ఆగస్ట్5, ప్రభాతవార్త: ఏఎన్‌యులో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌ల బృందం బుధవారం జనసేన పార్టీ కార్యాలయానికి వెళ్ళింది. అక్కడ నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో విశాఖపట్నం సౌత్ నియోజకవర్గం ఎంఎల్ఏ వంశీకృష్ణ శ్రీనివాస యాదవ్‌కు తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ వినతిని జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి కె.పవన్‌కళ్యాణ్‌కు అందజేయాలని కోరారు. అలాగే రాష్ట్ర ఉన్నతవిద్యా కమీషనర్ ఎన్.భరత్‌గుప్తాని కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమకు సమాన పనికి సమానవేతనం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం 2023 జూన్‌లో ఇచ్చిన జీఓ ఎంఎస్.నెం.20ను రద్దుచేయాలని కోరారు. జీఎం ఎంఎస్ నెం.46, జిఓ ఎంఎస్ నెం.14ల ప్రకారం తమకు యూజిసి పే స్కేల్స్ అమలు చేయాలని, తమ సర్వీసులను క్రమబద్ధీకరించాలని వారి దృష్టికి తీసుకెళ్ళారు. తమకు న్యాయం చేసిన తరువాతే రెగ్యులర్ నియామకాలు చేపట్టాలని వినతిపత్రంలో తెలియజేశారు. న్యాయమైన డిమాండ్‌లను ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, పరిష్కరించాలని కోరారు.



### వీసిని కలిసిన అతిథి అధ్యాపకులు

ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం, ఆగస్ట్5, ప్రభాతవార్త: ఏఎన్‌యులో పనిచేస్తున్న అతిధి అధ్యాపకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వీసిగా రెండేళ్ళు పూర్తి చేసుకున్న ఆచార్య గంగాధరరావుకు అభినందనలు తెలిపారు. వర్సిటీని మరింత అభివృద్ధిపథంలో నడిపించాలని కోరారు. అలాగే తాము ఎన్నో ఏళ్ళుగా అతిధి అధ్యాపకులుగా పనిచేస్తున్నామన్నారు. రెగ్యులర్ అధ్యాపకుల మాదిరిగానే విద్య విషయక అంశాల్లో సేవలందిస్తున్నామన్నారు. తమకు వేతనాలు పెంచాలని విన్నవించారు. వర్సిటీ అధికారులు సూచించిన విధంగా తమసేవలు అందిస్తామన్నారు. అనంతరం రెక్టార్ ఆచార్య ఆర్.శివరాం ప్రసాద్, పాలకమండలి సభ్యులు ఆచార్య ఎం.త్రిమూర్తిరావు, రిజిస్ట్రార్ సింహాచలంలను కలిశారు.



## కిరాణా షాపులో వృద్ధురాలిపై కత్తితో దాడి

మంగళగిరి, ఆగస్టు 5, ప్రభాతవార్త మంగళగిరి పట్టణ పరిధిలోని కొత్తపేటలోని నిర్మల కాలేజీ ఎదురుగా ఉన్న ఓ కిరాణా షాపు వృద్ధురాలిపై కత్తితో దాడి చేసిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గుర్తుతెలియని నిందితుడు కిరాణాషాపులో సరుకుల పట్టి కట్టించుకొని డబ్బులు సెల్ ఇవ్వమని కోరడంతో 65 ఏళ్ల వృద్ధురాలిపై ఒక అగంతకుడు కత్తితో విచక్షణారహితంగా దాడి చేసి పరారయ్యాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన బాధితురాలిని స్థానికులు, కుటుంబ సభ్యులు వెంటనే అత్యవసర చికిత్స నిమిత్తం విజయవాడలోని ఆసుపత్రికి తరలించారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. క్లూస్ టీమ్‌తో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. నిందితుడిని పట్టుకోవడానికి నిర్మల కాలేజీ పరిసర ప్రాంతాల్లోని, కిరాణా షాపు సమీపంలోని సీసీటీవీ కెమెరాల ఫుటేజీని పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఈ విజువల్స్ ఆధారంగా నిందితుడిని గుర్తించేందుకు దర్యాప్తును వేగవంతం చేశారు. పట్టపగలే జరిగిన ఈ ఘటన స్థానిక ప్రజలను తీవ్ర భయాందోళనలకు గురిచేసింది.



### తల్లిపాలే బిడ్డకు శ్రేష్ఠం

చెరుకుపల్లి ,ఆగస్టు 5, ప్రభాతవార్త : పుట్టిన బిడ్డకు తల్లిపాలు అమృతం వంటివని సూపర్వైజర్ ధనలక్ష్మి అన్నారు. రాంబోట్ల వారి పాలెం పంచాయితీ పిట్టు కోటిరెడ్డిపాలెంలో బుధవారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆవే పాల్గొన్నారు. సమావేశంలో స్థానిక పాఠశాల ఉపాధ్యాయిని హరిప్రియ మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు తల్లిపాలు ఎంతో శ్రేష్టమైనవి అని వ్యాధి వ్యాధి నిరోధకంగా కూడా పనిచేస్తాయని ఆమె వివరించారు. పుట్టిన బిడ్డకు కనీసం ఆరు నెలలు ఆపై రెండు సంవత్సరాల వరకు తల్లిపాలన అందించడం ద్వారా శిశువు ఆరోగ్యంగా ఎదుగుదలకు ఎంతో దోహదపడతాయన్నారు. అంతేకాకుండా తల్లి ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందని, బిడ్డకి బిడ్డకి మధ్య మంచి సమయపాలను కూడా పాటించినట్లు అవుతుందని ఆమె తెలిపారు .రొమ్ము క్యాన్సర్లు రాకుండా తల్లికి కూడా మేలు జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, అంగన్వాడి కార్యకర్తలు, స్థానిక మహిళలు ,బాలింతలు, చిన్నారులు ,పలువురు పాల్గొన్నారు.

## ప్రతి పేదవాడికి తక్కువ ధరకే బియ్యం

నగరం, ఆగష్టు 5,ప్రభాతవార్త: ప్రతి పేదవాడికి తక్కువ ధరకే బియ్యం అందించాలని ఉద్దేశ్యంతో ప్రభుత్వం కృషి చేస్తుందని టీడీపీ నాయకులు అనగాని శివప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిధిలోని నగరం గ్రామంలో రైతు బజార్ ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందించడంలో ప్రభుత్వం ఎల్లప్పుడు ముందుంటుంది ఉన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుండి సంక్షేమ ధ్యేయంగా పనిచేస్తున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో రేపల్లె నియోజకవర్గం జనసేన సమన్వయకర్త మత్తి భాస్కరరావు, కూచినపూడి మార్కెట్ యార్డ్ సొసైటీ చైర్మన్ ఒగిపోయిన వెంకట్ యాదవ్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## యువత అన్ని రంగాల్లో ముందుండాలి

నగరం, ఆగష్టు 5, ప్రభాతవార్త: యువత అన్ని రంగాల్లోనూ ముందుండాలని రేపల్లె నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయకర్త మత్తి భాస్కర రావు అన్నారు. బుధవారం భారత ప్రభుత్వ యువజన క్రీడల మంత్రిత్వ శాఖ యువభారత్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో నషా ముక్త్ యువ వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బాపట్ల జిల్లా స్థాయి పోటీలు నగరం మండలం శ్రీ వెలగపూడి రామకృష్ణ మెమోరియల్ కళాశాల లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి విద్య, క్రీడలు చురుకుగా పాల్గొని సమాజానికి ఆదర్శంగా నిలవాలని తెలియజేశారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వల్లభనేని బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ విద్యార్థులు నృత్యం, రీల్ షార్ట్ ఫిలిమ్, నుక్కడ్ నాటక్, కవిత్వం, వాదోపవాదం, చిత్రలేఖనం విభాగాల్లో పోటీలు నిర్వహించడం జరిగిందని, ప్రతి విద్యార్థి ఇలాంటి పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను మెరుగుపరుచుకోవాలని తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అనగాని హరికృష్ణ మాట్లాడుతూ యువత తమ సృజనాత్మకతను వెలికి తీసి సమాజ శ్రేయస్సు కోసం పాటుపడాలని తెలిపారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు , ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి. శ్రీనివాసరావు, ఐక్యు ఏసీ కోఆర్డినేటర్ ఆర్. ప్రసన్న బాబు, కళాశాల సూపర్డెంట్ అమరేష్ రెడ్డి, అహ్మదీయ ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ సయ్యద్ తాహెర్ అహ్మద్, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




### ప్రతి రైతు పంట బీమా తప్పనిసరి చేయించుకోవాలి

నగరం, ఆగష్టు 5, ప్రభాతవార్త: ప్రతి రైతు పంట బీమా తప్పనిసరిగా చేయించాలని మండల వ్యవసాయ అధికారి వి. రమేష్ బాబు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిధిలో ని అద్దంకివారిపాలెం, ధూళిపూడి గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2026 27 సంవత్సరంలో నైరుతి ఋతుపవనాలు అనుకూలంగా లేని పరిస్థితుల వల్ల వర్షపాతం తక్కువగా నమోదవుతుందని రైతులు ప్రతి ఒక్కరూ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద పంట బీమా తప్పనిసరిగా చేయించుకోవాలని తెలియజేశారు. వరి పంటకు 800 రూపాయలు ప్రీమియం చెల్లిస్తే 40 వేల రూపాయలు వరకు పంట బీమా వర్తిస్తుందని, ఈ పథకానికి ఆగస్టు 15వ తేదీ లోపు పంట బీమా నమోదు చేసుకోవాలని తెలియజేశారు. ప్రతి ఒక రైతు ఏ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ, విఏఏలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్డీఏ పాలనలో అభివృద్ధి, సంక్షేమం

మంగళగిరి, ఆగస్టు 5, ప్రభాతవార్త: మంగళగిరి 9వ వార్డు ఎల్బీనగర్ లో టీడీపీ ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఏనుగ కిషోర్, నాయకులు పాల్గొని వార్డులో ఇంటింటికి తిరిగి ఎన్డీఏ కూటమి రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. రెండేళ్ల పాలనపై కూటమి రూపొందించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. అనంతరం కిషోర్ మాట్లాడారు. ఎన్డీఏ రెండేళ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా భావించి రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. టీడీపీ 9 క్లస్టర్ ఇంచార్జ్ గోవాడ దుర్గారావు, యూనిట్ ఇన్చార్జి అన్నం నాగబాబు 9 వార్డ్ అధ్యక్షులు వంగర సదాశివరావు , గోవాడ రవి, అనుమోలు శ్రీనివాసరావు, దామర్ల భాస్కరరావు, అక్కల హరిబాబు, కామాబత్తుల రమేష్, వేమన శివకుమార్, కోవెలకారు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# గుంటూరు వార్త



## ఇంటింటి ప్రచారంలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, ఆగస్టు 5, ప్రభాతవార్త :రాష్ట్రానికి జగన్ వైరస్ లా మారారని, యువత భవితను నాశనం చేసేందుకు డీఎస్సీపై దుష్ప్రచారం చేస్తున్నారని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ మండిపడ్డారు. రెండేళ్ల పాలనపై నమ్మకంఅభివృద్ధి, సంక్షేమంలో భాగంగా బుధవారం స్థానిక 50వ వార్డులోని శారదాకాలనీ మన ఇంటికిమన నసీర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ ప్రజలతో మమేకమవుతూ కూటమి ప్రభుత్వం అండగా ఉందని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ రాష్ట్రంలో



యువతను తప్పుదోవ పట్టించేందుకు, వారి జీవితాలతో ఆడుకునేందుకు జగన్ మాఫియా కుట్రలు పన్నుతోందని మండిపడ్డారు. డీఎస్సీపై సీబీఐ దర్యాపు కోరుతూ హైకోర్టును వైసీపీ ఆశ్రయించడం దారుణమన్నారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే ప్రజా ప్రయోజన వ్యాజ్యం వేశారని కోర్టు చెప్పడం వైసీపీ దిగజారుడుతనానికి నిదర్శనమని విమర్శించారు. డీఎస్సీ స్పోర్ట్స్ కోటా ద్వారా యువత నష్టపోతే వారు కోర్టుకు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. బాధితులే ముందుకు రానప్పుడు ప్రజాహితానికి ఎక్కడ ఆస్కారం ఉందని కోర్టు ప్రశ్నించడం వైసీపీ కుట్రలకు తార్కాణమని చెప్పారు. ఇలాంటి దుష్ట రాజకీయాలు చేస్తోన్న వైసీపీని రాష్ట్రం నుంచి తరిమేయాలని పిలుపునిచ్చారు. ఒక వైపు కిడ్నాపర్లు, మరో వైపు రౌడీ బ్యాచ్ రాష్ట్రంలో అభివృద్ధికి ఆటంకంగా మారారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం రెండేళ్ల కాలంలోనే కనీవినీ ఎరుగని అభివృద్ధి చేశారని చెప్పారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అన్ని ప్రాంతాలను ప్రగతిపథంలోకి తీసుకెళుతున్నామన్నారు. నియోజకర్గ ప్రజలకు ఎప్పుడు ఎలాంటి అవసరం వచ్చినా తాను 24 గంటలు అందుబాటులో ఉంటానని చెప్పారు. శారదాకాలనీలో గతంలో ఎలాంటి సౌకర్యాలు లేవని తెలిపారు. ఈ ప్రాంతంలో రోడ్లు, డ్రెయిన్ల ఆవశ్యకతను గుర్తించి నిధులు మంజూరు చేయించామని తెలిపారు. కార్యక్రమంలో మద్దిరాల మ్యాని, మహంకాళి నరసింహారావు, పఠాన్ బాజి, కేసాని ప్రసాద్, కోట గోపాల్, ప్రవీణ్ కుమార్, వెంకటేశ్వరరావు, మోహన్ కృష్ణ, వంగర ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

### పెదకాకాని శివయ్య సన్నిధిలో కొనసాగుతున్న పవిత్రోత్సవాలు

గుంటూరు, ఆగస్టు 5, ప్రభాతవార్త :పెదకాకాని శివాలయంలో పవిత్రోత్సవములలో భాగముగా 2వ రోజు బుధవారము ఉదయం పవిత్ర సమర్పణ, విశేష ద్రవ్య హోమం, పూర్ణాహుతి, ఉపచారం, మంత్రపుష్పం, హారతి, విభూతి, కుంకుమ ప్రసాద వితరణలు తదితర కార్యక్రమములు ఆలయ స్థానాచార్యులు, ప్రధాన అర్చక, వేద పండితులు ఆధ్వర్యంలో నిర్వహించినారు. పవిత్రోత్సవముల చివరి రోజు గురువారం ఉదయం విశేష సంధి, ద్వితీయ కాలయాగశాల పూజ, అవభృదయాగం, చతుర్వేదపారాయణలు, మహాపూర్ణాహుతి, యాత్రాదానం, కలశాభిషేకం, అలంకారం, పరివార దేవతా పవిత్ర సమర్పణ శ్రీ గంగా భ్రమరాంభ సమేత శ్రీ మల్లేశ్వరస్వామి వారికి విశేష ప్రత



చరితపూజ, పవిత్ర సమర్పణ, శ్రీ స్వామి అమ్మ వారల గ్రామోత్సవం, స్వామి వారి మూల మంత్ర తత్వార్చన, మంత్రపుష్పం, హారతి, విభూతి, కుంకుమ ప్రసాద వితరణతో పవిత్రోత్సవములు పరిసమాప్తం అవుతాయని ఆలయ ఉపకమీషనరు గోగినేని లీలాకుమార్, పాలకమండలి చైర్మన్ కోసూరి పూర్ణచంద్రరావు తెలిపారు.బుధవారం పూజా కార్యక్రమాలలో ఆలయ అధికారులు ధర్మకర్తల మండలి చైర్మన్ కోసూరి పూర్ణచంద్రరావు దంపతులు, బండారు మల్లేశ్వరి దంపతులు, వుల్లం రాజేశ్వరి దంపతులు, ధూపాటి శివశంకరరావు, బైరపనేని ధనలక్ష్మి దంపతులు, ఎక్స్ అఫీషియో సభ్యులు పేటేటి ధన మహేశ్వర ప్రసాద్ భక్తులు తదితరులు పాల్గొన్నారు.పవిత్రోత్సవములు కార్యక్రమముల చివరి రోజు గురువారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వరస్వామి వార్ల కృపకు ప్రాతులు కాగలరని ఆలయ ఉపకమీషనరు గోగినేని లీలాకుమార్ విజ్ఞప్తి చేసినారు.

### చిన్నకాకాని షైన్ అనాథ శరణాలయంలో అన్నదాన కార్యక్రమం

మంగళగిరి, ఆగస్టు 5, ప్రభాతవార్త : మంగళగిరి మున్సిపల్ మరియు ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా బుధవారం మంగళగిరి నియోజకవర్గంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలం చిన్న కాకాని గ్రామంలోని షైన్ చిన్న పిల్లల ఆశ్రమంలో విద్యార్థిని విద్యార్థులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎర్రబాలెంలోని అమ్మ ఓల్డ్ ఏజ్ హోమ్ లో వృద్ధులకు వస్త్రాలు, పండ్లు, పంపిణీ చేసి పెద్దల ఆశీస్సులు తీసుకున్నారు. అలాగే సాయంత్రం కాజా గ్రామంలోని ఆమోదిని శరణాలయంలో విద్యార్థినిలతో కేక్ కట్ చేసి పిల్లలకు స్నాక్స్ పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ కుటుంబంలోని విశేష కార్యక్రమాలు ఇలా సేవా కార్యక్రమాలు మల్చుకొని మన తోటి వారికి సహాయపడవలసిందిగా చిరంజీవి అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు కంకణాల శంకర్, చెన్నం వీరాంజనేయులు, జనసేన పార్టీ దుగ్గిరాల మండల అధ్యక్షులు పసుపులేటి శ్రీనివాసరావు, ఎర్రబాలెం జనసేన నాయకులు కౌతవరపు సుందరయ్య, చిన్నకాకాని జనసేన నాయకులు లింగినేని శ్రీనివాసరావు, సుంకర హరిబాబు, జనసేన పార్టీ సీనియర్ నాయకులు, జనసైనికులు, తదితరులు పాల్గొన్నారు...



## నేతన్న సేవ పథకం ద్వారా చేనేత కార్మికులకు ఆర్థిక భరోసా

**చేనేత సమ్మేళనంలో చిల్లపల్లి శ్రీనివాసరావు**

మంగళగిరి, ఆగస్టు 5, ప్రభాతవార్త : కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న నేతన్న సేవ పథకం ద్వారా చేనేత కార్మికులకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు వారి కుటుంబాలకు పలు సంక్షేమ ప్రయోజనాలు అందుతున్నాయని ఏపీ ఎం ఎస్ ఐ డి సి చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు.

ఆగస్టు 7 వ తేదీన జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన చేనేత సమ్మేళనంలో ఏ పీ ఎం ఎస్ ఐ డి సి ఛైర్మన్, జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇంచార్జ్ చిల్లపల్లి శ్రీనివాసరావు పాల్గొని ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులు, వస్త్ర వ్యాపారస్తుల




## మైనింగ్ క్వారీల్లో 33 రిజర్వేషన్, సీనరేజ్ ఫీజులో 50శాతం రాయితీ కల్పించాం

**ఇంటింటికి కూటమి ప్రభుత్వం - సంక్షేమ విజయాలు.. కార్యక్రమంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి**

గుంటూరు ఆగస్టు 5,ప్రభాతవార్త :రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం రెండేళ్ల కాలంలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేసేందుకు నిర్వహిస్తున్న"ఇంటింటికి కూటమి ప్రభుత్వం - సంక్షేమ విజయాలు" కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు.బుధవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 23వ డివిజన్ వడ్డెగూడెంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆధ్వర్యంలో ఇంటింటి



ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు, పుడా చైర్మన్ చిరుమామిళ్ల మధుబాబు, వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లె ఈశ్వరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్డీయే కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల వివరాలతో కూడిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వం వడ్డెర సామాజిక వర్గ ఆర్థిక, సామాజిక అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు వడ్డెరలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుందని పేర్కొన్నారు.వడ్డెర సహకార సంఘాల ఆర్థికాభివృద్ధికి మైనర్ ఖనిజ క్వారీల కేటాయింపుల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించామని, కొత్తగా ఏర్పడిన వడ్డెర సొసైటీలకు మైనింగ్ లీజులు కేటాయించే ప్రతిపాదనకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. వడ్డెర కార్మికులు, సహకార సంఘాలపై ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు మైనింగ్ సీనరేజ్ ఫీజు, ప్రీమియంపై 50 శాతం భారీ రాయితీ కల్పించడం ద్వారా వారికి మరింత ప్రోత్సాహం అందిస్తున్నామని తెలిపారు.బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు వీర వడ్డె ఓబన్న సేవలను గుర్తిస్తూ ఆయన జయంతిని అధికారిక రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. అలాగే గతంలో చంద్రబాబు నాయుడు ఏర్పాటు చేసిన వడ్డెర కార్పొరేషన్‌ను మరింత బలోపేతం చేసి, దాని ద్వారా అర్హులైన లబ్ధిదారులకు ఉపాధి అవకాశాలు, రుణ సదుపాయాలు, వివిధ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందిస్తున్నామని చెప్పారు.ఎన్డీయే ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాల ద్వారా కూడా వడ్డెర కుటుంబాలు పెద్దఎత్తున లబ్ధి పొందుతున్నాయని పేర్కొన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, దీపం 2.0 కింద ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ వంటి కార్యక్రమాలు సామాన్య కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి, సంక్షేమాన్ని సమన్వయం చేస్తూ ప్రతి వర్గానికి న్యాయం చేసే విధంగా ఎన్డీయే ప్రభుత్వం పాలన సాగిస్తోందని, ప్రజలు మరోసారి ఈ ప్రభుత్వంపై పూర్తి విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

## ఇస్రాయెల్ పేటలో యువతకు అవగాహన

గుంటూరు, ఆగస్టు 5, ప్రభాతవార్త :గుంటూరు నగరంలో డ్రగ్స్ మాటనేది వినిపించకుండా ఉక్కుపాదం మోపుతున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. బుధవారం స్థానిక డీఎస్పీ, సీఐలతో కలిసి ఎమ్మెల్యే నసీర్ ఇస్రాయెల్ పేట వెళ్లారు. అక్కడ యువకులతో మాట్లాడి గంజాయి వలన కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పించారు. నియోజకవర్గంలో ఎక్కడా డ్రగ్స్ ఆనవాళ్లు కనిపించకూడదన్నారు. యువకులు డ్రగ్స్ కు బానిసైతే నిండు జీవితాలు నాశనమవుతాయని చెప్పారు. తల్లిదండ్రులు పిల్లల నడవడికపై ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలని సూచించారు. నియోజకవర్గంలో ఎక్కడ డ్రగ్స్ ప్రభావం ఉన్నా వెంటనే తమకు



సమాచారం ఇవ్వాలన్నారు. గోలీలు, సింగిల్ నంబర్ లాటరీలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గంజాయి నియంత్రణపై హోం శాఖ మంత్రి అధ్యక్షతన విద్యా, వైద్య, అబకారీ, గిరిజన సంక్షేమ శాఖల మంత్రులతో ప్రత్యేక క్యాబినెట్ సబ్‌కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. డ్రగ్స్ మహమ్మారిని అడ్డుకునేందుకు అమరావతి ప్రధాన కేంద్రంగా ఈగల్ (ఎలైట్ యాంటినార్కోటిక్ గ్రూప్ ఫర్ ఎన్ ఫోర్స్ మెంట్:) అనే ప్రత్యేక విభాగాన్ని 6 జిల్లాల్లో ఏర్పాటు చేశారన్నారు. గంజాయి, డ్రగ్స్ వ్యాపారంలో ఉన్న ప్రధాన సూత్రధారులపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. విద్యాసంస్థల్లో యువత డ్రగ్స్ బారిన పడకుండా పాఠశాలలు, కళాశాలల్లో 40వేలకుపైగా ఖీఈగల్ క్లబ్‌లఖీను ఏర్పాటు చేశామన్నారు. సంకల్పం 2.0 వంటి ప్రత్యేక చైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రాన్ని గంజాయి వనంగా మార్చారని విమర్శించారు. నియోజకరవర్గంలోనూ గంజాయి విచ్చలవిడిగా విక్రయించారని, అరికట్టే వారే ప్రోత్సహించారని తెలిపారు. గంజాయితో నాడీ వ్యవస్థ పూర్తిగా దెబ్బతింటుందని, మానవ సంబంధాలు దెబ్బతింటాయని తెలిపారు.

### ఎర్రబాలెం అమ్మ ఓల్డ్ ఏజ్ హోమ్‌లో వృద్ధులకు వస్త్రాలు పంపిణీ

తాడేపల్లి, ఆగస్టు 5, ప్రభాతవార్త : ఆప్కో మాజీ చైర్మన్ గంజీ చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా మంగళగిరి నియోజకవర్గంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఎర్రబాలెంలోని అమ్మ ఓల్డ్ ఏజ్ హోమ్ లో వృద్ధులకు వస్త్రాలు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేసి పెద్దల నుంచి ఆశీస్సులు



తీసుకున్నారు. సాయంత్రం కాజా గ్రామంలోని ఆమోదిని శరణాలయంలో విద్యార్థినిలతో కేక్ కట్ చేసి పిల్లలకు స్నాక్స్ పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాలతో తోటి వారికి సహాయపడవలసిందిగా చిరంజీవి అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు కంకణాల శంకర్ , చెన్నం వీరాంజనేయులు, జనసేన పార్టీ దుగ్గిరాల మండల అధ్యక్షులు పసుపులేటి శ్రీనివాసరావు, ఎర్రబాలెం జనసేన నాయకులు సుందరయ్య, చిన్నకాకాని జనసేన నాయకులు లింగినేని శ్రీనివాసరావు , సుంకర హరిబాబు, జనసేన పార్టీ సీనియర్ నాయకులు, జనసైనికులు, తదితరులు పాల్గొన్నారు...

సంక్షేమం కోసం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలపై ప్రతి చేనేత కుటుంబానికి అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా థ్రిఫ్ట్ ఫండ్, నూలు ఉత్పత్తి ప్రోత్సాహకాలు, టెక్స్టైల్ రంగ అభివృద్ధి పథకాలు, చేనేత రంగ ప్రగతి కోసం చేపడుతున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే 200-400 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సౌకర్యం వంటి పథకాలు చేనేత కుటుంబాల జీవనోపాధిని మరింత బలోపేతం చేస్తున్నాయని పేర్కొన్నారు. చేనేత వర్గం బీసీ సమాజంలో ఐక్యంగా, సమష్టిగా నిలిచి తమ హక్కులు, అవకాశాల సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. చట్టసభల్లో చేనేత వర్గానికి తగిన ప్రాతినిధ్యం కల్పించే దిశగా రాష్ట్ర నాయకత్వం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. చేనేత కుటుంబాల అభ్యున్నతి కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నిరంతరం కృషి చేస్తున్నారని ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపీ శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి ఆనంద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బిట్రా కనకరాజు, రాష్ట్ర కమిటీ కీలక ప్రతినిధి కాలేపు సత్య సాయిరామ్, రాష్ట్ర చేనేత సెల్ కన్వీనర్, సీనియర్ నాయకులు జగ్గారపు శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పంచుమర్తి ప్రసాద్, జిల్లా ఓబీసీ అధ్యక్షుడు శ్రీ లక్ష్మీ నరసింహా స్వామి పాలకమండలి సభ్యులు తులిమిల్లి రామకృష్ణ, చేనేత సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్పీల ఐక్యతే పొదుపు సంఘాల బలోపేతానికి నిజమైన పునాది : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, ఆగస్టు 5, ప్రభాతవార్త: రీసోర్స్ పర్సన్లు (ఆర్పీలు) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పొదుపు సంఘాల బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషిచేయాలని, సంఘాల గుర్తింపు, ఉనికి, ఆర్థిక స్థిరత్వానికి తమవంతు సహాయ సహకారాలు అందించాలని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు.మంగళవారం స్థానిక మున్సిపల్ కమిటీ హాల్లో



జరిగిన పట్టణ ఆర్పీల ప్రత్యేక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్పీలతో మాట్లాడిన ప్రత్తిపాటి.. వారికి పలు సూచనలు చేశారు. పారదర్శక, అవినీతి రహిత సేవలతో ఆర్పీలు, పొదుపు సంఘాల బలోపేతానికి శ్రమించాలి గత ప్రభుత్వంలో ఆర్పీలు, యానిమేటర్లు చేసిన తప్పులు, ఈ ప్రభుత్వంలో పునరావృతం కావడానికి వీల్లేదని, ప్రజా ప్రభుత్వంలో పారదర్శక, అవినీతి రహిత సేవలతో ఆర్పీలు, పొదుపు సంఘాల బలోపేతానికి శ్రమించాలని ప్రత్తిపాటి సూచించారు. మహిళా సాధికారత, ఆరోగ్యం, విద్య, ఆర్థిక భద్రతపై పొదుపు సభ్యుల్ని సమర్థవంతంగా ముందుకు నడిపించాలని,, ప్రతి అంశంలో వారికి స్పష్టమైన అవగాహన ఉండేలా చూడాల్సిందీ ఆర్పీలేనని ప్రత్తిపాటి స్పష్టంచేశారు. ఆర్పీల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం ఎప్పుడూ తాత్సారం చేయదని, గత ప్రభుత్వంలోలా వ్యక్తిగత ప్రయోజనాలు ఆశించకుండా, ప్రతి ఒక్కరూ సంఘాల బలోపేతంపైనే దృష్టి పెట్టాలని ప్రత్తిపాటి సూచించారు. ఈ సందర్భంగా కొందరు నూతన ఆర్పీలు తమకు కొన్ని నెలలుగా జీతభత్యాలు అందడం లేదని ప్రత్తిపాటికి తెలియచేయగా, ఆయన వెంటనే ఉన్నతాధికారులతో మాట్లాడారు. సాంకేతిక సమస్యలే అందుకుకారణమని తెలుసుకున్న ప్రత్తిపాటి, వాటిని వెంటనే పరిష్కరించి, ఆర్పీల బకాయిలు వెంటనే అందచేయాలని అధికారుల్ని ఆదేశించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు కూడా ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం చేపట్టాలని, మహిళల్లో, సమాజంలో వారికి ఉండే ప్రత్యేక గుర్తింపు, ప్రభుత్వానికి ఉపయోగపడాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్, ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ రఫాని, పిడి మురళి కృష్ణ, మున్సిపల్ కమిషనర్ పతి శ్రీహరి బాబు, బీజేపీ నాయకులు మల్లెల శివనాగేశ్వరరావు, నెల్లూరి రంజిత్, టీడీపీ ముల్లా కరిముల్లా, కొత్త కోటేశ్వరరావు, బేరింగ్ మౌలాలి, సియయం పద్మజ టీడీపీ నాయకులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాలలో పొలం పిలుస్తోంది

చిలకలూరిపేట, ఆగస్టు 5, ప్రభాతవార్త: చిలకలూరిపేట మండలంలోని వేలూరు మరియు కుక్కపల్లివారిపాలెం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించటం జరిగింది.ఈ కార్యక్రమంలో చిలకలూరిపేట మండల వ్యవసాయ అధికారి సి.హెచ్ సరిత, నరసరావుపేట సహాయ వ్యవసాయ సంచాలకులు కె.వి.శ్రీనివాసరావు, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం నుండి ప్రధాన శాస్త్రవేత్తలు ఎన్.చాముండేశ్వరి, జె.సతీష్ బాబు, ఎన్.సాంబశివ రావు, ఎం.రవీంద్రా రెడ్డి పాల్గొని ప్రత్తి మరియు మొక్కజొన్న పొలాలను సందర్శించి రైతులకు సాగుపై పలు సూచనలు చేశారు. శాస్త్రవేత్తలు మాట్లాడుతూ ప్రస్తుత



వర్షాభావ మరియు ఎల్ నినో పరిస్థితుల దృష్ట్యా ఇప్పటికే ప్రత్తి సాగు చేస్తున్న రైతులు పొటాషియం నైట్రేట్ ద్రావణాన్ని పిచికారి చేసుకోవటం వలన బెట్ట పరిస్థితుల నుండి పంటను కాపాడుకోవచ్చు అని ఈ విధంగా వర్షాలు పడే వరకు ప్రతి పది రోజులకు ఒకసారి పిచికారి చేసుకొనవచ్చు మరియు ఇంకా ప్రత్తి పంట సాగు చేయని రైతులు ఆగస్టు 15వ తారీఖు తరువాత ప్రత్తి సాగునకు ఆశక్తి చూపరాదు అని ఒకవేళ సాగు చేస్తే గులాబీ రంగు పురుగు ఆశించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి అని ఇంకను ప్రత్తి వేయని రైతులు కంది పంట నీటి ఎద్దడిని బాగా తట్టుకుంటుంది కనుక కంది సాగుకు మొగ్గు చూపాలని మరియు విత్తటానికి ముందు తప్పనిసరిగా వి ఏ ఎం పొడిని పశువుల ఎరువుతో కలిపి సాళ్లలో వేసుకున్నట్టు ఐతే పంటకు బెట్టను తట్టుకునే శక్తి పెరుగుతుంది అని తెలియజేశారు.

## చిలకలూరిపేట రూరల్ పరిధిలో విషాదం మనస్థాపంతో వివాహిత బలవన్మరణం

చిలకలూరిపేట, ఆగస్టు 5, ప్రభాతవార్త: చిన్న చిన్న పనులకే అలసిపోతూ, అనారోగ్యంతో సతమతమవుతున్న ఓ యువ వివాహిత మనస్థాపం చెంది బలవన్మరణానికి పాల్పడిన ఘటన చిలకలూరిపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వేలూరు గ్రామంలో చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వేలూరు గ్రామానికి చెందిన అలా పవన్ కుమార్ భార్య దివ్య సాయి



(22) గత ఆరు నెలలుగా శారీరకంగా బలహీనపడి, చిన్న చిన్న పనులు చేయడానికి కూడా అలసిపోతూ ఉండేది. ఆరోగ్యం కుదుటపడకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురైన ఆమె, జీవితంపై విరక్తి చెంది చనిపోవాలని నిర్ణయించుకుంది.ఈ క్రమంలో ఈ ఏడాది జూలై 30వ తేదీ సాయంత్రం 6:00 గంటల సమయంలో ఇంట్లో ఎలుకల పేస్టు తిన్నది. ఆ విషయాన్ని ఎవరికీ చెప్పకపోవడంతో, మరుసటి రోజు (జూలై 31న) తీవ్రంగా వాంతులు చేసుకుంది. కూతురి పరిస్థితిని గమనించిన తండ్రి మద్దినేని వంశీకృష్ణ వెంటనే అప్రమత్తమై చికిత్స నిమిత్తం ఆమెను తొలుత చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అందించిన వైద్యుల సూచన మేరకు, మెరుగైన వైద్యం కోసం గుంటూరు జిజిహెచ్ (బిబిబి) కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో దివ్య సాయి మంగళవారం (ఆగస్టు 4) ఉదయం 5:59 గంటల సమయంలో తుదిశ్వాస విడిచింది.మృతురాలికి ఇద్దరు ఆడపిల్లలు సంతానం ఉన్నారు. తండ్రి మద్దినేని వంశీకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిలకలూరిపేట రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ జి. అనిల్ కుమార్ కేసు నమోదు చేశారు. ఆసుపత్రిలో శవ పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఇంటర్నేషనల్ లెవల్ కుంగ్ ఫు అండ్ కరాటే ఛాంపియన్షిప్ లో న్యూ షావోలిన్ కుంగ్‌ఫూ అకాడమీ విద్యార్థులకు పతకాల పంట


చిలకలూరిపేట, ఆగస్టు 5, ప్రభాతవార్త: చిలకలూరిపేట సి.ఆర్ క్లబ్ మరియు యన్.టి.ఆర్ కాలనీ నందు నడుపబడుతున్న న్యూ షావోలిన్ కుంగ్ ఫూ అకాడమీ విద్యార్థిని, విద్యార్థులకు మారల్ ఆర్ట్స్ నందు శిక్షణ ఇస్తూ ఈ నెల 1,2వ తేదీలలో హైదరాబాదు యల్.బి నగర్లో 2వ ఇంటర్నేషనల్ లెవల్ కుంగూ అండ్ కరాటే ఛాంపియన్షిప్ పోటీలలో మాస్టర్ విక్రమ్ ఆధ్వర్యంలో అకాడమీ సబ్ జూనియర్



విభాగంలో సహస్ర, రెన్విక, మోక్షిత, యుక్తిక, మానస, దేవర్షి, హరిశ్రీ, హర్షవర్ధన్, సాయి, గగన్, వేదాన్, సంతోష్, శశాంక్, అమన్ పాల్గొని తమ తమ విభాగాలలో అబ్బురపరచే ప్రదర్శన చేసి బంగారు, రజత పతకాలను సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థులకు చిలకలూరిపేట తహశీల్దారు కె.వేణుగోపాల్ చేతుల మీదుగా విద్యార్థులకు మెడల్స్ అందజేయడం జరిగింది. తదుపరి అభినందన సభ కార్యక్రమం స్థానిక సి.ఆర్ క్లబ్లో జరిగినది. ఈ కార్యక్రమంలో న్యూషావోలిన్ కుంగ్ ఫూ అకాడమీ మాస్టర్స్, మోడరన్ విద్యాసంస్థల అధినేత చేబ్రోలు మహేష్ మరియు సి.ఆర్ క్లబ్ పెద్దలు పాల్గొని విజేతలైన విద్యార్థులను అభినందించి, మరిన్ని విజయాలు సాధించాలని శుభాకాంక్షలు చెలియజేశారు. చేబ్రోలు మహేష్ మాట్లాడుతూ ఇదేవిధంగా విద్యార్థులను తల్లిదండ్రులు ప్రోత్సహించాలని, ముఖ్యంగా ఆడపిల్లలున్న తల్లిదండ్రులు మారల్ ఆర్ట్స్ ను సెల్ఫ్ డిఫెన్స్ చిన్ననాటినుండే వారి మానసిక ధృడత్వానికి వారి స్థైర్యానికి నేర్పించాలని కోరారు. మాస్టర్ విక్రమ్ మాట్లాడుతూ మా మీద నమ్మకంతో విద్యార్థులను టోర్నమెంటులో పాల్గొనుటకు పంపిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే మేము నేర్పిన శిక్షణను విద్యార్థులు చక్కటి నైపుణ్యాన్ని ప్రదర్శించి అకాడమీకి అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు తీసుకురావడం చాలా ఆనందంగా వుందని అన్నారు. ఇలానే చిలకలూరిపేట ప్రాంత ప్రజల ఆదరాభిమానాలతో మరిన్ని పోటీల్లో పాల్గొని ప్రజల మన్ననలు పొందుతామని అన్నారు. ప్రతిరోజు చిలకలూరిపేటలోని సి. ఆర్ క్లబ్ ఆవరణలో ఉదయం గం.6.00 నుండి గం.7.00ల వరకు ఉచిత మార్షల్ ఆర్ట్స్ శిక్షణ కార్యక్రమం జరుగుచున్నందున ఈ అవకాశం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అకాడమీ చీఫ్ యస్.కె. దరియావలి, మాస్టర్ యడ్ల సురేష్, పాలపాటి నాగరాజ, కొర్రపాటి రాంబాబు, కుర్చేటి బ్రహ్మయ్య, కాకి ప్రసాద్, ఇన్స్ట్రక్టర్స్ యస్.కె.రబ్బాని, కె. రాహుల్, సాకేత్, సుధీర్, ఖమ్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.


## తల్లిపాల వారోత్సవాలు

చిలకలూరిపేట, ఆగస్టు 5, ప్రభాతవార్త: ఐక్యరాజ్యసమితికి చెందిన ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనల మేరకు ప్రపంచవ్యాప్తంగా తల్లిపాల వారోత్సవాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా చిలకలూరిపేట ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక కె.జె హాస్పిటల్ లో బుధవారం నాడు మాతృమూర్తులకు తల్లిపాల ప్రాధాన్యత పై అవగాహన కల్పించటమైంది . ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యులు డాక్టర్ కందిమల్ల



జయమ్మ మాట్లాడుతూ తల్లులు మూఢనమ్మ కాలను వది లేసి, ప్రసవమైన మొదటి గంటలోపే బిడ్డకు ముర్రు పాలు పట్టించాలన్నారు. అవి బిడ్డలో రోగ నిరోధక శక్తిని పెంచే అత్యంత శక్తివంతమైన ఔషధమని అన్నారు. ఇన్నర్ వీల్ అధ్యక్షురాలు తోటకూర రామ సీత మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు ఇచ్చే మొట్టమొదటి వ్యాక్సిన్ తల్లిపాలేనన్నారు. బిడ్డకు పాలు ఇవ్వటం ద్వారా తల్లి ఆరోగ్యం కూడా కాపాడుకోవచ్చని, బ్రెస్ట్ క్యాన్సర్ వంటి వ్యాధులను నివారించవచ్చని అన్నారు. పి .డి .సి . కోలా విజయలక్ష్మి మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు తప్పనిసరిగా ఇవ్వాలని, బిడ్డకు తల్లి ఇచ్చే అత్యంత విలువైన మొట్టమొదటి బహుమతి తల్లిపాలేనన్నారు. హాస్పిటల్ లోని మాతృమూర్తులకు ఇన్నర్ వీల్ సభ్యులు బ్రెడ్లు , పండ్లు పంచిపెట్టారు

# పల్నాడు జిల్లా వార్త



## యూనిఫైడ్ ఇంటర్నేషనల్ మ్యాథమెటిక్స్ ఒలింపియాడ్లో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటిన కెరిడ్జ్ విద్యార్థిని లాస్యశ్రీ

నరసరావుపేట టౌన్, ఆగస్టు 5 ప్రభాతవార్త : నరసరావుపేటలోని కెరిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్లో 6వ తరగతి విద్యార్థిని యు. లాస్య శ్రీ యూనిఫైడ్ కౌన్సిల్ నిర్వహించిన యూనిఫైడ్ ఇంటర్నేషనల్ మ్యాథమెటిక్స్ ఒలింపియాడ్ (యుఐఎంఒ) లో విశేష ప్రతిభ కనబరిచి ఆంధ్రప్రదేశ్ జోన్లో ప్రథమ ర్యాంక్ సాధించింది. 2025-2026 విద్యా సంవత్సరంలో నిర్వహించిన ఈ ఒలింపియాడ్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు యూనిఫైడ్ కౌన్సిల్ ఆమెకు ప్రశంసా పత్రాన్ని (సర్టిఫికెట్ ఆఫ్ ఎక్స్ లెన్స్ ) ప్రదానం చేసింది.ఈ




సందర్భంగా పాఠశాల చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ లాస్య శ్రీ సాధించిన విజయం నిరంతర శ్రమ, అంకితభావం ప్రతిభకు నిదర్శనమని అన్నారు. భవిష్యత్తులో లాస్య శ్రీ మరెన్నో జాతీయ, అంతర్జాతీయ స్థాయి పురస్కారాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ కొమటినేని నాసరయ్య, ప్రిన్సిపాల్ జి. బర్నబాస్, చీఫ్ అకాడమిక్ ఆఫీసర్ టి. విజయరాజు, క్యాంపస్ ఇన్చార్జ్ కోట బాపూజీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు లాస్య శ్రీ ని అభినందించి, శుభాకాంక్షలు తెలియజేశారు.

## ముస్తఫా కుటుంబంపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారు : డా. గోపిరెడ్డి..

నరసరావుపేట, ఆగస్టు 5 ప్రభాతవార్త : వైయస్సార్సీపీ మైనార్టీ వర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే ముస్తఫా కుటుంబంపై నమోదు చేసిన కేసులు రాజకీయ కక్షసాధింపులో భాగమేనని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం పరిపాలన కంటే రాజకీయ ప్రత్యర్థులపై అక్రమ కేసులు నమోదు చేయడంపైనే దృష్టి పెట్టిందని విమర్శించారు. ముస్తఫా కుమార్తె నూరి ఫాతిమా ప్రభుత్వం పై విమర్శలు చేయడమే ఈ చర్యలకు కారణమని ఆయన పేర్కొన్నారు. పొగాకు వ్యాపార లావాదేవీలకు సంబంధించిన వివాదంలో మోసపోయిన బాధితులపైనే పోలీసులు కేసులు నమోదు చేశారని ఆరోపించారు. అలాగే వైసీపీ నాయకులపై రాష్ట్రవ్యాప్తంగా తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని విమర్శించారు. మాజీ మంత్రి సిదిరి అప్పలరాజు, మాజీ



ఎమ్మెల్యేలు బొల్లా బ్రహ్మనాయుడు, కర్నూలు జిల్లాకు చెందిన వైఎస్సార్సీపీ ఎమ్మెల్యే విరూపాక్ష పై ఏ కారణం లేకుండా దారుణమైన కేసులు పెట్టారని ఆరోపించారు. ఏపీ పోలీస్ వ్యవస్థ పనితీరు పూర్తిగా దిగజారిపోయిందన్నారు. జాతీయస్థాయిలో ఏపీ పోలీసుల పనితీరు 28వ స్థానానికి పడిపోవడం జరిగిందని ఇందుకు పోలీసు వ్యవస్థ సిగ్గుపడాలన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను మరిచి రెడ్ బుక్ పాలనా అమలు చేస్తుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టి సారించాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే ముస్తఫా కుటుంబానికి అండగా నిలుస్తామని పార్టీ వారికి న్యాయం చేసేందుకు కోర్టును ఆశ్రయిస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో పట్టణ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ రిముల్లా, నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ సిలార్ భాష, జిల్లా మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు సయ్యద్ ఖాదర్ బాషా, మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు పొదిలే ఖాజా, రొంపిచర్ల మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి:: ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద.బాబు

నరసరావుపేట, ఆగస్టు 5 ప్రభాతవార్త : దేశాన్ని మత్తు పదార్థాలు, డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దేందుకు భారత ప్రభుత్వం చేపట్టిన "నషా ముక్త భారత్" జాతీయ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు పిలుపునిచ్చారు.బుధవారం బ్రహ్మకుమారి సంస్థ సభ్యులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి "నషా ముక్త భారత్" ఉద్యమాన్ని నరసరావుపేటలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉద్యమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "డ్రగ్స్ అనే మహమ్మారి యువత భవిష్యత్తును నాశనం చేస్తోంది. మత్తు




పదార్థాలకు దూరంగా ఉండేలా ప్రతి కుటుంబం, ప్రతి విద్యాసంస్థ, ప్రతి స్వచ్ఛంద సంస్థ అవగాహన కల్పించాలి. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం ప్రతి పౌరుడి బాధ్యత. ఖినషా ముక్త భారత్ఖి ఉద్యమానికి నా పూర్తి సహకారం ఉంటుంది. సమాజ హితం కోసం బ్రహ్మకుమారి సంస్థతో పాటు ఈ ఉద్యమంలో భాగస్వాములైనప్రతిఒక్కరినీఅభినందిస్తున్నాను" అని అన్నారు.అనంతరం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో హాజరైన వారందరూ డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ సమాజంలో అవగాహన కల్పిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో బి.కె. అరుణ అక్కయ్య, బి.కె. రాధిక అక్కయ్య, బి.కె. అన్నపూర్ణ అక్కయ్య, అయినవోలు సాంబశివరావు, బూర్లగడ్డ మల్లికార్జునరావుతో పాటు బ్రహ్మకుమారీలు, బ్రహ్మకుమారులు మరియు స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

## బీసీల రక్షణకు చారిత్రాత్మక చట్టం తీసుకొస్తాం: ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ.

నరసరావుపేట, ఆగస్టు 5 ప్రభాతవార్త : బీసీలకు రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో మరింత భరోసా కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం బీసీ రక్షణ చట్టాన్ని తీసుకురావడానికి కట్టుబడి ఉందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు తెలిపారు.విజయవాడలో బుధవారం బీసీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో నిర్వహించిన విస్తృత స్థాయి సమన్వయ సమావేశంలో పాల్గొన్న అనంతరం ఆయన మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు బీసీ రక్షణ చట్టం ముసాయిదాపై ప్రజాప్రతినిధులు, బీసీ సంఘాలు, నిపుణుల నుంచి విలువైన సూచనలు, సలహాలను ప్రభుత్వం



స్వీకరిస్తోంద న్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం బీసీల సంక్షేమం, రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ఈ చట్టం ద్వారా బీసీలపై వేధింపులు, కుల వృత్తుల పేరుతో అవమానాలు, వివక్షకు పాల్పడిన వారిపై కఠిన శిక్షలు విధించేలా నిబంధనలురూపొందిస్తున్నట్లు తెలిపారు.అలాగే కేసుల సత్వర పరిష్కారం కోసం ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో బీసీ రక్షణ చట్టాన్ని అమలు చేసే దిశగా ప్రభుత్వం ముందడుగువేస్తోందనివెల్లడించారు. బీసీల అభ్యున్నతికి పునాది వేసిన మహానేత ఎన్టీఆర్ ఆశయాలను, బీసీలకు అండగా నిలిచిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంకల్పాన్ని కార్యరూపంలోకి తీసుకువెళ్లే దిశగా ఈ బీసీ రక్షణ చట్టం చారిత్రాత్మక మైలురాయిగా నిలుస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు.

## చంద్రబాబు రెండేళ్లలోనే జగన్ విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని గాడిలో పెట్టారు ....

చిలకలూరిపేట, ఆగస్టు 5, ప్రభాతవార్త: చిలకలూరిపేట మండలం గొట్టిపాడు, ఈవూరివారిపాలెం, దండమూడి, మిట్టపాలెం, నాగభైరువారిపాలెం, గ్రామాల్లో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో పాల్గొన్నారు. తొలుత గొట్టిపాడులో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించనున్న మెటల్ రోడ్డుకు శంకుస్థాపన చేసిన ప్రత్తిపాటి, అనంతరం ఈవురివారిపాలెంలో రూ.10 లక్షలతో ఏర్పాటుచేసిన గ్రావెల్ రోడ్డును ప్రారంభించి, అనంతరం గొట్టిపాడు గ్రామానికి చెందిన తుమ్మలగుంట మరియమ్మ అనారోగ్య కారణం వల్ల ముందస్తు చికిత్స నిమిత్తం 4.5 లక్షల రూపాయల విలువైన లివీది నీ అందజేసి గ్రామస్తుల్ని ఉద్దేశించి మాట్లాడారు. దండమూడిలో ప్రజలతో మాట్లాడిన



ప్రత్తిపాటి.. రెండేళ్ల కూటమిపాలన : అభివృద్ధి, సంక్షేమంపై వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు.వైకుంఠపాళి ఆడకుండా రాష్ట్ర హితాన్ని దృష్టిలో పెట్టుకోవాలి జగన్ విధ్వంసం నుంచి తక్కువ కాలంలోనే చంద్రబాబు రాష్ట్రాన్ని గాడిన పెట్టారని, కూటమి ప్రభుత్వం సుదీర్ఘకాలం అధికారంలో ఉంటేనే, ప్రజలకు... రాష్ట్రానికి ఎనలేని మేలు కలుగు తుందని ప్రత్తిపాటి సూచించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు గుజరాత్ ను ఆదర్శంగా తీసుకోవాలని, అక్కడ ఒకే ప్రభుత్వం ఎక్కువకాలం అధికారంలో ఉన్నందున, దేశంలోనే నంబర్ 1గా నిలిచిందన్నారు. గతంలో మాదిరి వైకుంఠపాళి ఆడకుండా ప్రజలు ఎల్లప్పుడూ రాష్ట్ర హితాన్ని దృష్టిలో పెట్టుకోవాలని ప్రత్తిపాటి సూచించారు. గ్రామాల్లో ఇంకా మౌలిక వసతులు చేపట్టాల్సి ఉందని, నిధుల కొరత వల్లే ప్రభుత్వం సకాలంలో ప్రజలు కోరిన అభివృద్ధిని అందించలేకపోతోందన్నారు. స్థానిక ఎన్నికల్లో ప్రతి గ్రామంలో కూటమి పార్టీలకు తిరుగులేని విజయం అందించాలని ఈ సందర్భంగా ప్రత్తిపాటి ప్రజల్ని కోరారు.కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, కామినేని సాయిబాబు, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ రఫాని, బీజేపీ నేతలు మల్లెల శివనాగేశ్వరరావు, నెల్లూరి రంజిత్, టీడీపీ నాయకులు అంబటి సోంబాబు, జాకోబు రాజు, చిగురుపాటి రాజా, చిన్నం రవి, గొట్టిపాటి బాబు, చెన్నంశెట్టి సాంబశివరావు, కనపర్తి సుబ్బారావు, పద్మ, కృష్ణ, ప్రవీణ్, తాళ్లూరి సాంబశివరావు, శివప్రసాద్, దండ శ్రీనివాసరావు, కొత్త మోహనరావు, నాగభైరు శివరాం, నాగభైరు ఆంజనేయులు, ధూళిపాళ్ల శ్రీనివాసరావు, ఈవురి బ్రహ్మానందం, మద్దాల వెంకట ప్రసాద్, మద్దాల స్వామి, టీడీపీ నాయకులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు ప్రయోజనాల ముసుగులో రాజకీయ ప్రయోజనాలకోసమే జగన్ పర్యటనలు : ప్రత్తిపాటి


చిలకలూరిపేట, ఆగస్టు 5, ప్రభాతవార్త: అధికారంలో రైతుల గోడు పట్టించుకోని జగన్ ... ఇప్పుడు రాజకీయ ప్రయోజనాలకోసం పొగాకు రైతులు జపం చేస్తున్నారని, తన పాలనలో 201923 మధ్య పొగాకు రైతులకు తానేం మేలు చేశాడో చెప్పాలని శాసనసభ్యులు ప్రత్తిపాటిపుల్లారావు డిమాండ్ చేశారు. జగన్ కు రైతు ప్రయోజనాలకంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమని, ఆయన దేవరాపల్లి పర్యటనలో వైసీపీ శ్రేణుల అత్యుత్సాహమే అందుకు నిదర్శమని ప్రత్తిపాటి అసహనం వ్యక్తం చేశారు.బుధవారం ఆయన చిలకలూరిపేట పట్టణంలో 38వ వార్డులో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో పాల్గొన్నారు. రూ.62.85 లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్లు, డ్రైన్లు, తాగునీటి పైపులైన్ ఏర్పాటు పనులకు కూటమి నాయకులతో కలిసి శంకుస్థాపన చేసిన ప్రత్తిపాటి.. మీడియాతో మాట్లాడారు.అలజడులు.. అరాచకాల ఆలోచన తప్ప...రైతులకు మేలుచేయాలన్న ఆలోచన జగన్ కు లేదు.. ప్రశాంతమైన రాష్ట్రంలో అలజడులు, ఆందోళనలు సృష్టించాలి.. పెట్టుబడిదారుల్లో భయాందోళనలు రేకెత్తించి పెట్టుబడుల్ని అడ్డుకోవాలన్న దురాలోచన తప్ప... జగన్ కు నిజంగా రైతులకు మేలుచేయాలన్న ఆలోచన లేదని ప్రత్తిపాటి పేర్కొన్నారు. ఐదేళ్లు రైతులకు ముఖం చూపించకుండా, పరదాల మాటున కాలం గడిపిన మాజీ సీఎం.. నేడు పొగాకు రైతులపక్షాన మాట్లాడటం నిజంగా సిగ్గుచేటన్నారు. ర్యాలీల పేరుతో వైసీపీ శ్రేణులు రోడ్లపై వీరంగం వేస్తూ,



సైలెన్సర్లు తొలగించిన వాహనాలతో ప్రజల్ని ఇబ్బందులకు గురిచేస్తూ, రాజకీయ నినాదాలు చేస్తే, రైతుల సమస్యలు ఎలా పరిష్కారవుతాయో జగనే చెప్పాలని ప్రత్తిపాటి ప్రశ్నించారు. జగన్ హయాంలో రూ.7వేలు, రూ.9వేలే... తన హయాంలో పొగాకు రైతులకు ఎంత ధర చెల్లించారో జగన్ చెప్పాలన్న ప్రత్తిపాటి.. క్వింటాకు రూ.7 నుంచి రూ.9వేల వరకు మాత్రమే చెల్లించి, నాడు వారి రెక్కల కష్టాన్ని వైసీపీ నాయకులు, వారి చెప్పుచేతల్లోని వ్యాపారులే దోచుకున్నారని ప్రత్తిపాటి స్పష్టం చేశారు. ఆనాడు అదనంగా ఒక్క కిలోకు ఒక్కరూపాయికూడా జగన్ ప్రభుత్వం రైతులకు చెల్లించలేదన్నారు. ఈ ఏడాది పొగాకు సాగు పెరిగి, అధిక దిగుబడి రావడంతో మార్కెట్లోకి 240 మిలియన్ టన్నుల సరుకు వచ్చిందని, డిమాండ్ 140మిలియన్ టన్నులే అయినప్పటికీ, రైతుకష్టానికి నష్టం రాకూడదని కూటమి ప్రభుత్వం 94 మిలియన్ టన్నుల కొనుగోళ్లకు సిద్ధమైందన్నారు. అలానే పొగాకు రైతులకు రూ.50 వేల వరకు వడ్డీలేని రుణాలు రెండేళ్లపాటు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని, అదనంగా కిలోకు రూ.20 చొప్పున చెల్లించడానికి ముందుకొచ్చిందన్నారు. ఎప్పటికప్పుడు కేంద్రప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వం పొగాకు రైతులప్రయోజనాల్ని కాపాడిందన్నారు. ఈ విధంగా చంద్రబాబు ప్రభుత్వం ముందుజాగ్రత్తలన్నీ తీసుకున్నాక, జగన్ కు పొగాకు రైతుల అంశాన్ని రాజకీయంగా వాడుకోవాలనే దురాలోచన వచ్చిందని ప్రత్తిపాటి అసహనం వ్యక్తం చేశారు. నేటి ఆయన దేవరాపల్లి పర్యటనే అందుకు నిదర్శమన్నారు. వైసీపీ శ్రేణులు ర్యాలీల పేరుతో సైలెన్సర్లు తొలగించిన వాహనాలతో రోడ్లపై విన్యాసాలు చేయడం.. దేవరాపల్లి పొగాకు యార్డులో రైతుల ఉత్పత్తుల్ని తొక్కి పాడుచేయడం వంటి చర్యలకు పాల్పడ్డారని, ఇలాంటి పనులతో రైతులకు ఎలా మేలు జరుగుతుందో జగనే చెప్పాలని ప్రత్తిపాటి ప్రశ్నించారు. జగన్ హయాంలో నిర్లక్ష్యానికి గురైన మున్సిపాలిటీలకు, నేడు పూర్వ వైభవం... 201419 మధ్య నాటి టీడీపీ ప్రభుత్వం మునిసిపాలిటీల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని, ఆ క్రమంలో పట్టణాలు, నగరాల్లో ప్రజలకు ఇబ్బంది లేకుండా రోడ్లు, డ్రైన్లు, పార్కుల ఏర్పాటు జరిగిందని ప్రత్తిపాటి చెప్పారు. 201924 మధ్య జగన్ నిర్లక్ష్యంతో పూర్తిగా అధ్వానంగా తయారైన మున్సిపాలిటీలకు, నేడు మరలా కూటమి ప్రభుత్వం వచ్చాకే పూర్వ వైభవం వచ్చిందన్నారు. చిలకలూరిపేట మున్సిపాలిటీలో మౌలిక వసతుల కల్పన, సుందరీకరణ, ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించేలా మున్సిపాలిటీని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నట్టు ప్రత్తిపాటి తెలిపారు. వచ్చే నెలరోజుల్లో పట్టణాభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేశామని, ముఖ్యమంత్రి చంద్రబాబు, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ మార్గదర్శాలకు అనుగుణంగా ప్రాధాన్యతక్రమంలో ప్రజలకు అవసరమైన అభివృద్ధిని పూర్తి చేస్తున్నట్టు ప్రత్తిపాటి పేర్కొన్నారు. పార్కులు, శ్మశానాల సుందరీకరణ, తాగునీటి సరఫరా, రోడ్లు..డ్రైన్ల నిర్మాణం పనుల్ని ప్రణాళికాబద్ధంగా పూర్తిచేస్తున్నా మన్నారు.కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ రఫాని, ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, టీడీపీ నాయకులు మద్దిబోయిన శివ, జంగా వినాయకరావు, పిల్లి కోటేశ్వరరావు, జంగా సుజాత, అరెకట్ల భూలక్ష్మి, యదాల సుజాత, మధు, రంగా, కుల్లి చిన్న బాబు, చిట్లూరి రమేష్, నాని టీడీపీ నేతలు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం.ఆర్.ఎఫ్ నగదు చెక్కులు పంపిణీ చేసిన ప్రత్తిపాటి


చిలకలూరిపేట, ఆగస్టు 5, ప్రభాతవార్త: వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నవారికి, వైద్యసేవల నిమిత్తం ప్రభుత్వం నుంచి మంజూరైన సీఎం.ఆర్.ఎఫ్ చెక్కుల్ని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు బుధవారం లబ్ధిదారులకు, వారి కుటుంబసభ్యులకు అందచేశారు. మొత్తం 22 మందికి రూ.22.58 లక్షల విలువైన నగదు చెక్కుల్ని స్వయంగా అందించారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో కూటమి నాయకులతో కలిసి చెక్కులు పంపిణీ చేసిన అనంతరం, ప్రత్తిపాటి లబ్ధిదారులతో మాట్లాడి, వారి కుటుంబ స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు. చంద్రబాబు ప్రజారోగ్య రక్షణ విషయంలో ఎప్పుడూ ముందే ఉంటారని, అనారోగ్య సమస్యలతో బాధపడేవారు ఈ ప్రభుత్వంలో ఆందోళన చెందాల్సిన పనిలేదని ప్రత్తిపాటి ధైర్యం చెప్పారు.కార్యక్రమంలో నియోజకవర్గ



సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ రఫాని, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, బండారుపల్లి సత్యనారాయణ, కామినేని సాయిబాబు, ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు మద్దిబోయిన శివ, ముల్లా కరిముల్లా, కొత్త కోటేశ్వరరావు , జయప్రసాద్, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గడియార స్తంభం సెంటర్లో గల "అన్నా క్యాంటీన్" ను సందర్శించిన టిడిపి నాయకులు...

చిలకలూరిపేట, ఆగస్టు 5, ప్రభాతవార్త: రాష్ట్రంలో పేద ప్రజల యొక్క ఆకలి తీర్చేందుకు విజినరీ లీడర్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు ఏర్పాటుచేసిన అన్నా క్యాంటీన్ ను ఈరోజు ఉదయం టిడిపి ముఖ్య నాయకులు సందర్శించి ప్రజలతో కలిసి అల్పాహారం తినడం జరిగింది... అక్కడ సదుపాయాలను పరిశీలించి వారితో మాట్లాడడం జరిగింది...ఈ సందర్భంగా ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తూ 5 రూపాయలకే కడుపునిండా టిఫిన్ భోజనం పెడుతున్నందుకు చంద్రబాబు నాయుడు గారికి జీవితాంతం రుణపడి ఉంటామని, అలాగే పేదలందరికీ ఆకలి తీరాలనే ఉద్దేశంతో పట్టణంలో మూడు అన్నా క్యాంటీన్లను ఏర్పాటుచేసిన నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు కి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు....ఈ కార్యక్రమంలో షేక్



రఫాని(మాజీ మున్సిపల్ చైర్మన్), ఎస్ ఎస్ సుభాని (మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్) షేక్ మస్తాన్ వలి(క్లస్టర్) సయ్యద్ వాహబ్ (కో క్లస్టర్) షేక్ అబ్దుల్లా, వేటపాలెం సుభాని, షేక్ మోలా బుడే,కొండా శ్రీను, షేక్ కాలేషా, పిల్లి లెనిన్, షేక్ అమీర్ హంజా, సయ్యద్ హుస్సేన్,పఠాన్ బుజ్జి పాల్గొన్నారు

6MN 7PG-GNT_6MN 7PG-GNT.qxd 05-08-2026 PM 11:45 Page 1



## సత్తెనపల్లి రైతు బజార్‌లో తక్కువ ధరల బియ్యం కౌంటర్ ప్రారంభించిన ఎమ్మెల్యే 'కన్నా'

సత్తెనపల్లి, ఆగస్టు 5, ప్రభాతవార్త: ప్రజలకు బియ్యం అందిస్తూ తక్కువ ధరకు స్టీమ్,రా బియ్యం విక్రయాలు ప్రారంభించిన తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు శాసన సభ్యులు కన్నా లక్ష్మీ నారాయణ. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ మార్కెట్ క్వాలిటీనే తక్కువ ధరకు



ఇస్తున్నాం... రైస్ మిల్లర్స్. ప్రజలకు మంచి జరుగుతుం దంటే కూటమి ప్రభుత్వం సత్వరమే స్పందిస్తుందని పేద వర్గాలకు మేలు చేసేందుకు ఏర్పాటుచేసిన తక్కువ ధరకు బియ్యం విక్రయ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. సత్తెనపల్లి రైతు బజార్‌లో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన తగ్గింపు ధరల బియ్యం విక్రయ ప్రత్యేక కౌంటర్లను ప్రభుత్వ అధికారులతో కలిసి కన్నా ప్రారంభించారు. ఈ సందర్భంగా కొనుగోలుదారులకు బియ్యం అందించి విక్రయాలను లాంఛనంగా ప్రారంభి, బియ్యం నాణ్యతను పరిశీలించారు. ధరలు పెరుగుతున్నాయన్న ఉద్దేశంతో తక్కువ ధరకు ప్రజలకు బియ్యం అందించాలనే లక్ష్యంతో 23వ తేదీన ఈ ప్రక్రియను ప్రారంభించారనీ అన్నారు. కేవలం 8 రోజుల వ్యవధిలో సంబంధిత చర్యలను పూర్తి చేయడమే కాకుండా యాప్‌ను కూడా అందుబాటులోకి తెచ్చారనీ తెలిపారు. ఇదే కూటమి ప్రభుత్వ గొప్పతనమని ,పనిచేసే ప్రభుత్వమంటే కూటమి ప్రభుత్వం అని చెప్పారు ప్రజలకు మంచి జరగాలనే లక్ష్యంతో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి స్టీమ్, రా బియ్యాన్ని తక్కువ ధరకే అందిస్తున్నామని, ఈ కార్యక్రమాన్ని పేద ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలనీ పిలుపునిచ్చారు. రైతులపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తోందనీ, ధాన్యం విక్రయించిన 24 గంటల్లోపు రైతుల ఖాతాల్లో నగదు జమ చేయడం చాలా గొప్ప విషయం అన్నారు. గతంలో జనవరిలో వచ్చిన సంచులు రాని పరిస్థితి ఉండేదనీ, ధాన్యం అమ్మిన నెలల తర్వాత కూడా డబ్బు జమ కాక రైతులు అనేక ఇబ్బందులు పడేవారనీ గుర్తు చేశారు. రాష్ట్రంలోని 115 రైతు బజార్లలో, 500 వరకు రైస్ మిల్లుల లేఅవుట్‌లలో 10 కిలోల చొప్పున బియ్యం విక్రయాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ మంచి కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం లో వివిధ హోదాల్లో వున్న రాష్ట్ర జిల్లా నియోజకవర్గ పట్టణ వార్డు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## సేవా కార్యక్రమాలే సమాజానికి బలమైన పునాది

సత్తెనపల్లి, ఆగస్టు 5, ప్రభాతవార్త: సమాజంలో ఆకలితో ఉన్నవారికి అండగా నిలవడం కంటే గొప్ప ప్రజాసేవ మరొకటి లేదని లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) పల్నాడు జిల్లా అధ్యక్షులు, న్యాయవాది జొన్నలగడ్డ విజయ్ కుమార్ అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మాస్టన్ పేట జ్యోతి ఫౌండేషన్‌లో బుధవారం జరిగిన అన్న సంతర్పణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దాతల సహకారంతో వరుసగా 831 రోజులుగా భరతమాత అన్న ప్రసాద వితరణ పథకాన్ని విజయవంతంగా కొనసాగిస్తూ నిరుపేదల ఆకలి తీర్చుతున్న న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు



సేవలు ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని కొనియాడారు. కీర్తిశేషులు నేరెళ్ల భాగ్యలక్ష్మి సంవత్సరీకం సందర్భంగా ఆమె కుమారులు నేరెళ్ల మోహన్, మాధవ్, శ్యామ్ ఆర్థిక సహకారంతో 121 మంది నిరుపేదలకు ఉచిత భోజనం అందించారని పేర్కొన్నారు. న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు మాట్లాడుతూ, ప్రజా సేవలో రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందన్నారు. కేవలం రూ.30కే రుచి, శుచికరమైన భోజనం అందిస్తున్న క్యాటరింగ్ నిర్వాహకుడు ఓగిబోయిన కొండలను ఆయన ప్రత్యేకంగా అభినందిస్తూ, సేవాభావమే ఇలాంటి కార్యక్రమాలకు అసలు బలమని చెప్పారు. కార్యక్రమానికి సహకరించిన నేరెళ్ల కుటుంబ సభ్యులకు, సేవలందించిన వలేటి కుమారి, ముఖ్య అతిథి జొన్నలగడ్డ విజయ్ కుమార్ తో పాటు సహకరించిన ప్రతి దాతకు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## ఫణిధం గ్రామంలో పొలం పిలుస్తోంది

సత్తెనపల్లి, ఆగస్టు 5, ప్రభాతవార్త: సత్తెనపల్లి మండలంలోని ఫణిధం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సత్తెనపల్లి మండల వ్యవసాయ అధికారి బి సుబ్బారెడ్డి గారు మాట్లాడుతూ ప్రతి పంటలో పచ్చదోమ మరియు తామర పురుగులు ఉధృతి ఎక్కువగా ఉండటం



గమనించడమైనది. నివారణ కొరకు ఇమిడాక్లోప్రిడ్ 18.5 శీలి 40 మి.లీ/ఎకరానికి లేదా ఫ్లోనికామిడ్ 60 గ్రా/ఎకరానికి లేదా ఫిప్రోనిల్ 400 మి.లీ/ఎకరానికి పిచికారీ చేయండి. సెర్కోస్పోరా ఆకుమచ్చ కూడా గమనించబడింది. నివారణ కొరకు మాంకోజెబ్ + కార్బెండజిమ్ మిశ్రమ శిలీంధ్రనాశిని 400 గ్రా/ఎకరానికి పిచికారీ చేయండి. పురుగుమందులతో పాటు పైపాటుగా 191919 లేదా మల్టీ కె పోషకాలను పిచికారీ చేయండి. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు నిమ్మగడ్డ రాము గారు, రైతులు, రైతు సేవ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## 2ఏళ్ల నమ్మకం సంక్షేమం అభివృద్ధి ఇంటింటి ప్రచారంలో 'కన్నా'

సత్తెనపల్లి, ఆగస్టు 5, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణం 12వ వార్డు నందు జరిగిన 2ఏళ్ల నమ్మకం సంక్షేమం అభివృద్ధి ఇంటింటి ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు శాసన సభ్యులు కన్నాలక్ష్మీనారాయణ. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూటమి నాయకులు కార్యకర్తలు,నాయకులతో కలిసి ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరించారు. విద్యార్థి విద్యార్థినీలను తల్లికి వందనం పథకం అమలవుతున్న తీరును అడిగి తెలుసుకున్నారుఅధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల్లోనే కూటమి ఇచ్చిన హామీలను 90 శాతం అమలు చేసి చూపించాం .ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం మరింతగా అభివృద్ధి చేందుతుంది .ప్రతి ఒక్కరి ఇంటికి వెళ్ళి గర్వంగా



వారికి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించగలుగుతున్నామని. కూటమి నాయకులు అందరూ ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించాలని కన్నా సూచించారు. ఈ కార్యక్రమంలోవివిధ హోదాల్లో వున్న రాష్ట్ర జిల్లా , నియోజకవర్గ, పట్టణ వార్డు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 1న ఛలోఢిల్లీ.. సీపీఐ పిలుపు

సత్తెనపల్లి, ఆగస్టు 5, ప్రభాతవార్త: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఐ పోరాటం ఉధృతం సత్తెనపల్లి నియోజకవర్గంలో ఆగస్టు 9 తేదీన జిపు జాత.... సిపిఐ చలో ఢిల్లీ గోడపత్రిక ఆవిష్కరణ. సత్తెనపల్లి ఆగస్టు 5. సిపిఐ సత్తెనపల్లి కార్యాలయంలో చలో ఢిల్లీ కార్యక్రమం గోడపత్రిక ఆవిష్కరణ సందర్భంగా సత్తెనపల్లి నియోజకవర్గ కార్యదర్శి ముసునూరు రమేష్ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు మార్పు రావాలి-మార్పు అనివార్యం" నినాదంతో ఆగస్టు 6 నుంచి 15 వరకు దేశవ్యాప్తంగా గ్రామాలు,



పట్టణాల్లో పాదయాత్రలు, ప్రచార కార్యక్రమాలు నిర్వహించి, సెప్టెంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో మహా ర్యాలీ చేపట్టనున్నట్లు తెలిపారు..గత 12 ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని, ఖాళీ ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, రైతులకు చట్టబద్ధమైన కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) హామీ కల్పించాలని, పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలని ఆయన డిమాండ్ చేశారు. దేశ సంపదను కొద్దిమంది కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారని ఆరోపించారు..మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేయడంలో కూడా కేంద్ర ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. .రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం ముందు రాష్ట్ర హక్కులను సాధించడంలో విఫలమైందని పేర్కొన్నారు, ప్రత్యేక హోదా, కేంద్ర నిధులు, కేజీ బేసిన్ సహజ వాయువు, చమురు వనరుల్లో రాష్ట్రానికి 50 శాతం వాటా సాధించాలని కోరారు.ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి నిరుద్యోగ యువతను మోసం చేశారని, ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నోట్ల రద్దు నిర్ణయంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని,కార్మికుల ఎనిమిది గంటల పనిదినాన్ని 12 గంటలకు పెంచే చర్యలు కార్మిక హక్కులపై దాడిగా అభివర్ణించిన ఆయన, మహిళలపై పెరుగుతున్న దాడులను అరికట్టడంలో కూడా కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు..కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సెప్టెంబరు 1న నిర్వహించే ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షులు ఆర్ శేషయ్య. ఏఐటి యుసి నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు కే శ్రీనివాస్. యు అంజిరెడ్డి. నాయకులు డియర్. మస్తాన్. కె రామయ్య తదితరులు పాల్గొన్నారు

# బాపట్ల జిల్లా వార్త



## ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన కలిగి ఉండాలి

**-మండల వ్యవసాయాధికారి పి.ప్రియదర్శని**

చేబ్రోలు(పొన్నూరు), ఆగస్టు 5,ప్రభాతవార్త: రైతుల ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయాధికారి పి.ప్రియదర్శని సూచించారు. చేబ్రోలు మండల పరిధిలోని



నారాకోడూరు, వేజండ్ల గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రియదర్శిని మాట్లాడుతూ ప్రతి రైతు పంటల బీమా ప్రీమియాన్ని చెల్లించాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో బీమా పథకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించేందుకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను రైతులు అవలంభించాలన్నారు. నీటి సంఘాల అధ్యక్షుడు మాదాల విష్ణు మాట్లాడుతూ ప్రస్తుత ప్రతికూల పరిస్థితుల్లో పంటలను కాపాడుకునేందుకు ప్రతి రైతు పంటల బీమా పథకాన్ని ఉపయోగించుకోవాలన్నారు. డిఆర్‌డిఎ ఎపిఎం శ్రీలక్ష్మి మాట్లాడుతూ ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకం రైతులు తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## బిడ్డకు తల్లిపాలు శ్రేష్టం

పొన్నూరు, ఆగస్టు 5,ప్రభాతవార్త: బిడ్డకు తల్లిపాలు శ్రేష్టమని, తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజెప్పేందుకు ప్రభుత్వం తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తుందని మన్నవ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ సూపర్‌వైజర్ ఎం.వేణు చెప్పారు. మండల పరిధిలోని మన్నవ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య



కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అవగాహన సదస్సు జరిగింది. సదస్సులో ఎం.వేణు మాట్లాడుతూ బిడ్డకు తల్లి ఇచ్చే మొదటి బహుమతి తల్లిపాలు అని చెప్పారు. వీటిని ముర్రుపాలుగా కూడా పిలుస్తారన్నారు. ఈ మొదటి పాలలో కొలెస్ట్రాల్ శాతం ఎక్కువగా ఉంటుందన ఆనరు. ఈ పాలలో పోషకాలతో కూడిన రోగ నిరోధక శక్తి ఉంటుందన్నారు. బిడ్డకు కావలసిన రోగ నిరోధక శక్తిని పెంచి రోగాల నుండి కాపాడతాయన్నారు. తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లి బిడ్డల బంధాన్ని మెరుగుపరుస్తాయన్నారు. అందువల్ల అప్పుడే పుట్టిన శిశువుకు తల్లిపాలు ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా పట్టివ్వడం మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం బి.ఏసుమ్మ,ఎంసిహెచ్‌పి సౌందర్య, ఆషాలు, తల్లులు పాల్గొన్నారు.

## ప్రమాద భరితంగా రహదారి

**-పట్టించుకోని మునిసిపల్ అధికారులు -రోడ్డుపైనే కంకర, ఇసుకతో ప్రజలకు ఇబ్బందులు**

**-ఇప్పటికైనా అధికారులు స్పందించాలని ప్రజల విజ్ఞప్తి**

పొన్నూరు, ఆగస్టు 5,ప్రభాతవార్త: పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం మీదుగా ఏఎస్ఎం కళాశాలకు వెళ్ళే రోడ్డు ప్రమాద భరితంగా మారి, ప్రజలకు ఇబ్బందులను కలుగజేస్తుంది. ఈ రోడ్డులో సైడ్ కాలువ నిర్మాణానికి కంకర, ఇసుక రోడ్డుపైనే డంప్ చేశారు. కాలువ పూర్తి చేసినప్పటికీ దానిపై స్లాబ్ వేసేందుకు ఇనుక చట్రాలు తయారు చేసి పెట్టారు. ఆ చట్రాలపైన ఇసుక, సిమెంట్, కంకర



కలిపి స్లాబ్ వేయాల్సి ఉంది. అయితే పక్షం రోజులు గడిచినా ఇంత వరకు శ్లాబ్ వేయలేదు. రోడ్డుపై ఉన్న కంకర, ఇసుక తీయకపోవడంతో కంకర, ఇసుక రోడ్డు మొత్తం విస్తరించి అటువైపుగా వెళ్ళే ద్విచక్రవాహనదారులకు ఇబ్బందిగా మారింది. ఈ రోడ్డు గుండా వెళ్ళే ద్విచక్రవాహనదారులు, ఆటోవాళ్ళు, పాదచారులు జారి కిందపడి గాయాల పాలవుతున్నారు. ప్రతి నిత్యం మునిసిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది ఈ రోడ్డుపైనే వెళ్తుంటారు కానీ, వారికి మాత్రం ఈ రోడ్డుపై తామరతంపరగా పడి ఉన్న కంకరను, ఇసుకను తొలగించాలనే ఆలోచన రాకవపోవడ శోచనీయమని పలువురు పట్టణ పౌరులు విమర్శస్తున్నారు. ఇప్పటికైనా మునిసిపల్ అధికారులు పట్టించుకొని రోడ్డును శుభ్రపరిచి ఇబ్బందులను తొలగించాలని కోరుతున్నారు.

## ఎల్‌నినో ప్రభావంతో దిగుబడులు తగ్గొచ్చు

**-మండల వ్యవసాయాధికారి రాజవరపు వెంకటేశ్వరరావు**

పొన్నూరు, ఆగస్టు 5,ప్రభాతవార్త: ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో దిగుబడులు తగ్గే అవకాశం ఉందని మండల వ్యవసాయాధికారి రాజవరపు వెంకటేశ్వరరావు చెప్పారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని ఉప్పరపాలెం, సీతారామపురం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజవరపు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వరిపైరుకు ఎకరాకు రూ.800ప్రీమియం చెల్లిస్తే రూ.40వేలు బీమా వర్తిస్తుందన్నారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో పంటల బీమా అనేది రైతులకు మేలు చేస్తుందన్నారు. ప్రస్తుతం వరి వెద సాగు చేపట్టిన రైతులు ఈ పంట నమోదు చేయించుకోవాలన్నారు. రైతులు వరి వెద సాగు చేసిన పొలంలో



జీవామృతము పిచికారి చేసిన తర్వాత నీటి ఎద్దడిని ఒక 10రోజుల వరకు తట్టుకొనే అవకాశం ఉందన్నారు. రైతులు ఎపి ఎయిమ్స్ యాప్ ద్వారానే ఎరువులను తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి ఐ.శ్రీకాంత్, వ్యవసాయ సహాయకులు బి.ప్రీతి, పి.దుర్గమ్మ, ఎంపిఈఓ సింహాద్రి సురేష్‌బాబు తదితరులున్నారు.

## సత్తెనపల్లి ఎల్ఐసి ఏజెంట్స్ అసోసియేషన్ కొత్త కార్యవర్గం మొదటి సమావేశం

సత్తెనపల్లి, ఆగస్టు 5, ప్రభాతవార్త: సత్తెనపల్లి ఎల్ఐసి ఏజెంట్స్ అసోసియేషన్ కొత్త కార్యవర్గం మొదటి సమావేశం సత్తెనపల్లి లోని శ్రీ రామాలయం మండపం లో ప్రెసిడెంట్ మంచాల రమేష్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు అందరూ పాల్గొన్నారు,ప్రతి ఒక్కరూ లియాఫీ కోసం పనిచేస్తామని తెలిపారు ,పాలసీదారులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి



చేస్తామని,ప్రతి నెల జరిగే నిది మీటింగ్ ని మండలాల వారీగా నిర్వహించాలని ఎవరైనా నిది మెంబెర్ స్పాన్సర్ చేస్తే వారి గ్రామం లో జ ం ఎ ా ల ని నిర్ణయించారు, ఎక్కువ మంది సభ్యులను జేర్చాలని లియాఫీ భవన్ నిర్మించటానికి కార్యాచరణ సిద్ధం చేయాలని తీర్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులందరినీ ఘనంగా సన్మానించటం జరిగింది. ఈ కార్యక్రమం లో సెక్రటరీ ఈదా శ్రీనివాసరెడ్డి ,ట్రెజరర్ నేరెళ్ల శంకరరావు ,శాశ్వత కమిటీ చైర్మన్ నల్లమోతు వెంకటేశ్వర్లు ,కన్వీనర్ పవన్ కుమార్,గౌరవ అధ్యక్షులు దొడ్లా కోటేశ్వరరావు ,సమన్వయ కమిటీ చైర్మన్ కంకణాల విష్ణువర్ధనరావు ,గౌరవ సలహాదారులు ,ఆర్గనైజింగ్ సెక్రటరీ,రెసిడెంట్ సెక్రటరీ,వైస్ ప్రెసిడెంట్ లు ,జాయింట్ సెక్రటరీ లు మరియు నిది మెంబర్లు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కేంద్ర రైల్వేశాఖ మంత్రిని కలిసిన 'కనుమూరి'

సత్తెనపల్లి, ఆగస్టు 5, ప్రభాతవార్త: ఢిల్లీలో కేంద్ర రైల్వే శాఖమంత్రి వి.సోమన్నను మర్యాదపూర్వకంగా కలిసిన సత్తెనపల్లి తెలుగుదేశం నాయకులు కనుమూరి బాజీ చౌదరి. ఈసందర్భంగా పలు అంశాలపై చర్చించారు.



## నేడు రిలే నిరాహార దీక్షలు ప్రారంభం

రేపల్లె, ఆగస్టు 5, ప్రభాతవార్త:డిఎస్సీ అక్రమాలపై గురువారం నుంచి నిరసన రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తామని వైకాపా రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త పీటా నాగమోహన్ కృష్ణ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిరాహార దీక్షలు జరుగుతాయని చెప్పారు. గురువారం రేపల్లె పురపాలక సంఘం, శుక్రవారం నగరం మండలం, శనివారం చెరుకుపల్లి మండలం, ఆదివారం నిజాంపట్నం, రేపల్లె మండలాల్లో నిరసన నిరాహార దీక్షలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ



కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి నాయకులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, మహిళలు, నిరుద్యోగ యువత, విద్యార్థులు తదితరులు పాల్గొనాలని ఆయన కోరారు.

## తల్లిపాల ప్రాముఖ్యత తెలుసుకోవాలి

రేపల్లె ఆగస్టు 5, ప్రభాతవార్త:సమాజంలో ప్రతి ఒక్కరూ తల్లిపాల ప్రాముఖ్యత గురించి తెలుసుకోవాలని రేపల్లె ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపివో ఎం.సుచిత్ర అన్నారు. బుధవారం మండలంలోని బేతపూడి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అవగాహన కార్య క్రమం



నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు ఖచ్చితంగా తల్లిపాలు ఇవ్వాలని చెప్పారు. రెండు సంవత్సరాల లోపు పిల్లలకు చక్కెర, తేనె, స్వీట్లు, చాక్లెట్లు, శీతలపానీయాలు, ప్యాకింగ్ పదార్థాలు వంటి అనారోగ్యకరమైన ఆహారం ఇవ్వకూడదని సూచించారు. పప్పులు, పండ్లు, కూరగాయలు, పాలు, గుడ్లు వంటి పోషకాహారం అందించాలని సుచిత్ర తెలిపారు. ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది బి.జ్యోతిలక్ష్మి, విజయలక్ష్మి, వై.గాయత్రి, ఎస్.కె.నసీమా, కె.జ్యోతి, ఎం.కనకదుర్గ, లక్ష్మి, జి.నాగమల్లేశ్వరమ్మ, ఎ.ఝాన్సీ రాణి, ఎ.శాంతకుమారి, గర్భిణీలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

## వరిపంటకు బీమా చేయించుకోవాలి

భట్టి ప్రోలు(రేపల్లె), ఆగస్టు 5, ప్రభాతవార్త:ఖరీఫ్ సీజనులో వరి పంటకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద ఎకరాకు రూ.800 ప్రీమియం చెల్లించాలని భట్టి ప్రోలు మండల వ్యవసాయ శాఖ అధికారి బి.బ్రహ్మారెడ్డి చెప్పారు. బుధవారం మండలంలోని పల్లెకోన, కోనేటిపురం రైతు సేవా



కేంద్రాల పరిధిలో పొలం పిలుస్తోంది అనే కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎకరం వరిలో కలుపు నివారణకు 20-25 రోజుల దశలో ఉన్న పైరుకు బిస్పైరిబాక్ సోడియం 10 శాతం ఎస్‌సిని 80-120 ఎంఎల్ పిచికారీ చేయాలన్నారు. కౌలు రైతులు సిసిఆర్‌సి కార్డు పొందాలని చెప్పారు. సొంత భూమి కలిగిన రైతులు ఈ పంట నమోదు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు వేజళ్ళ శ్రీరామప్రసాద్, మండవ రామకోటేశ్వరరావు, దున్న తిరుపతి బాబు, రావూరి ప్రసాద్, వ్యవసాయ సహాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## రేపల్లె-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ ఏర్పాటు చేయాలి

రేపల్లె, ఆగస్టు 5, ప్రభాతవార్త:రైల్వే ప్రయాణీకుల ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకుని రేపల్లె నుండి విశాఖపట్నం, విశాఖపట్నం నుండి రేపల్లెకు ఎక్స్ ప్రెస్ రైళ్ళను ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో నడపాలని రేపల్లె పట్టణాభివృద్ధి సంఘం కార్యదర్శి సి.వి.మోహనరావు కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రేపల్లె రైల్వే స్టేషన్ దక్షిణ కోస్తా రైల్వే పరిధిలోకి వెళ్ళినందున రైలు సౌకర్యాలను మెరుగుపర్చాలని సూచించారు. మూడేళ్ళ క్రితం రూ.25.5 కోట్ల నిధులతో ప్రారంభమైన రేపల్లె రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను శరవేగంగా పూర్తిచేయాలని విజ్ఞప్తి చేశారు. రేపల్లె డెల్టా ఎక్స్‌ప్రెస్‌లకు లింగంపల్లిని టెర్మినల్ స్టేషన్‌గా నిర్ణయించాలన్నారు. రేపల్లె-మార్కాపూర్ రోడ్డు ప్యాసింజరును గుంటూరు-వికారాబాద్ పల్నాడు ఎక్స్‌ప్రెస్‌కు లింక్ ట్రైన్‌గా నడపాలని మోహనరావు సూచించారు. 67213, 67214 నెంబర్ల ప్యాసింజర్ రైళ్ళను విజయవాడ-రేపల్లె-విజయవాడ మధ్య నడపాలన్నారు. సాయంత్రం 6 గంటలకు విజయవాడ-రేపల్లె-విజయవాడకు అదనంగా ప్యాసింజర్ రైళ్ళను నడపాలని ఆయన కోరారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, బాపట్ల ఎంపి టి.కృష్ణప్రసాద్, గుంటూరు రైల్వే డివిజన్ అధికారులు స్పందించి రైల్వే ప్రయాణీకులకు మెరుగైన ప్రయాణ సదుపాయాలను కల్పించేందుకు కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు.

## ఆలపాటి ఇకపై టీడీపీ పక్షాన ప్రజలకోసం పనిచేస్తారు ..

**బీఎస్ఎన్ఎల్ ఏఈ వెంకట్రావు పదవీవిరమణ కార్యక్రమంలో ప్రత్తిపాటి**

చిలకలూరిపేట, ఆగస్టు 5, ప్రభాతవార్త: పదవీ విరమణ తర్వాత ప్రజాజీవితంలోకి రావాలన్న బీఎస్ఎన్ఎల్ మాజీ ఏఈ ఆలపాటి వెంకట్రావు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్టు శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. ఆలపాటి వెంకట్రావు సతీమణి పద్మావతి గత 10 ఏళ్లుగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. తెలుగుదేశం పార్టీలో చేరాలన్న వారి నిర్ణయాన్ని ప్రత్యేకంగా అభినందిస్తున్నట్టు ప్రత్తిపాటి తెలిపారు. బుధవారం పట్టణంలోని ఆర్యవైశ్య



కల్యాణమండపంలో జరిగిన బీఎస్ఎన్ఎల్ ఏఈ ఆలపాటి వెంకట్రావు ఉద్యోగ విరమణ సమావేశానికి ప్రత్తిపాటి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీఎస్ఎన్ఎల్ సంస్థలో సుదీర్ఘకాలం పనిచేసిన వెంకట్రావు, ఇకపై తన అనుభవాన్ని, ఆలోచనల్ని ప్రజలకోసం వినియోగించాలన్న నిర్ణయం తీసుకోవడాన్ని ప్రత్తిపాటి స్వాగతించారు. ఆలపాటి దంపతులు ఇకపై పూర్తిస్థాయిలో టీడీపీలో కొనసాగుతూ... ప్రజలకోసం పనిచేస్తారని, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటారని చెప్పారు. ఆలపాటి వెంకట్రావు సోదరుడు ఆంజనేయులు జర్నలిజంలో విశేష సేవలందిస్తున్నారన్నారు.

## గ్రామాల్లో టిడిపి నేతల ఇంటింటి పర్యటన

రాజుపాలెం, ఆగస్టు 5, ప్రభాతవార్త: నియోజకవర్గ శాసనసభ్యులు తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ పిలుపుమేరకు నెమలిపురి గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, గ్రామ కమిటీ మరియు పార్టీ సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో ఎస్సీ కాలనీలో ఈరోజు ఇంటింటికి తెలుగుదేశం (డోర్ టు డోర్) రెండేళ్ల నమ్మకం,, అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమంలో కాలనీలో ప్రతి ఇంటికి వెళ్లి ఈ రెండేళ్ల కూటమి పాలనలో రాష్ట్రవ్యాప్తంగా అందుతున్న తల్లికి వందనం, ఫ్రీ బస్సు, ఉచిత గ్యాస్ సిలిండర్లో, అన్నా క్యాంటీన్లో, అన్నదాత సుఖీభవ, అర్హులైన



వారికి పెన్షన్లు తోపాటు శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ సహకారంతో మన ఎస్సీ కాలనీలో ఇప్పటికే 10 లక్షల రూపాయలతో సీసీ రోడ్డు, 5 లక్షల రూపాయలతో సైడ్ డ్రైనేజీలు, 5 లక్షల రూపాయల కార్యకర్త భీమా, 50 వేల సీఎం రిలీఫ్ ఫండ్, 1,30,000 లివీది, గోశాల ,పవర్ స్ప్రేర్, ముగ్గురు మహిళలకు పౌజు పింఛన్లు పొందామని , త్వరలో ఎస్సీ కార్పొరేషన్ లో అర్హులైన వారికి లోన్లు కూడా రాబోతున్నాయని తెలియజేస్తూ కాలనీలో ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే చెప్పాలని అడుగుతూ ముందుకు సాగుతున్నారు. కార్యక్రమంలో రాజుపాలెం మండల మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ముప్పాళ్ళ హనుమంతరావు,, మరియు నియోజకవర్గ తెలుగు యువత ఉపాధ్యక్షుడు శనగపూల వెంకయ్య తదితరులున్నారు.

6MN 8 PG-GNT_6MN 8 PG-GNT.qxd 05-08-2026 PM 09:47 Page 1



## తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం: డాక్టర్ అనిల్ కుమార్

క్రోసూరు( ఆగస్టు 5 ప్రభాతవార్త ): క్రోసూరు మండలం గుడిపాడు లోని అంగనవాడి రెండవ సెంటర్లో బుధవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించటం జరిగినది ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అనిల్ కుమార్ మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపే తల్లిపాలు ప్రారంభించాలని, మొదటి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని అన్నారు ఆరు నెలలు పూర్తయ్యాక తల్లిపాలుతో పాటు పోషకాహారం ఇవ్వాలని పేర్కొన్నారు ఆరు నెలల తర్వాత



అనుబంధాహారం ప్రారంభిస్తూ బిడ్డకు రెండు సంవత్సరాలు వయసు వచ్చేవరకు లేదా అంతకంటే ఎక్కువ కాలం తల్లి పాలు ఇవ్వటం కొనసాగించాలని అవగాహన కల్పించారు పాలు ఇవ్వటం వలన తల్లి, బిడ్డల మధ్య ప్రేమానురాగాలు పెరుగుతాయి అన్నారు ఈ సందర్భంగా ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ మాట్లాడుతూ శిశు వు ఎదుగుదలకు అవసరమైన అన్ని పోషకాలు, విటమిన్లు, ఖనిజాలు తల్లిపాలలో సహజ సిద్ధంగా లభిస్తాయి అన్నారు పుట్టిన వెంటనే వచ్చే పసుపు రంగు చిక్కటి పాలు శిశువుకు తొలి సహజ టీకా లాంటిది అన్నారు ఈ సందర్భంగా అంగనవాడి సూపర్వైజర్ మహిబున్నీసా మాట్లాడుతూ తల్లిపాలు త్రాగే పిల్లల్లో ఆత్మవిశ్వాసం, మానసిక ప్రశాంతత, భావోద్వేగ వికాసం మెరుగ్గా ఉంటుందన్నారు. మెదడు, శరీర ఎదుగుదల, తెలివితేటలు జ్ఞాపకశక్తి అభివృద్ధికి తల్లిపాలు ఎంతో ఉపయోగపడతాయి అన్నారు ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో డబ్బా పాలు వద్దు తల్లిపాలు ముద్దు, తల్లిపాలు త్రాగించండి బిడ్డకు వ్యాధి నిరోధకత పెంచండి అంటూ నినాదాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ దివ్య, ఏఎన్ఎం నిర్మల, అంగనవాడి కార్యకర్తలు బి తిరపతమ్మ, షకీలా, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## తల్లి పాలతో శిశువుకు రోగనిరోధక శక్తి

ప్రత్తిపాడు (వట్టిచెరుకూరు), ఆగస్టు 5, ప్రభాతవార్త : తల్లి ముర్రుపాలతో శిశువుకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందని కాట్రపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎన్. దివ్యశ్రీ, ప్రత్తిపాడు సిడిపిఓ విజయలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని వింజనంపాడు, కొర్నెపాడు పాతపాలెం అంగన్వాడీ కేంద్రాలలో బుధవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి దివ్యశ్రీ, సిడిపిఓ విజయలక్ష్మి పాల్గొని మాట్లాడుతూ..తల్లి ముర్రుపాలతో శిశువు మెదడు ఎదుగుదలతో పాటు శారీరక వికాసం పెరుగుతుందని వివరించారు.



తల్లిపాలు బిడ్డకు సులభంగా జీర్ణమవుతాయన్నారు. అప్పుడే పుట్టిన శిశువుకు తల్లి నుండి వచ్చే ముర్రుపాలను అందిస్తే ఆరోగ్యవంతులుగా ఎదుగుతారని చెప్పారు. అంతేకాకుండా పిల్లలు ఎత్తుకు తగ్గ బరువు, బరువు తగ్గ ఎత్తు ఎదుగుతారని వివరించారు. తల్లి ముర్రుపాలు శిశువు తొలి రక్షణ కవచమని, మొదటి ఆరు నెలలు కేవలం తల్లిపాలే శిశువుకు సరిపోతాయని, తల్లిపాలతో రోగనిరోధక శక్తి పెరుగుతుందని, విరోచనాలు, న్యూమోనియా వంటి ఇన్ఫెక్షన్లు తల్లిపాలతోనే తగ్గుతాయని, తల్లిపాలు బిడ్డకు సులభంగా జీర్ణమవుతాయని శిశువు కలిగే ప్రయోజనాల గురించి తల్లులు, గర్భవతులకు వివరించారు. తల్లి శిశువుకు పాలు ఇవ్వడం వల్ల ప్రసవానంతరం త్వరగా కోరుకుంటుందని, రక్తస్రావం తగ్గుతుందని, తల్లి, శిశువుల మధ్య అనుబంధం, ప్రేమానురాగాలు బలపడతాయని, కొన్ని క్యాన్సర్ల ప్రమాదాన్ని తగ్గించడంలో తల్లిపాలు సహాయపడతాయని తెలిపారు. ప్రతి 100 మి.లీ పాలల్లో ఫ్యాటీ యాసిడ్ 14 ప్రోటీన్లు1.1మి.గ్రా,కార్బోహైడ్రేట్లు 7 మి.గ్రా, క్యాల్షియం 0.03, పాస్ఫరస్ 0.014, సోడియం 0.015, పొటాషియం 0.055, అన్ని పోషకాలు సమపాలల్లో బిడ్డకు అందుతాయన్నారు. బిడ్డకు ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, రెండేళ్లు నిండే అంతవరకు బిడ్డకు తల్లిపాలు కొనసాగించాలని సూచించారు. అంగన్వాడి కేంద్రాల్లో అందించి పౌష్టిక ఆహారాన్ని గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ 2 డి.నిర్మల, సూపర్వైజర్లు కె. చిన్నమ్మాయి, పి.మాధవి, హెచ్ వి రత్నప్రియ, ఎంఎల్ హెచ్ పి, ఏఎన్ఎం, అంగనవాడి కార్యకర్తలు, ఆశలు, తల్లులు, గర్భవతులు, చిన్నారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంట్లో ఒక ఉద్యోగం కల్పించాలన్నదే చంద్రబాబు ప్రధాన ధ్యేయం: ఎమ్మెల్యే రామాంజనేయులు.

ప్రత్తిపాడు (వట్టిచెరుకూరు), ఆగస్టు 5, ప్రభాతవార్త : ప్రతి ఇంట్లో ఒక ఉద్యోగం కల్పించాలన్నదే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే, పబ్లిక్ ఎకౌంట్స్ కమిటీ సభ్యులు డాక్టర్ బూర్ల రామాంజనేయులు పేర్కొన్నారు. మండలంలోని పుల్లడిగుంట, ఐదో మైలు వద్ద ఉన్న ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళాను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాసనసభ్యులు రామాంజనేయులు హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి, ఘనంగా జాబ్ మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రతి ఇంట్లో ఒక ఉద్యోగం కల్పించాలన్నదే ప్రధాన ధ్యేయంగా పనిచేస్తున్నారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో మెగా జాబ్ మేళాలు నిర్వహించడం జరుగుతుందని వివరించారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఇప్పటికే రెండుసార్లు యువతకు మెగా జాబ్ మేళా నిర్వహించామని, ఈరోజు మూడవసారి మెగా జాబ్ మేళాను ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రియదర్శిని కళాశాల యాజమాన్యానికి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ జాబ్ మేళా లో 45 ప్రముఖ కంపెనీలు పాల్గొన్నాయని, ఈ మెగా జాబ్ మేళాలు యువత జీవితాల్లో కొత్త ఆశలను నింపుతున్నాయని, ఆర్థిక స్వావలంబనకు బాటలు వేస్తున్నాయని తెలియజేశారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని పిలుపునిచ్చారు. ఇటువంటి మెగా జాబ్ మేళాల ద్వారా పెద్ద ఎత్తున ప్రైవేట్ రంగంలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని వెల్లడించారు. ఎప్పుడు ఆశాజనకంగా ముందుకు వెళ్లాలని సూచించారు. అబ్రహం లింకన్ అమెరికా అధ్యక్షుడు కాకముందు ఒక కార్పెంటర్ స్ట్రీట్ లో చెప్పులు కుడుతూ ఉండే దాని పక్కన మేకులు అందించేవాడని అలాంటివాడు దేశ అధ్యక్షుడి స్థాయికి వచ్చాడంటే అతని లక్ష్యం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవాలని యువతకు ఉదాహరణగా వివరించారు. నిరుద్యోగ యువత ఆలోచించాలని విజ్ఞానం ఇంతే ఉంటుందని విత్తనం ఎప్పుడు చేతిలో ఉంటే అంతే ఉంటది లేదా ఎక్కడైనా బస్తాలో పెడితే అది అంతే ఉంటుంది అది పడాల్సిన చోట పడితే భూమిలో పడితే అది చిన్న మొలకవుతుంది, తరువాత మొక్కవుతుంది, ఆ తరువాత మహావృక్షం అవుతుందని వివరించారు. సమాజంలో డిపెండబుల్ గా ఉండకుండా స్టాండబుల్ గా నిలవాలని కోరారు. మన తల్లిదండ్రులకి వాళ్ళ ధర్మాన్ని మనం పాటించే విషయంలో నిర్లక్ష్యం చేయొద్దని మనకు పోటీపడాలో ఇంకేమి సాధిస్తారా హీ నాట్ ఇన్ పొజిషన్ టు సెక్యూర్ ఫ్యూచర్ అదర్ యాక్సెప్టెడ్ చేయాలని కోరారు. ఈజీగా ఏది తీసుకోవద్దు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అందరికీ మంచి జరగాలని కోరుతూ మిమ్మల్ని పంపించిన తల్లిదండ్రులకు కూడా మనసారా ధన్యవాదాలు తెలుపుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ చందు రామారావు, వైస్ చైర్మన్ చందు రోహిత్, ఎంబీఏ డైరెక్టర్ చందు రవికుమార్, ఫార్మసీ ప్రిన్సిపాల్ డా చందు బాబూరావు, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డివివిఎస్. ఫణి కుమార్, వైస్ ప్రిన్సిపాల్ కె. కిరణ్ కుమార్, మీడియా కోఆర్డినేటర్ గింజుపల్లి వెంకటేశ్వరరావు, టిడిపి జిల్లా వైస్ ప్రెసిడెంట్ కల్లూరి శ్రీనివాసరావు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ కొరపాటి నాగేశ్వరరావు, కూటమి నాయకులు, సంబంధిత అధికారులు, పెద్ద ఎత్తున యువతీ యువకులు పాల్గొని విజయవంతం చేశారు.







## ఏఎన్‌యు విద్యార్థులపై దాడి..!

### - వర్సిటీలో అలజడి సృష్టించిన బయటివ్యక్తులు

ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం, ఆగస్టు5, ప్రభాతవార్త: ఏఎన్‌యు విద్యార్థులపై బుధవారం అమానుష దాడి జరిగింది. సుమారు 15 నుంచి 20మంది కాజా వాసులు వర్సిటీకి వచ్చి అలజడి సృష్టించిన సంఘటన వర్సిటీలో కలకలం రేపింది. ఘటనపై అందిన వివరాల ప్రకారం కాజాకు చెందిన ఓ వ్యాపారికి వర్సిటీలో ఎంటెక్ చదువుతున్న విద్యార్థికి మధ్య స్నేహం ఏర్పడింది. కాజాకు చెందిన వ్యాపారి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న ఎంటెక్ విద్యార్థి తన ఫ్రెండ్స్ తో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. వేడుకలు ముగిసిన తరువాత వారి మధ్య చిన్నపాటి వాగ్వాదం చోటుచేసుకుంది. వివాదం కాజా వ్యక్తికి అవమానం జరిగిందని భావించి మనస్తాపానికి గురయ్యారు. దీనిని గమనించిన విద్యార్థులు సాయంత్రం ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయం వద్ద రాజీకి వచ్చారు. కాజా వ్యక్తికి వర్సిటీ విద్యార్థులు క్షమాపణలు చెప్పాలని కోరడంతో వాదోపవాదాలు జరిగి గొడవ సద్దుమణిగింది. ఇంతలోనే కాజా వ్యక్తి కోసం వచ్చిన కొందరు మద్దతుదారులు వర్సిటీ విద్యార్థులపై దాడికిదిగారు. ఇద్దరు విద్యార్థులను అమానుషంగా కొట్టినట్టు తెలిసింది. ఈక్రమంలో అక్కడ ఉన్న అధ్యాపకులు వారిని వారించి ఇరువర్గాలను అక్కడి నుండి పంపించివేశారు. విషయం తెలుసుకున్న రెక్టార్ ఆచార్య శివరాంప్రసాద్, రిజిస్ట్రార్ సింహాచలం, ప్రిన్సిపాల్ ఆచార్య లింగరాజు, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ చంద్రమౌళి ఘటన జరిగిన ప్రాంతానికి వచ్చారు. అక్కడ బాధితులను విచారించారు. విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. సంఘటన జరిగిన ప్రాంతానికి వచ్చిన పోలీసులు విచారణ చేపట్టారు. అధికారుల నుంచి వివరాలు సేకరించారు. అలాగే హాస్టల్ వద్ద పికెటింగ్ ఏర్పాటు చేశారు. అనంతరం సంఘటనపై ప్రిన్సిపాల్ పోలీసులకు ఫిర్యాదుచేశారు.

## హిందీ వినియోగం రాజ్యాంగ నిబంధ.. సెంట్రల్ జీఎస్టీ కమిషనరేట్ ఆధ్వర్యంలో గుంటూరులో టోలిక్ సమావేశం

గుంటూరు లీగల్, ఆగస్టు 5, ప్రభాతవార్త: అధికారిక వృత్తిలో హిందీ వినియోగం అనేది అధికార భాషకు సంబంధించిన రాజ్యాంగ మరియు చట్టపరమైన నిబంధనలను నెరవేర్చడమే కాకుండా, పరిపాలనా సామర్థ్యాన్ని పెంచడానికి మరియు ప్రజలకు మరింత విస్తృతంగా చేరువ కావడానికి కూడా దోహదపడుతుందని గుంటూరు సెంట్రల్ జీఎస్టీ జాయింట్ కమిషనర్ దేవ్ కుమార్ రజ్వాని (ఐ ఆర్ ఎస్ ) పేర్కొన్నారు. సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ ఐ.ఆర్.ఎస్ అధికారి అరుణ్ రిచర్డ్ సారథ్యంలో , టౌన్ అఫీషియల్ లాంగ్వేజ్ ఇంప్లిమెంటేషన్ కమిటీఖి (టి.ఓ.ఎల్.ఐ.సి), హిందీ సమావేశం



బుధవారం గుంటూరు కన్నవారితోట జీఎస్టీ భవన్ లో జరిగింది. కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల దైనందిన కార్య కలాపాలలో హిందీ వినియోగాన్ని ప్రోత్సహించడం, అధికారులలో హిందీపై పని పరిజ్ఞానాన్ని పెంపొందించడం అనే లక్ష్యంతో కార్యక్రమం నిర్వహించారు. గుంటూరులో పనిచేస్తున్న వివిధ కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలకు చెందిన అధికారులు, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు. భారత ప్రభుత్వ అధికార భాషా విధానం అమలు, అధికారిక ఉత్తరప్రత్యుత్తరాలు, పరిపాలనాపరమైన పనులు, నోటింగ్, డ్రాఫ్టింగ్ (ఫైల్స్ తయారీ)లో హిందీ వినియోగాన్ని పెంచడం, అలాగే అధికారిక హిందీలో నైపుణ్యాన్ని మెరుగుపరచుకునే ఆచరణాత్మక పద్ధతులపై సమావేశం చర్చించింది. తొలుత గుంటూరు సెంట్రల్ జీఎస్టీ ఇన్స్పెక్టర్ సునీల్ చౌదరి, అధికార భాషా చట్టం నిబంధనలు, అధికార భాషా నియమాలు, అధికార భాషా విభాగం జారీ చేసిన వార్షిక కార్యక్రమంపై సమాచారయుతమైన సెషన్లను నిర్వహించారు. కార్యాలయ పనిలో హిందీ వినియోగంపై ఆచరణాత్మక ప్రదర్శనలు, పరస్పర చర్చలు జరిగాయి. దీనిలో పాల్గొన్నవారు తమ సందేహాలను నివృత్తి చేసుకోవడంతో పాటు అధికార భాష అమలుపై తమ అవగాహనను బలోపేతం చేసుకునే అవకాశం కలిగింది. ఈ కార్యశాలను విజయవంతం చేయడంలో సంపూర్ణ సహకారం అందించినందుకు, పాల్గొన్న కేంద్ర కార్యాలయాల అధికారులకు సెంట్రల్ జీఎస్టీ సూపరింటెండెంట్ హెయర్ బాబు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వివిధ కేంద్ర ప్రభుత్వ అధికారులు రవీంద్రనాథ్, అశుతోష్, అమృత రాజ్, శశిదాస్, ఆనందగోపాల్, చంద్రవర్మ, నీరజ్, రవి, శ్యాంప్రకాష్, అమిత్, చక్రధర్, రాజేష్, ప్రణిత, ఫణి తదితరులు పాల్గొన్నారు.

## సస్య రక్షణ చర్యలు చేపట్టండి..అధిక దిగుబడులు సాధించండి

### – గుంటూరు లాం ప్రాంతీయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ ఎ.రాధిక రమ్య

కొల్లిపర,అగష్టు 5 ప్రభాతవార్త: పసుపు పంట సాగులో రైతులు సస్య రక్షణ చర్యలు చేపట్టినట్లయితే అధిక దిగుబడులు సాధించటానికి అవకాశం ఉందని గుంటూరు లాం ప్రాంతీయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ ఎ.రాధిక రమ్య పేర్కొన్నారు.మండల కేంద్రం కొల్లిపర లో శ్రేష్ఠ రైతు ఉత్పత్తిదారుల సంస్థ వద్ద బుధవారం ఎల్‌నినో ప్రభావంపై అవగాహన కార్యక్రమం






నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ రాధిక రమ్య మాట్లాడుతూ పసుపు పంటలో గ్రీన్ మేన్యూర్ మల్లింగ్ (పిల్లి పెసర) సమయానుకూల నీరు,సమతుల్య పోషకాలు అందించాలన్నారు.నేలలో తేమ తక్కువగా ఉంటే పొడిరూపంలో ఎరువులు (యూరియా,ఎం.ఓ.పి) ఇవ్వకూడదన్నారు.అలాంటి సమయంలో పై పాటుగా 19:19:19ను 1 లీటరుకు 5 గ్రాములు పొడి మందు,13045 1 లీటరుకి 5 గ్రాములు,సూక్ష్మపోషకాల కోసం లీటరుకు 3 గ్రాములు విడివిడిగా పిచికారీ చేయాలని సూచించారు.భూగర్భజలాలు తగ్గటం వలన నీటి లవణ శాతం (ఈసి) పెరిగే అవకాశం ఉన్నందున నీటిని పరీక్షించి వినియోగించాలని..నీటిని పెట్టేటప్పుడు ఆవిరికాకుండా ఉండటానికి ఉదయం లేదా సాయంత్రం వేలల్లో మాత్రమే నీటిని అందించాలని సూచించారు.అనంతరం శ్రేష్ఠ చైర్మన్ నెర్ల కుటుంబరెడ్డి పసుపు పంటలో అంతరపంటగా సాగు చేస్తున్న స్వీట్‌కాన్ పొలాన్ని,డ్రిప్‌లో సాగవుతున్న పలు రకాల పంటలను పరిశీలించారు.తదనంతరం తూములూరులో పర్యటించారు.ఆమె వెంట తెనాలి ఉద్యానశాఖ అధికారి శ్రీనిత్య,వి.హెచ్.ఏ నాగమణి,రైతులు ఉయ్యూరు సాంబిరెడ్డి,శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హెల్మెట్ పెట్టుకో..ప్రాణాలను రక్షించుకో..-ఎస్ఐ ఎన్‌సి ప్రసాద్

కొల్లిపర,అగష్టు 5 ప్రభాతవార్త: ప్రతి ఒక్కరూ వాహనం నడిపేటప్పుడు విధిగా హెల్మెట్ ధరించుకుంటే



ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాలను రక్షించుకోవచ్చని కొల్లిపర ఎస్ఐ ఎన్‌సి ప్రసాద్ వాహనదారులకు విజ్ఞప్తి చేసారు.బుధవారం మండల పరిధిలోని మున్నంగి, కొల్లిపర, హనుమాన్‌పాలెం గ్రామాల్లో ఎస్ఐ తన సిబ్బందితో కలసి వాహనాలు తనిఖీ చేసారు.ఈ సందర్భంగా ఎస్ఐ ప్రసాద్ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనం నడపరాదని..ద్విచక్ర వాహనంపై త్రిబుల్ రైడింగ్ చేయరాదని..మైనర్లు వాహనాలు నడిపినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.వాహనాలు నడిపే వారికి తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలన్నారు.

## కొండవీడులో రెవెన్యూలో జిల్లా జైలు నిర్మాణానికి భూముల పరిశీల

యడ్లపాడు, అగస్టు 5, ప్రభాతవార్త : మండల పరిధిలోని కొండవీడు రెవెన్యూలో చౌడవరం వద్ద నున్న భూములలో జిల్లా జైలు నిర్మాణానికి ప్రతిపాదించిన భూములను జిల్లా జాయింట్ కలెక్టర్ సంజనా సిన్హా, ఆర్డీఓ వి బాలకృష్ణ బుధవారం పరిశీలించారు. జిల్లా జైలు నిర్మాణానికి అనువైన భూమి, అందుబాటులో ఉన్న మౌలిక వసతులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముఖ్యంగా ప్రధాన రహదారి నుంచి జైలు స్థలానికి చేరుకునేలా రోడ్డు నిర్మాణాన్ని ఏ దిశగా ఏర్పాటు చేయాలనే



అంశంపై సమగ్రంగా పరిశీలించి అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా భూమి సరిహద్దులు, రవాణా సౌకర్యాలు, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రోడ్డు అనుసంధానంపై అధికారులు సూచనలు చేశారు. జిల్లా జైలు నిర్మాణ ప్రక్రియలో భాగంగా అవసరమైన ప్రణాళికలను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తాహసిల్దార్ జె విజయశ్రీ, ఆర్ ఐ సుబ్బారావు, సర్వే సురేంద్రనాథ్, వీఆర్వో కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారుజ

## కొండవీడు మేజర్ కెనాల్ కరకట్టపై ఆక్రమణలు.. అధికారుల నిరక్ష్యంపై విమర్శలు


యడ్లపాడు, అగస్టు 5, ప్రభాతవార్త : కొండవీడు మేజర్ కెనాల్ కరకట్ట ఆక్రమణలకు గురవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. జాతీయ రహదారి వద్ద



నుండి ఉప్పరపాలెం గ్రామం వైపు వెళ్ళే మార్గంలో కెనాల్ కరకట్టకు చెందిన సుమారు 500 మీటర్ల మేర భూమిని కొందరు స్థానిక రైతులు దున్ని, అందులో పశువుగ్రాసం విత్తనాలు చల్లినట్లు సమాచారం. నీటిపారుదల శాఖకు చెందిన భూమిలో సాగు పనులు చేపట్టడం నిబంధనలకు విరుద్ధమని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఆక్రమణలు కొనసాగితే కెనాల్ నిర్వహణ పనులకు, కరకట్ట భద్రతకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత కెనాల్ అధికారులు వెంటనే స్పందించి ఆక్రమణలను తొలగించి, ప్రభుత్వ భూమిని పరిరక్షి ంచేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## ఉన్నవలో పొలం పిలుస్తోంది కార్యక్రమం

యడ్లపాడు, అగస్టు 5, ప్రభాతవార్త : మండల పరిధిలోని ఉన్నవ గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఏ హరి ప్రసాద్, నరసరావుపేట సహాయ వ్యవసాయ సంచాలకులు కెవి శ్రీనివాసరావు, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్తలు ఎన్ చాముండేశ్వరి, జె సతీష్ బాబు, ఎన్ సాంబశివరావు, ఎం రవీంద్రారెడ్డి పాల్గొని పత్తి పొలాలను పరిశీలించి రైతులకు సాగు నిర్వహణపై పలు సూచనలు చేశారు. శాస్త్రవేత్తలు మాట్లాడుతూ ప్రస్తుతం నెలకొన్న వర్షాభావం, ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ఇప్పటికే పత్తి సాగు చేసిన రైతులు పంటను బెట్ట పరిస్థితుల నుంచి రక్షి ంచేందుకు ప్రతి 10 రోజులకు



ఒకసారి పొటాషియం నైట్రేట్ ద్రావణాన్ని పిచికారీ చేయాలని సూచించారు. అలాగే ఆగస్టు 15 తర్వాత పత్తి సాగుకు దూరంగా ఉండాలని, ఆలస్యంగా సాగు చేస్తే గులాబీ రంగు పురుగు (పింక్ బోల్‌వార్మ్) ఉధృతి పెరిగే అవకాశం ఉందన్నారు. ఇంకా పత్తి విత్తని రైతులు కంది సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని, విత్తే ముందు విఏఎం పొడిని పశువుల ఎరువుతో కలిపి సాళ్లలో వేయడం వల్ల పంటకు ఎండను తట్టుకునే శక్తి పెరుగుతుందని వివరించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు కెవి శ్రీనివాసరావు మాట్లాడుతూ పీఎంఎఫ్‌బీవై పంటల బీమా పథకం కింద కంది, మిరప, వరి పంటల బీమా నమోదు గడువు ఆగస్టు 15తో ముగుస్తుందని, రైతులందరూ గడువులోగా ప్రీమియం చెల్లించి నమోదు చేసుకోవాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి ఏ హరి ప్రసాద్ మాట్లాడుతూ శాస్త్రవేత్తల సూచనలను పాటించి పంటలను రక్షి ంచుకోవాలని, సాగు చేసిన ప్రతి పంటను తప్పనిసరిగా ఈక్రాప్‌లో నమోదు చేయించుకోవాలని తెలిపారు. కౌలు రైతులు రెవెన్యూ లేదా వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి కౌలు కార్డులు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్ద కుర్రా రత్తయ్య, ఏఈఓ జీవన్ నాయక్, ఆర్ఎస్‌కే సహాయకురాలు మానుకొండ సౌజన్య, మద్రిపాలెం సొసైటీ సీఈఓ గల్లా గోపి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## పారిశుధ్యపనుల్లో నాణ్యత పాటించండి: మున్సిపల్ కమిషనర్.

తెనాలి మున్సిపాలిటీ ఆగస్ట్ 5(ప్రభాతవార్త): పారిశుధ్యపనుల్లో నాణ్యత పాటించాలని,మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు పారిశుధ్య సిబ్బందికి సూచించారు. బుధవారం పట్టణం లోని బీసీ కాలనీ లో జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ పనులను ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మొవ్వ ఏసుబాబు గారితో కలిసి పరిశీలించారు. పొక్లెయిన్, జెసిబి లతో కాలువలు శుభ్రం చేయిస్తున్న పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించే విధంగా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం 29వ వార్డులో గల మార్కెట్ యార్డును అసిస్టెంట్




కమిషనర్ జాస్తి రామారావు తో కలిసి పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్థానికులు తెలియజేసిన సమస్యలను సత్వరం పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు మాట్లాడుతూ, పారిశుధ్య నిర్వహణలో ప్రజలు పురపాలక సంఘానికి సహకరించాలని చెత్తను తడి చెత్త పొడి చెత్తగా వేరుచేసి పురపాలక సంఘ వాహనాలకు అందజేయాలని ప్రజలను కోరారు. చెత్త ఇతర వ్యర్థాలు కాలువలలో, వేయవద్దని, చెత్తను కాలువలో వేయడం వల్ల నీటిపారుదలకు ఆటంకం ఏర్పడి దోమలు పెరిగే అవకాశం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ లు,శానిటరీ సెక్రటరీలు,సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిద్దాం: వీఆర్‌ఏ జేఏసీ పిలుపు

తెనాలి ఆగస్ట్ 5(ప్రభాతవార్త): తెనాలి ఏపీఎన్జీవో కళ్యాణ మండపంలో జరిగిన వీఆర్‌ఏ జేఏసీ సమావేశంలో మాట్లాడుతున్న జేఏసీ రాష్ట్ర ఛైర్మెన్ పెద్దన్న పిలుపునిచ్చారు. వీఆర్‌ఏల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా ఐక్య ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని ఏపీ వీఆర్‌ఏ జేఏసీ రాష్ట్ర ఛైర్మెన్ పెద్దన్న పిలుపునిచ్చారు. గుంటూరు జిల్లా తెనాలి డివిజన్ వీఆర్‌ఏల జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం బుధవారం ఏపీఎన్జీవో కళ్యాణ మండపంలో తెనాలి డివిజన్ అధ్యక్షుడు జె. రాజేష్



అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా పెద్దన్న మాట్లాడుతూ గ్రామ పాలనలో వీఆర్‌ఏలు కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ ప్రభుత్వం వారి సేవలకు తగిన గుర్తింపు ఇవ్వడం లేదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేసి వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత, పదోన్నతి అవకాశాలు, పదవీ విరమణ ప్రయోజనాలు, ఇతర న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం ఆలస్యం చేస్తే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేయనున్నట్లు హెచ్చరించారు.సమావేశంలో తెనాలి డివిజన్ అధ్యక్షుడు జె. రాజేష్ మాట్లాడుతూ వీఆర్‌ఏలంతా సంఘటితంగా ఉంటేనే హక్కుల సాధన సాధ్యమవుతుందని అన్నారు.గ్రామస్థాయిలో ప్రభుత్వ కార్యక్రమాల అమలులో కీలకంగా పనిచేస్తున్న వీఆర్‌ఏల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. రానున్న కార్యాచరణపై సమావేశంలో విస్తృతంగా చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు.ఈ సమావేశంలో సీహెచ్. ముత్తయ్య, వెంకటేశ్వరరావు, కే. సంగయ్య, వివేక్, వెంకటరత్నం, సురేష్, ప్రభాకర్, రోశయ్య, నాగేశ్వరరావు తదితర నాయకులు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

## జీర్ణాశయ వ్యాధులపై అప్రమత్తత అవసరం:యశోదా హాస్పిటల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డా.అనిల్ కుమార్.

తెనాలి, ఆగస్ట్5(ప్రభాతవార్త): చిన్న సమస్యలే తీవ్ర రూపం దాల్చే ప్రమాదం ముందని, ముందస్తుగా గుర్తిస్తే ఎన్నో అనర్థాలకు చెక్ పెట్టవచ్చని, పెనుభూతంగా మారుతున్న ఫ్యాటీ లివర్ సమస్యను అదుపులో ఉంచుకోవాలని, యశోద ఆసుపత్రిలో అత్యాధునిక వైద్య సేవలు,అందుబాటులో



ఉన్నాయని,మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ అనిల్ కుమార్ మన్నవ వెల్లడించారు. మారుతున్న ఆధునిక జీవనశైలి, అస్తవ్యస్తమైన ఆహారపు అలవాట్లు, మానసిక ఒత్తిళ్లు మానవ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతు న్నాయి. ముఖ్యంగా జీర్ణకోశ సంబంధిత వ్యాధులు చాపకింద నీరులా విస్తరిస్తున్నాయి. కడుపులో మంట, గ్యాస్, అజీర్తి, మలబద్ధకం, కడుపు ఉబ్బరం వంటి సాధారణ ఇబ్బందులను తేలికగా తీసుకుంటే భవిష్యత్తులో అవి ప్రాణాంతక వ్యాధులుగా మారే ప్రమాదం ఉందని సికింద్రాబాద్ యశోద హాస్పిటల్స్ మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ అనిల్ కుమార్ మన్నవ హెచ్చరించారు. సోమవారం తెనాలిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత రోజుల్లో కాలేయంలో కొవ్వు చేరే ఫ్యాటీ లివర్ బారిన పడుతున్న వారి సంఖ్య విపరీతంగా పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిని ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా కాలేయం గట్టిపడటం, లివర్ ఫెయిల్యూర్ వంటి దుష్పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు. అలాగే హెపటైటిస్ బీ, సీ లాంటి వైరల్ ఇన్ఫెక్షన్లు కూడా కాలేయాన్ని కోలుకోలేని విధంగా దెబ్బతీస్తాయని పేర్కొన్నారు.క్లోమగ్రంధి, పిత్తాశయ సమస్యలు, జీర్ణాశయ పుండ్లు, పెద్దపేగు వ్యాధులు, మలంలో రక్తం పడటం, అకారణంగా బరువు తగ్గడం లాంటి లక్షణాలు కనిపిస్తే తక్షణమే అప్రమత్తం కావాలని సూచించారు. ముందస్తుగా వ్యాధిని నిర్ధారిస్తే అత్యాధునిక ఎండోస్కోపిక్ విధానాల ద్వారా సులభంగానే మెరుగైన చికిత్స అందించవచ్చని తెలిపారు. సికింద్రాబాద్ యశోద హాస్పిటల్స్‌లో ఎండోస్కోపీ, కొలనోస్కోపీ, ఈయూఎస్, ఈఆర్‌సీపీ లాంటి సరికొత్త సాంకేతిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని, క్యాన్సర్లను సైతం ప్రాథమిక దశలోనే గుర్తించే అత్యాధునిక వ్యవస్థ తమ వద్ద ఉందని వివరించారు. నలభై ఏళ్లు దాటిన వారు, క్యాన్సర్ కుటుంబ నేపథ్యం ఉన్నవారు విధిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని స్పష్టం చేశారు. వేళకు భోజనం చేయడం, నూనె పదార్థాలు తగ్గించి పీచు పదార్థాలు ఎక్కువగా తీసుకోవడం, తగినంత నీరు తాగడంతో పాటు ప్రతిరోజూ వ్యాయామం అలవర్చుకుంటే ఉదర సంబంధిత రుగ్మతలకు దూరంగా ఉండవచ్చని సలహా ఇచ్చారు. మద్యపానం, పొగాకు ఉత్పత్తులను పూర్తిగా విడనాడాలని కోరారు. సమావేశంలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఆర్ విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## డెల్టా సాగుకే పులిచింతల నిర్మాణం:డా.చందు సాంబశివుడు

తెనాలి ఆగస్ట్5(ప్రభాతవార్త): డెల్టా ప్రాంత సాగు అవసరాల కోసం పులిచింతల ప్రాజెక్టు నిర్మించటం జరిగిందని, ఆ మేరకు సాగునీటిని విడుదల చేసి,డెల్టా ప్రాంత రైతులకు తగు ప్రాధాన్యం ఇవ్వాలని తెనాలి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి డాక్టర్ చందు సాంబశివుడు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఖరీఫ్ సీజన్లో పశ్చిమ డెల్టా రైతాంగానికి సాగునీటి విడుదలలో జాప్యం లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని, తూర్పు పశ్చిమ డెల్టా ప్రాంతంలో రైతులు సుమారు 13 లక్షల ఎకరాలు సాగు చేస్తున్నారని ఆ మేరకు తగిలి నీటి కేటాయింపులు లేవని డాక్టర్ సాంబశివుడు పేర్కొన్నారు.పులిచింతల ప్రాజెక్టు నిర్మాణం సాగునీటిని స్థిరీకరించటం కోసమేనని అందులో ఎప్పుడు 30 టీఎంసీల నీరు నిలువ ఉంటుందని సకాలంలో ఆ నీటిని విడుదల చేయాలన్నారు. రైతులందరూ ఖరీఫ్ సాగుకు సమాయత్తమై దాదాపు వరి నాట్లు పూర్తి కావచ్చినప్పటికీ,ఇలాంటి సమయంలో వరి పంట వేయొద్దు వేరే ఇతర పంటలను వేసుకోండని అధికారులు,ప్రభుత్వం సూచించటం వారి



బాధ్యత రాహిత్యాన్ని సూచిస్తుందన్నారు. కావున తక్షణమే డెల్టా ప్రాంత రైతాంగానికి కావలసినంత సాగునీటిని విడుదల చేసి రైతులను అలాగే వ్యవసాయంపై ఆధారపడి కవులు రైతులు వ్యవసాయ కూలీలను దృష్టిలో ఉంచుకోవాలని డాక్టర్ సాంబశివుడు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తెనాలి టౌన్ ప్రెసిడెంట్ పొన్నూరు నాగ సూర్య శేషి ధర్,గుంటూరు జిల్లా జనరల్ సెక్రెటరీ శివరామకృష్ణ ప్రసాద్, తెనాలి మండల ప్రెసిడెంట్ పినపాటి స్టీవెన్ బాబు, బీసీ సెల్ అధ్యక్షుడు డోగిపర్తి శ్రీనివాసరావు,భీమా రమేష్, కడదం కోటేశ్వరావు, శిలం సుబ్బారావు,అల్ల కృష్ణ,కట్టా వీరస్వామి,బడుగు శ్రీను, కార్తీక్,ఎన్.మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

6-8Pg5_6-8Pg5.qxd 05/Aug/26 10:58 PM Page 1



# పార్లమెంటుకు గైర్హాజరు కావొద్దు

## • సమావేశాలు సజావుగా సాగేందుకు కృషి చేయండి.. • నిర్మాణాత్మక చర్చల్లో పాల్గొనండి..
## సభా సమయం వృధా చేయొద్దు • కొత్త ఎంపీలకు ప్రధాని మోడీ దిశానిర్దేశం



**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** వర్షాకాల సమావేశాల సందర్భంగా పార్లమెంటు సభ్యులతో తాను కొనసాగిస్తున్న సంప్రదింపులలో భాగంగా, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ బుధవారం తన అధికారిక నివాసంలో 37 మంది బిజెపి పార్లమెంటు సభ్యులతో అల్పాహార సమావేశం నిర్వహించారు. పార్లమెంట్ సమావేశాల సమయంలో వివిధ బిజెపి ఎంపిల బృందాలతో సమావేశమై అభిప్రాయాలను పంచుకోవడం, పరిపాలన, పార్లమెంటరీ వ్యవహారాలపై చర్చించడం, పార్టీలో సమన్వయాన్ని బలోపేతం చేయడం వంటి ప్రధాని ఆచరణలో భాగంగా ఈ అనధికారిక సమావేశం జరిగింది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, ఈ అల్పాహార సమావేశంలో ప్రధాన మంత్రి మోడీ ఎంపిలతో తన వ్యక్తిగత అనుభవాలను పంచుకున్నారు. పలు అంశాలపై అనధికారిక చర్చలు జరిపారు. పార్లమెంట్ ఎటు వంటి ఆటంకాలు లేకుండా సజావుగా పనిచేయాలని ప్రధాని మోడీ ఎంపిలకు హితబోధ చేశారు. ప్రజా జీవితంలో తన అనుభవాన్ని పంచుకున్న మోడీ, ఎంపీలు పార్లమెంట్‌ను ఎంత తీవ్రంగా పరిగణించాలనే దానిపై మార్గదర్శనం చేశారని ఈ సమావేశం గురించి తెలిసిన వర్గాలు తెలిపాయి. ప్రతిరోజూ పార్లమెంట్ లైబ్రరీలో కనీసం ఒకటి లేదా రెండు గంటల సమయం గడపాలని ప్రధానమంత్రి ఎంపిలను ప్రోత్సహించారు. అంతేకాకుండా, యువతతో మమేకమవ్వాలని, తమ నియోజకవర్గాల్లో యువత, క్రీడా కార్యకలాపాలపై దృష్టి సారించి ఎంపి స్థానిక ప్రాంత అభివృద్ధి పథకాన్ని (ఎంపీల్యాడ్స్) చురుకుగా అమలు చేయాలని ఆయన వారిని ప్రోత్సహించినట్లు ఆ వర్గాలు తెలిపాయి. పార్లమెంట్ సమావేశాలకు నిత్యం హాజరుకావాలని, ఎలాంటి పరిస్థితుల్లోనూ గైర్హాజరు కాకూడదని హితబోధ చేశారు. అలాగే నిర్మాణాత్మక చర్చల్లో పాల్గొనాలని, పార్లమెంట్ సజావుగా పనిచేయడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేశ అభివృద్ధి అజెండాను ముందుకు తీసుకెళ్లడానికి అర్థవంతమైన చర్చలు, సామూహిక ప్రయత్నాలు అవసరమని ఆయన నొక్కి చెప్పారు. హాజరైన వారిలో ఎన్‌సిపిఐ కూటమికి చెందిన బిజెపి ఎంపిలు, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నుండి బిజెపిలో చేరిన మాజీ నాయకులు, అలాగే పార్టీ సీనియర్ నాయకులు తరుణ్ చుగ్, వినోద్ తావ్డే, బిజెపి అధ్యక్షుడు నితిన్ నబిన్ ఉన్నారు.

ఈ సమావేశానికి కొత్తగా ఎన్నికైన పార్టీ నాయకులు తరుణ్ చుగ్, వినోద్ తావ్డే, మాజీ ఆప్ నాయకులు స్వాతి మాలివాల్, రాఘవ్ చద్దా, అశోక్ మిట్టల్, సందీప్ పాఠక్, విక్రమ్‌జీత్ సింగ్ సహానీ హాజరయ్యారు. పార్లమెంట్ సమావేశాల సమయంలో అల్పాహార సమావేశం నిర్వహించడం గత కొన్నేళ్లుగా ప్రధానమంత్రి ఆచరిస్తున్న పద్ధతిలో భాగం. ఇది ఎంపిలకు ఆయనతో నేరుగా సంభాషించే అవకాశాన్ని కల్పిస్తుంది. ప్రస్తుతం కొనసాగుతున్న వర్షాకాల సమావేశాల నేపథ్యంలో ఈ సమావేశం జరిగింది. దీనివల్ల ప్రధానమంత్రి ఎంపిలతో చిన్న బృందాలుగా సమావేశమై, పాలన, నియోజకవర్గ స్థాయి సమస్యలు, ప్రజలకు చేరువయ్యేందుకు పార్టీ చేపట్టిన కార్యక్రమాలపై వారి నుంచి అభిప్రాయాలను తెలుసుకునే అవకాశం కలుగుతుంది.

## 17నుంచి 3 రోజులు ప్రత్యేక సమావేశాలు!
### డీలిమిటేషన్, మహిళా బిల్లుల కోసం..

**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో పలు అంతరాయాలు ఏర్పడి చాలా భాగం రద్దయినప్పటికీ, నరేంద్ర మోడీ ప్రభుత్వం తన అత్యంత ప్రతిష్టాత్మకమైన రెండు శాసన ప్రతిపాదనలను ఒకే ప్యాకేజీలో ముందుకు తీసుకెళ్లడానికి సిద్ధమవుతోంది. నియోజకవర్గాల పునర్విభజన బిల్లు, మహిళా రిజర్వేషన్ల సవరణ బిల్లులను చేపట్టేందుకు, ఆగస్టు 13న వర్షాకాల సమావేశాలు ముగిసిన వెంటనే పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉందని ప్రభుత్వవర్గాలు తెలిపాయి. అయితే, సమావేశాలు ముగిసిన తర్వాత పార్లమెంటును వాయిదా వేయకపోవచ్చు, తద్వారా ప్రభుత్వం స్వల్ప నోటీసుతో దానిని తిరిగి సమావేశపరచడానికి వీలు కలుగుతుంది. రాజ్యాంగ సవరణ బిల్లును ఆమోదించడానికి అవసరమైన మూడింట రెండువంతుల మెజారిటీని సాధించేందుకు కేంద్రం కృషిచేస్తోందని సంబంధిత వర్గాలుతెలిపాయి.

131వ రాజ్యాంగ సవరణ బిల్లులో భాగంగా మహిళా రిజర్వేషన్ బిల్లుతో పాటు ప్రవేశపెట్టిన డీలిమిటేషన్ బిల్లు, ఏప్రిల్‌లో నిర్వ హించినన మూడు రోజుల ప్రత్యేక సమావేశంలో లోక్‌సభలో అవసరమైన మూడింట రెండు వంతుల ప్రత్యేక మెజారిటీని సాధించడంలో విఫలమైంది. మే నెలలో జరిగిన పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నిక లలో టిఎంసి ఘోర పరాజయం తర్వాత ఉభయ సభలలోనూ బిజెపి స్థానం బలపడింది. ప్రత్యేక మెజారిటీకి లోక్‌సభలో 360మంది ఎంపిలు, రాజ్యసభలో 164మంది ఎంపిలు అవసరంకాగా, ఆ సంఖ్యలకు దూరంతగ్గింది. అదే అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు, తన ఇండియా కూటమి మిత్రపక్షమైన కాంగ్రెస్‌తో ఎంకె స్టాలిన్‌కు ఏర్పడిన విభేదాలనేపథ్యంలో, పార్లమెంటు ఉభయ సభలలో మూడింట రెండు వంతుల ప్రత్యేక మెజారిటీ అవసరమయ్యే రాజ్యాంగ సవరణ బిల్లులను ఆమోదింపజేసుకునే అవకాశాలను మెరుగుపరుచుకోవడానికి బిజెపి కూడా డిఎంకెకు చెందిన 22 మంది లోక్‌సభ ఎంపిల మద్దతుపై దృష్టి సారించింది.




# స్వతంత్ర దేశంగా ప్రకటించిన బలూచిస్థాన్

## 11న స్వాతంత్ర్య దినోత్సవం

**క్వెట్టా, ఆగస్టు 5:** పాకిస్థాన్ నుంచి విడిపోయామని తనకు తాను ప్రకటించుకున్న బలూచిస్తాన్ ఈనెల 11వ తేదీని బలూచిస్తాన్ స్వాతంత్ర్య దినోత్సవంగా అధికారికంగా ప్రకటిస్తున్నట్లు తెలిపింది. ఇక నుంచి తమది స్వతంత్ర దేశమని దాని పేరు రిపబ్లిక్ ఆఫ్ బలూచిస్తాన్ అని పేర్కొంది. ఈ క్రమంలోనే ప్రపంచం లోని అన్ని దేశాల్లోఉన్న బలూచ్ ప్రజలు ఆగస్ట్ 11వ తేదీని ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవంగా నిర్వహించు కోవాలని పిలుపునిచ్చింది. అలాగే అంతర్జాతీయ సమాజం తమను స్వతంత్ర, సార్వభౌమ దేశంగా గుర్తించాలని కోరింది. ఈ క్రమంలోనే సోమవారం విడుదలచేసిన ఈ ప్రకటనలో బలూచ్ విముక్తి ఉద్యమ నేత మీర్ యార్ బలూచ్ కీలకవ్యాఖ్యలు చేశారు. ప్రతి బలూచ్ కుటుంబం తమ ఇళ్లు, వ్యాపార సంస్థలు, విద్యా సంస్థలు, ప్రజా ప్రదేశాల్లో స్వతంత్ర బలూచిస్తాన్ జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని కోరారు. ఈ చారిత్రక దినం ప్రాముఖ్యతను భావితరాలకు తెలియజేయడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని పేర్కొన్నారు. రిపబ్లిక్ ఆఫ్ బలూచిస్తాన్ ప్రకారం 1947 ఆగస్ట్ 11వ తేదీన బ్రిటిష్ పాలన ముగిసే సమయంలో బలూచిస్తాన్ స్వాతంత్ర్యాన్ని ప్రకటించిందని పేర్కొంది. ఆ ప్రకటనను అప్పటి అంతర్జాతీయ మీడియా, ఆల్ ఇండియా రేడియో కూడా ప్రచురించాయని తమ వాదనలో తెలిపింది. అందుకే ప్రతీ యేడాది ఆగస్ట్ 11వ తేదీనే తమ స్వాతంత్ర్య దినోత్సవంగా నిర్వహిస్తామని స్పష్టం చేసింది. 1948లో బలూచిస్థాన్‌ను పాకిస్థాన్ బలవంతంగా విలీనం చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ ప్రకటనలో పాకిస్థాన్ విధానాలపై మీర్ యార్ బలూచ్ తీవ్ర విమర్శలు చేశారు. కాశ్మీర్ సమస్య, 1948లో బలూచిస్తాన్‌పై సైనిక చర్య, 1971లో తూర్పు పాకిస్థాన్ విభజన, సోవియట్ అఫ్గాన్ యుద్ధం, చగాయ్ అణు పరీక్షలు, సెప్టెంబర్ 11వ తేదీ తర్వాతి పరిణామాలు వంటి అనేక సంఘటనలకు పాకిస్థాన్ విధానాలే కారణమని ఆరోపించారు. ఈ పరిణామాలు దక్షిణాసియాతో పాటు ప్రపంచవ్యాప్తంగా అస్థిరతకు దారితీశాయని పేర్కొన్నారు. పాకిస్థాన్ ప్రస్తుతం ఉన్నట్లు కొనసాగినంత కాలం దక్షిణాసియాలో శాశ్వత శాంతి, అభివృద్ధి సాధ్యం కాదని రిపబ్లిక్ ఆఫ్ బలూచిస్తాన్ పేర్కొంది. అందువల్ల తమ స్వాతంత్ర్యాన్ని అంతర్జాతీయ సమాజం గుర్తించి మద్దతు ఇవ్వాలని కోరింది. తమతో 6 కోట్ల మంది బలూచ్ ప్రజలు ఉన్నారని తాము స్వతంత్ర దేశమని బలూచ్ జాతీయ వాద గ్రూపులు ప్రకటించాయి. అయితే ఈ ప్రకటనను ఇప్పటివరకు పాకిస్థాన్ ప్రభుత్వం అంగీకరించలేదు. ఐక్యరాజ్యసమితి, ప్రపంచంలోని ఏ దేశమూ బలూచిస్తాన్‌ను స్వతంత్ర దేశంగా అధికారికంగా గుర్తించలేదు. ప్రస్తుతం బలూచిస్తాన్ అంతర్జాతీయంగా పాకిస్థాన్‌లోని ఒక ప్రావిన్స్‌గా గుర్తింపు పొందింది.

## ప్రెషర్‌గ్రూప్‌గా మాత్రమే పనిచేస్తాం



### సిజెపి చీఫ్ అభిజిత్ దీప్కే

**ఛత్రపతి శంభాజీనగర్, ఆగస్టు 5:** కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తమ పార్టీ కేవలం ప్రెషర్ గ్రూప్‌గా మాత్రమే పనిచేస్తుందని స్పష్టంచేసారు. బుధవారం మీడియాతో మాట్లాడిన దీప్కే ప్రస్తుతానికి తమ పార్టీ ఓ ప్రెజర్ గ్రూపులా పనిచేస్తుందన్నారు. కేంద్రప్రభుత్వంపై వత్తిడి తీసుకు రావడమే తమ ముఖ్య ఉద్దేశం అన్నారు. ప్రస్తుత దశలో భారత్ ఇదే ఉద్యమాన్ని కోరుకుంటోందన్నారు. మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లో జరగనున్న సీజేపీ కోర్ కమిటీ సమావేశాల నేపథ్యంలో ఆయన రిపోర్టర్లతో మాట్లాడారు. మీడియా, న్యాయ వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం సన్నిగిల్లుతోందని, ఇలాంటి అంశాలపై తమ కోర్ కమిటీ మీటింగ్‌లో చర్చించనున్నట్లు చెప్పారు. ఇథనాల్ కలిసిన పెట్రోల్, నిరుద్యోగం లాంటి అంశాలపై కూడా చర్చించనున్నట్లు తెలిపారు. సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ మాకు మెంటర్‌గా పనిచేస్తారని సిజెపి ప్రతినిధి సౌరవ్ దాస్ అన్నారు. వారి నుంచి సలహాలు తీసుకోనున్నట్లు తెలిపారు. సిజెపి నిరసన వేళ విద్యార్థులపై నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్‌లను ఎత్తివేసేలా వత్తిడితెస్తామని దాస్ తెలిపారు. ఈ అంశంపై ప్రభుత్వ ప్రతినిధులతో చర్చిస్తున్నామన్నారు. సిజెపి రాజకీయాల్లోకి వస్తుందని జరుగుతున్న ప్రచారంపై అభిజీత్ దీప్కే స్పందించారు.



## ఐన్‌స్టీన్ బిలం సమీపంలో కూలిన స్పేస్‌ఎక్స్ రాకెట్

**న్యూయార్కు, ఆగస్టు 5:** అంతరిక్షంలో పెను ప్రమాదం చోటు చేసుకుంది. స్పేస్ ఎక్స్ సంస్థ పంపిన ఫాల్కన్9 రాకెట్‌కు చెందిన, విడిచిపెట్టిన పైభాగం భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 12.05 గంటల ప్రాంతంలో చంద్రునిపై ఉన్న ఐన్‌స్టీన్ బిలం సమీపంలో కూలిపోయినట్లు తెలుస్తోంది. అయితే ఈ ఘటనను శాస్త్రవేత్తలు ఇంకా పూర్తిగా నిర్ధారించాల్సి ఉంది. దాదాపు 4500 కిలోల బరువు ఉన్న ఈ రాకెట్ పైభాగం చంద్రునిపైకి బ్లూ ఘోస్ట్ మిషన్‌ను ప్రయోగించాక 19 నెలల పాటు అంతరిక్షంలో తేలుతూ ఉంది. ఇవాళ ఈ దుర్ఘటన చోటు చేసుకుందని సమాచారం. 2025 జనవరి 15న స్పేస్ ఎక్స్ ఫాల్కన్9 రాకెట్‌ను ప్రయోగించింది. ఇది దశలవారీగా విడిపోతూ చంద్రుడిపైకి రాకెట్ పైభాగం మాత్రమే వెళ్లింది. అక్కడ ఈ రాకెట్ పైభాగం మాత్రమే చంద్రుడిని ఢీకొట్టింది. అసలు రాకెట్ నుంచి విడిపోయిన తర్వాత ఇది మందుతూ చంద్రుడిపైకి వెళ్తుంది.

ఈ క్రమంలోనే ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ఈ రాకెట్ ఇంధనం అయిపోయిన తర్వాత, సౌర కార్యకలాపాలు, చంద్రుడి గురుత్వాకర్షణ శక్తి క్రమంగా రాకెట్ దశ గమనాన్ని మార్చేసినట్లు సమాచారం. భూమికి, చంద్రుడికి మధ్య ఒక విశాలమైన, అస్థిరమైన వలయంలో 19 నెలలుగా ఇది తిరుగుతూ ఉంది. నెలల తరబడి, భూమి, చంద్రుడు, సూర్యుని గురుత్వాకర్షణ వల్ల కలిగే రాపిడి, వాటితో పాటు సూర్యరశ్మి యొక్క ఒత్తిడి కలిసి దాని మార్గాన్ని క్రమంగా ముందుకు నెట్టాయని తెలుస్తోంది. చివరికి ఆ చిన్న చిన్న నెట్టడాలు అన్నీ కలిసి నేరుగా భూమిని ఢీకొట్టేలా చేశాయి. స్పేస్‌ఎక్స్‌లోని ఇంధనాన్ని పూర్తిగా తీసివేసి సురక్షితం చేశామని, కానీ అంతటి అధిక శక్తి మార్గాలలో ప్రయాణించే స్టేజ్‌లకు నియంత్రిత పద్ధతిలో ఇంధనాన్ని పారవేసే ప్రక్రియ సాధ్యం కాదని స్పేస్‌ఎక్స్ తెలిపింది. ఇది సుమారుగా గంటకు 8,700 కిలోమీటర్ల వేగంతో భూమిని ఢీకొట్టి ఉంటుంది. ఇది దాదాపు మూడు టన్నుల టీఎన్టీకి సమానమైన శక్తిని విడుదల చేస్తుంది. చంద్రునికి గాలి నిరోధం లేదా ఘర్షణను కలిగించే వాతావరణం లేనందున, రాకెట్ దాదాపు పూర్తి వేగంతో ఢీకొట్టినట్లు తెలుస్తోంది. చంద్రునిపై నుంచి ప్రయాణిస్తున్న మన చంద్రయాన్2 ఆర్బిటర్ ఈ ప్రమాద స్థలాన్ని గుర్తించగలుగుతుంది.

## ప్రతిపక్షాల నిరసనల మధ్య బ్యాంకర్స్ బుక్స్ ఎవిడెన్స్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** ప్రతిపక్ష సభ్యుల నిరసనలు కొనసాగుతున్నప్పటికీ, డిజిటల్, వర్చువల్ రికార్డులను కోర్టులలో సాక్ష్యంగా అనుమతించే బిల్లును లోక్‌సభ బుధవారం ఆమోదించింది. ఎలాంటి చర్చ లేకుండా మూజువాణి ఓటుతో ఈ చట్టం ఆమోదం పొందినఅనంతరం, సభను వాయిదా వేశారు. 'బ్యాంకర్స్ బుక్స్ ఎవిడెన్స్ యాక్ట్, 2026' 1891నాటి బ్యాంకర్స్ బుక్స్ ఎవిడెన్స్ యాక్ట్‌ను రద్దుచేస్తుంది లేదా దాని స్థానంలోకి వస్తుంది. అంతకు ముందు వాయిదాపడిన సభ మధ్యాహ్నం 2 గంటలకు తిరిగి సమావేశమైనప్పుడు ఈ బిల్లును పరిశీలనకు చేపట్టారు. కానీ ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేస్తూనే ఉన్నారు. దానిపై చర్చించాలన్న సభాపతి విజ్ఞప్తిని పట్టించుకోలేదు. అంతరాయాలు కొనసాగుతుండటంతో, బిల్లును ఓటింగ్‌కు పెట్టగా, అది మూజువాణి ఓటుతో ఆమోదం పొందింది. నినాదాలపై స్పందిస్తూ, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, కాంగ్రెస్ నాయకుడు కెసి వేణుగోపాల్ 'మంచి వ్యక్తి' అయినప్పటికీ, ఆయన తన పార్టీ ఎంపిలను నియంత్రించలేకపోయారని అన్నారు. కాంగ్రెస్, కమ్యూనిస్ట్ పార్టీ, సమాజ్‌వాదీ పార్టీలు శ్రీరాముడికి వ్యతిరేకంగా ఉన్నాయని రిజిజు ఆరోపించారు. వారు దేశానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీక్‌పై ఇక్కడ జంతర్ మంతర్ వద్ద, దేశంలోని ఇతర ప్రాంతాలలో నిరసన చేస్తున్న విద్యార్థులపై పోలీసుల చర్యపై ప్రతిపక్షం ప్రభుత్వం నుండి క్షమాపణలతో కూడిన వివరణ కోరుతోంది. అలాగే అయోధ్యలోని రామ మందిరంలో విరాళాల అపహరణ ఆరోపణలపై కూడా నిరసన తెలుపుతోంది.

## డ్రోన్ తయారీ కంపెనీ
# సిఇఒ లక్ష్యంగా పేలుడు




### డ్రైవర్ మృతి, సిఇఒకు తీవ్రగాయాలు
### ఉక్రెయిన్‌లోని కీలక ప్రాంతాలపై రష్యా డ్రోన్ల దాడులు
### 17 మంది మృతి, 45 మందికిపైగా గాయాలు

**మాస్కో, ఆగస్టు 5:** రష్యాక్రెయిన్ యుద్ధం వేళ రష్యా భూభాగంలో ఊహించని సంచలనం చోటుచేసుకుంది. రష్యన్ సైన్యానికి అత్యంత కీలకమైన డ్రోన్లను సరఫరాచేసే ఓ ప్రముఖ రక్షణ సంస్థ సిఇఒపై హత్యాయత్నం జరిగింది. రష్యా సైన్యం ఉపయోగిస్తున్న శక్తివంతమైన ఉపిర్ ఎఫ్‌పివి డ్రోన్లను తయారుచేసే ఉరల్‌డ్రోన్ జావోడ్ కంపెనీ సిఇఒ వ్లాదిమిర్ త్కాచుక్ లక్ష్యంగా భారీ పేలుడు సంభవించింది. యెకాటెరిన్‌బర్గ్ సమీపంలోని బోల్షోయే ఇస్తోక్ ప్రాంతంలో ఆయన ప్రయాణిస్తున్న మెర్సిడెస్ కారు వెళ్తుండగా ఈ విస్ఫోటనం జరిగింది. కారు కింద ముందే అమర్చిన పేలుడు పదార్థాలు పేలిపోవడంతో ఈ ప్రమాదంజరిగింది. ఈ శక్తివంతమైన పేలుడు ధాటికి మెర్సిడెస్ కారు పూర్తిగా ధ్వంసమైంది. ఈ ఘటనలో డ్రైవర్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా వ్లాదిమిర్ త్కాచుక్ తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం ఆయనను అత్యవసర చికిత్స నిమిత్తం సమీప ఆస్పత్రిలోని ఐసీయూలో చేర్చి వైద్యం అందిస్తున్నారు. ఈ దాడికి ఎవరు ఒడిగట్టారనే దానిపై రష్యన్ భద్రతా ఏజెన్సీలు దర్యాప్తు ప్రారంభించాయి. ప్రాథమిక సమాచారం ప్రకారం, కారు కింద పేలుడు పదార్థాలను అమర్చారని, మెర్సిడెస్ అతివేగంగా వెళ్తున్నప్పుడు ఈ పేలుడు సంభవించిందని తెలుస్తోంది. దాడి వెనుక ఉన్నవారి గుర్తింపు ఇంకా అధికారికంగా నిర్ధారించబడలేదు. రష్యా ఏజెన్సీలు దర్యాప్తును ప్రారంభించాయి. ఉక్రెయిన్ నుంచి తక్షణమే ఎలాంటి అధికారిక ప్రకటన రాకపోవడం గమనార్హం.

ఇదిలా ఉండగా బుధవారం తెల్లవారుజామున కీవ్, పరిసర ప్రాంతాలపై రష్యా జరిపిన క్షిపణి, డ్రోన్ దాడులలో 17 మంది మరణించగా 45మంది గాయపడ్డారు. పలు వ్యాపార సంస్థలు, ఓ రైల్వే స్టేషన్ తీవ్రంగా దెబ్బతిన్నాయి. రష్యా లక్ష్యాలలో యుద్ధంతో సంబంధం లేని ఒక బ్రూవరీ, నిర్మాణ సామగ్రి గిడ్డంగి, మెయిల్ సార్టింగ్ ఆఫీస్ ఉన్నాయని, ఈ ప్రదేశాలకు యుద్ధంతో ఎలాంటి సంబంధం లేదని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కి ఆరోపించారు. అయితే ఆ వ్యాపార సంస్థలకు సైనిక సంబంధాలు ఉన్నాయని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ చెబుతోంది. సుమారు రెండు గంటల పాటు జరిగిన ఈ దాడులు, దాదాపు ప్రతిరోజూ జరుగుతున్న రష్యా భారీ స్థాయి బాలిస్టిక్ క్షిపణి దాడుల పరంపరలో భాగం. అమెరికా పేట్రియాట్ వ్యవస్థకు చెందిన ఇంటర్‌సెప్టర్ క్షిపణుల తీవ్ర కొరతను అవకాశంగా తీసుకుని ఈవేగవంతమైన దాడులు జరుగుతున్నాయి. బాలిస్టిక్ క్షిపణులను కూల్చివేయగల సామర్థ్యం ఉన్న ఉక్రెయిన్ ఏకైక వాయు రక్షణ ఆయుధం పేట్రియాట్ వ్యవస్థ. ఇరాన్ యుద్ధం కారణంగా కొరత ఏర్పడటంతో, జెలెన్స్కి మరిన్ని మందుగుండు సామగ్రి కోసం ఇతర దేశాలకు విజ్ఞప్తి చేశారు.

# విజయ్ సర్కార్ తొలిబడ్జెట్


## ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ఆర్థిక సాయం పెంపు



**చెన్నై, ఆగస్టు 5:** తమిళనాడు ప్రభుత్వం బుధవారం అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టింది. విజయ్ టివికె ఆధ్వర్యంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్ ఇది. తమిళనాడు ఆర్థిక శాఖ మంత్రి ఎన్ మేరీ విల్సన్ 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. 2036లోపు తమిళనాడు ఆర్థిక వ్యవస్థను 1.5 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పిల్లలు పుడితే వారికి ఒక గ్రామ్ బంగారం అందించే పథకాన్ని కూడా ప్రభుత్వం అమలు చేయనుంది. తాయ్ మామన్ తంగా మోతిరం తిట్టం పథకం కింద ప్రభుత్వ ఆస్పత్రుల్లో జన్మించే ప్రతి బిడ్డకు 1 గ్రామ్ బంగారు ఉంగరాన్ని అందిస్తారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ఆర్థిక సాయాన్ని పెంచనున్నారు. దీనివల్ల 1.93 లక్షల కుటుంబాలకు ప్రతి ఏటా రూ.7,000 వరకు ఆర్థిక సాయం అందిస్తారు. ఇందుకోసం రూ.135 కోట్లు కేటాయించారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు అన్నన్ సీర్ తిట్టమ్ అనే పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. దీనికింద వధువుకు 8 గ్రాముల బంగారంతోపాటు ఒక పట్టుచీరను అందిస్తారు. వెట్రి ల్యాప్‌టాప్ స్కీమ్ కింద అర్హులైన పేద విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందజేస్తారు. రైతులకు విద్యుత్ సబ్సిడీ కింద రూ.7,432 కోట్లు కేటాయించింది. రైతులు, వ్యవసాయ రంగం సంక్షేమానికి రూ.14,984 కోట్లు కేటాయించింది. అరివగం పేరుతో దేశంలోనే మొదటి ఎఐ అండ్ ఇన్నోవేషన్ సిటీని ఏర్పాటు చేస్తారు. అలాగే, తూతుకుడి, తిరునెల్వేలి ప్రాంతాల్ని స్పేస్ ఇండస్ట్రియల్ ఇన్వెస్ట్‌మెంట్ జోన్‌గాప్రకటించారు. మహిళా సాధికారతలో భాగంగా స్వయం సహాయక గ్రూపులకు రూ.38వేల కోట్లు కేటాయించారు. ప్రభుత్వ ఉద్యోగులకు అందించే హెల్త్ ఇన్సూరెన్స్ స్కీంను రూ.5 లక్షల నుంచి రూ.7.5 లక్షలకు పెంచబోతున్నారు. గరిష్టంగా రూ.12 లక్షలతో మరో హెల్త్ ఇన్సూరెన్స్ స్కీం కూడా ఉంది. 12 జిల్లాల్లో 12 వృద్ధాశ్రమాలు ఏర్పాటు చేస్తారు. మధురైలో ప్రత్యేక లా కాలేజీని ఏర్పాటు చేస్తారు. 2027-28 విద్యాసంవత్సరం నుంచి ఇది ప్రారంభమవుతుంది. రాష్ట్రంలో ఉన్నత విద్య కోసం రూ.8,393 కోట్లు కేటాయించారు. అలాగే, కొత్తగా ఐదు ఐటీఐలను ఏర్పాటు చేస్తారు. ప్రభుత్వ స్కూళ్లలో 11వ తరగతి చదివే విద్యార్థులకు హెల్మెట్, లైట్స్, వాటర్ బాటిల్స్‌తో కూడిన సైకిళ్లు అందజేస్తారు.

# సంక్షిప్త వార్తలు

## దుబాయ్‌లో 20 నిమిషాల్లోనే ఏడు పేలుళ్లు



**దుబాయి, ఆగస్టు 5:** యుఎఇలోని దుబాయ్ జెబెల్ అలీ పారిశ్రామిక ప్రాంతంలో బుధవారం తెల్లవారుజామున వరుస పేలుళ్లు సంభవించాయి. కేవలం 20 నిమిషాల వ్యవధిలో ఏడు పేలుళ్లు చోటుచేసుకున్నట్టు ఇరాన్‌కు చెందిన వార్తా సంస్థ పేర్కొంది. ఈ ఘటనతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగలు అలముకున్నాయి. ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అవుతున్నాయి. జెబెల్ అలీ నౌకాశ్రయం సమీపంలోని పారిశ్రామిక ప్రాంతంలో ఈ పేలుళ్లు జరిగినట్టు సమాచారం.

## పంజాబ్‌లో ఉగ్రవాద కుట్రభగ్నం

**అమృత్‌సర్, ఆగస్టు 5:** పంజాబ్ పోలీసులు మరో ఉగ్రకుట్రను భగ్నం చేశారు. ఇటీవలి జంతర్‌మంతర్ నిరసనలను కూడా నిందితులు టార్గెట్ చేసినట్టు గుర్తించారు. మొత్తం తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. పాక్ నిఘా సంస్థ ఐఎస్‌ఐ హ్యాండ్లర్ల సూచనల మేరకు నిందితులు కుట్రపన్నినట్టు పోలీసులు గుర్తించారు. జాతీయ మీడియా కథనాల ప్రకారం, విద్యార్థుల నిరసనల సందర్భంగా నిందితులు జంతర్‌మంతర్‌కు వెళ్లినట్టు అధికారులు గుర్తించారు. పోలీసులను, ఇతర భద్రతా సిబ్బందిని టార్గెట్ చేసేలా వారికి పాక్ హ్యాండ్లర్లు శిక్షణ ఇచ్చినట్టు కూడా దర్యాప్తులో వెలుగులోకి వచ్చింది.

## జార్ఖండ్ నిరసనలకు వాంగ్‌చుక్ సంఘీభావం

**రాంచి, ఆగస్టు 5:** జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (జెపిఎస్సి), జార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (జెఎస్‌ఎస్‌సి), ఇతర పోటీ పరీక్షల్లో అవకతవకలు, అక్రమాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జార్ఖండ్ విద్యార్థి నాయకుడు దేవేంద్ర నాథ్ మహతో, మరో ఐదుగురు విద్యార్థులు గతనెల నుంచి చేస్తున్న నిరవధిక నిరాహార దీక్షకు సిక్కిం నేత వాంగ్‌చుక్ మద్దతు ప్రకటించారు. సిక్కిం సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్, జార్ఖండ్ విద్యార్థుల నిరసనకు సంఘీభావం ప్రకటించారు. స్టూడెంట్ లీడర్ దేవేంద్రతో బుధవారం వీడియో కాల్‌లో మాట్లాడారు. ఆయన ఆరోగ్యం క్షీణించడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు.

## ఆగస్టు 15ను ఇండియాడేగా ప్రకటించిన మసాచుసెట్స్



**బోస్టన్, ఆగస్టు 5:** అమెరికాలో నివసిస్తున్న ప్రవాస భారతీయులకు అరుదైన గౌరవం దక్కింది. మసాచుసెట్స్ రాష్ట్రంలో ప్రతి ఏటా ఆగస్టు 15వ తేదీని ఇండియా డేగా అధికారికంగా జరపాలని ఆ రాష్ట్ర గవర్నర్ మోరా హీలీ ప్రకటించారు. రాష్ట్ర ఆర్థిక, సాంస్కృతిక ప్రగతిలో భారతీయ సమాజం పోషిస్తున్న కీలక పాత్రకు గుర్తింపుగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆమె తెలిపారు. ఈ మేరకు ఒక అధికారిక ప్రకటన జారీ చేశారు. 1947లో బ్రిటిష్ పాలన నుంచి స్వాతంత్రం పొంది, ప్రపంచం లోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారత్ ఆవిర్భవించిందని గవర్నర్ తన ప్రకటనలో కొనియాడారు.

## రోడ్డు ప్రమాదాల్లో 1.80 లక్షల మంది మృతి



**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** భారత్‌లో ప్రతి యేడాది సగటును సుమారు 1.80 లక్షల మంది రోడ్డు ప్రమాదాలకు లోనవుతున్నట్లు కేంద్ర రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. బుధవారం ఆయన రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సమయంలో మాట్లాడారు. చాలా బాధాకరమైన విషయమని, రోడ్డు ప్రమాదాల వల్ల ప్రతి యేడాది ఇండియాలో 1.80 లక్షల మంది మరణిస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. ప్రమాదాలను తగ్గించే అంశంపై చర్యలు తీసుకోవాలని ఎంపీ సుధానమూర్తి ప్రశ్న వేశారు. అందమైన రోడ్లు ఉన్నాయని, కానీ ప్రమాదాల సంఖ్య పెరుగుతోందని, ఇది రోడ్ల వల్ల కాదు అని, డ్రైవర్లు సరిగా నడపలేకపోవడం వల్లే అని సుధామూర్తి అన్నారు జాతీయ రహదారులపై ప్రమాదాలను తగ్గించేందుకు ఆమె ఓ సూచన చేశారు. డ్రైవింగ్ లైసెన్సు ఇచ్చే ప్రక్రియ మరింత పటిష్టం చేయాలని సుధామూర్తి పేర్కొన్నారు.

6-8Pg6exHMNWJQE_6-8Pg6exHMNWJQE.qxd 05/Aug/26 11:01 PM Page 1



# మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలు చేయాలి

- కూటమి పాలనలో దిగజారిన పొగాకు రైతు స్థితి
- పొగాకు రైతులకు అండగా వుంటా: వైఎస్ జగన్

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 5 ప్రభాతవార్త:** మార్కెట్‌ను నియంత్రించి రైతులకు న్యాయమైన ధర అందించాల్సిన ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ పొగాకు రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా నేరుగా పొగాకు కొనుగోలు చేయాలని వైఎస్సార్‌సిపి అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. పొగాకు రైతుల సమస్యలను తెలుసుకుని వారికి భరోసా కల్పించేందుకు మాజీ ముఖ్యమంత్రి, వైఎస్‌ఆర్‌సిపి అధ్యక్షుడు జగన్ బుధవారం తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలంలో పర్యటించారు. దేవరపల్లి పొగాకు బోర్డు ప్రాంగణంలో నిర్వహించిన పొగాకు రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. దేవరపల్లి శివకళ్యాణ మండపం వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకున్న జగన్ అక్కడి నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులతో కలిసి భారీ ర్యాలీగా టొబాకో బోర్డు వరకు వెళ్లారు. అనంతరం పొగాకు వేలం కేంద్రాన్ని సందర్శించి రైతులను నేరుగా కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వేలం ప్రక్రియ, మార్కెట్ పరిస్థితులు, పొగాకు ధరలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో జగన్ మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. అక్రమాలను ప్రశ్నించే వారిపై



తప్పుడు కేసులు నమోదు చేసి కోర్టుల చుట్టూ తిప్పుతున్నారని విమర్శించారు. విద్య, వైద్యం, వ్యవసాయం, పారిశ్రామిక రంగాల్లో ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో ఉందని, ఏ పంటకూ గిట్టుబాటు ధర లభించడం లేదని ఆయన పేర్కొన్నారు. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. పొగాకు రైతులకు సాగు వ్యయం పెరుగుతుండగా ఆదాయం మాత్రం తగ్గిపోతోందన్నారు. గత వైఎస్‌ఆర్‌సిపి ప్రభుత్వ హయాంలో పొగాకు కిలోకు రూ.289 వరకు ధర లభించగా, ప్రస్తుతం కేవలం రూ.236 మాత్రమే వస్తోందని తెలిపారు. ఈ ఏడాది పండిన మొత్తం పొగాకులో ప్రభుత్వం సుమారు 12శాతం మాత్రమే కొనుగోలు చేసిందని ఆయన ఆరోపించారు. దాదాపు 83 మిలియన్ కిలోల ఉత్పత్తి నమోదైనా, కొనుగోలు మాత్రం సుమారు 10 మిలియన్ కిలోలకే పరిమితమైందని పేర్కొన్నారు. దీంతో రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారని అన్నారు. గిట్టుబాటు ధర లేక వెంకటేశ్వరరావు అనే రైతు ఆత్మహత్య చేసుకున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదని జగన్ విమర్శించారు. గతంలో వైఎస్‌ఆర్‌సిపి ప్రభుత్వం రైతుల ఇబ్బందులను గుర్తించి మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలు చేసి వారికి అండగా నిలిచిందని గుర్తు చేశారు. తిరిగి అవకాశం వస్తే రైతులకు గిట్టుబాటు ధర కల్పించి వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసే చర్యలు చేపడతామని జగన్ హామీ ఇచ్చారు.

# పొగాకు రైతుల సంక్షేమంపై జగన్‌కి బహిరంగ సవాల్

- వాస్తవాలు, గణాంకాలతో చర్చకు సిద్ధమా జగన్?
- రైతుల కోసం చేసింది ఎవరు? మాటలు చెప్పింది ఎవరు? ప్రజల ముందే తేల్చుకుందాం
- మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ ఆగస్టు 5 ప్రభాతవార్త ప్రతినిధి:** పొగాకు రైతుల సంక్షేమంపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవాలపై ఆధారపడినవని, రైతులపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే వాస్తవాలు, గణాంకాలతో బహిరంగ చర్చకు రావాలని జగన్ మోహన్‌రెడ్డికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు బహిరంగ సవాల్ విసిరారు. బుధవారం విజయవాడలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో మీడియాతో మాట్లాడుతూ "జగన్ మోహన్‌రెడ్డి గారూ... మీరు పొగాకు రైతుల కష్టాల గురించి మాట్లాడుతున్నారు, కానీ వాస్తవాలు, గణాంకాలతో బహిరంగ చర్చకు రావడం లేదు. రైతులపై నిజమైన చిత్తశుద్ధి ఉంటే ఈ సవాలును స్వీకరించండి. పొగాకు రైతులు సంక్షోభంలో ఉన్న ప్రతిసారీ వారిని ఆదుకున్నది టిడిపి నాయకత్వంలోని ప్రభుత్వమే. రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రతిసారీ అండగా నిలిచి నిర్ణయాలు తీసుకున్న చరిత్ర టిడిపి ప్రభుత్వానిదే. గత సంవత్సరం బర్లీ పొగాకు రైతుల నుంచి 25 మిలియన్ కిలోల పొగాకును కొనుగోలు చేసి, సుమారు రూ.280 కోట్లు వెచ్చించడం జరిగింది. 2014-15లో ఎఫ్‌సీవీ పొగాకు ధరలు పడిపోయినప్పుడు, వాణిజ్య పంట అయినప్పటికీ రైతులు నష్టపోకూడదనే ఉద్దేశంతో ప్రతి కిలోకు రూ.20 ఆర్థిక సహాయం అందించడం



జరిగింది. చరిత్రలోనే ఇది ఒక కీలక నిర్ణయం. అయితే, మీ ప్రభుత్వ హయాంలో 2019లో సుమారు 124 మిలియన్ కిలోల పొగాకు ఉత్పత్తి కాగా, ధర కిలోకు రూ.121-123కు పడిపోయింది. అయినప్పటికీ మీ ప్రభుత్వం కేవలం 11.8 మిలియన్ కిలోలను మాత్రమే కొనుగోలు చేసి, మిగిలిన రైతులను గాలికి వదిలేసింది. తదుపరి సంవత్సరం సుమారు 128 మిలియన్ కిలోల పొగాకు ఉత్పత్తి అయి, ధర కిలోకు రూ.123కు పడిపోయినప్పటికీ, మీ ప్రభుత్వం ఒక్క కిలో కూడా కొనుగోలు చేయలేదు. రైతులకు ఎలాంటి అదనపు ఆర్థిక సహాయమూ అందించలేదు. పొగాకు ధరల విషయంలో కూడా వాస్తవాలు ప్రజల ముందున్నాయి. 2019లో కేజీ రూ.142, 2020లో రూ.140, 2021లో రూ.161, 2022లో రూ.192, 2023లో రూ.248, 2024లో కూటమి ప్రభుత్వ హయాంలో రూ.326, 2025లో రూ.300 2026లో రూ.275గా ధర ఉందన్నారు ప్రస్తుత సంవత్సరం టొబాకో బోర్డు లక్ష్యం 131 మిలియన్ కిలోలు కాగా, రైతులు సుమారు 241 మిలియన్ కిలోలు ఉత్పత్తి చేశారు. అధిక ఉత్పత్తితో ఇబ్బందులు ఎదురైన రైతులను ఆదుకోవడానికి కూటమి ప్రభుత్వం వెంటనే ముందుకొచ్చింది. సుమారు 100 మిలియన్ కిలోల పొగాకుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి కిలోకు రూ.10 చొప్పున మొత్తం రూ.100 కోట్ల ఆర్థిక సహాయం అందించాలని నిర్ణయించింది. ఈ సహాయం పంపిణీని రేపటి నుంచే ప్రారంభిస్తున్నాం. అంతేకాదు... రాష్ట్ర ప్రభుత్వ సహాయంతోపాటు, కేంద్ర ప్రభుత్వం ప్రతి పొగాకు బ్యారన్‌కు రూ.50వేలు వడ్డీలేని రుణం అందిస్తోంది. ఈ వాస్తవాలన్నింటి తర్వాత కూడా పొగాకు రైతుల గురించి కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు జగన్‌కి లేదు. గత ప్రభుత్వ పనితీరు, కూటమి ప్రభుత్వ సహాయంపై గణాంకాలతో బహిరంగ చర్చకు రావాలని మరోసారి సవాలు చేస్తున్నాం. రైతులు గత ప్రభుత్వ పనితీరును, ప్రస్తుత కూటమి ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని పోల్చి చూడండి. ఎవరు రైతులను గాలికి వదిలేశారో, ఎవరు కష్టకాలంలో అండగా నిలిచారో ప్రజలే

# రేపటి నుండి తిరుపతిలో క్రెడాయి ఎక్స్‌పో

**తిరుపతి, ఆగస్టు 5 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశంలోనే వేగంగా విస్తరిస్తున్న ప్రముఖ ఆధ్యాత్మిక నగరం, యాత్రాస్థలం తిరుపతిలో ప్రజలకు సులభంగా క్లియర్ టైటిల్, తుడ అనుమతి పొందిన ఆస్తులను అందుబాటులోకి తెచ్చేందుకు క్రెడాయ్ ఆధ్వర్యంలో తరచూ ప్రాపర్టీ ఎక్స్‌పోలు నిర్వహిస్తున్నారు. ఈనెల 7నుండి 9వతేదీ వరకు మూడురోజులు పాటు తిరుపతిలోని డిబిఆర్ ఆస్పత్రి మార్గంలో శ్రీకన్వెన్షన్ సెంటర్‌లో క్రెడాయి ఎక్స్‌ఫో ఏర్పాటుచేస్తున్నట్లు తిరుపతి చాప్టర్ అధ్యక్షుడు ఎం. రామ్‌ప్రసాద్, ఛైర్మన్ గోపీనాథ్, ప్రధాన కార్యదర్శి ఎ.రాజేష్‌బాబు తెలిపారు. తిరుపతిలో మీడియాతో మాట్లాడుతూ, తిరుపతి నగరంలో అపార్ట్‌మెంట్లు, విల్లాలు, కమ్యూనిటీ ప్రాజెక్టులకు సంబంధించిన సమాచారాన్ని ఒకే వేదికపైకి తీసుకురావడంలో క్రెడాయ్ తిరుపతి చాప్టర్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. తిరుపతి నగరానికి చెందిన ప్రముఖ బిల్డర్లు, రియల్ ఎస్టేట్ డెవలపర్లు, ఆర్థిక సంస్థలు, జాతీయ బ్యాంకులు తమ స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నాయన్నారు. అన్ని రకాల ప్రాజెక్టులకు సంబంధించిన సమాచారాన్ని ఒకే వేదికపైకి తీసుకురావడంలో క్రెడాయ్ తిరుపతి చాప్టర్ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు.

# అసత్య ప్రచారాలతో నిరుద్యోగ యువతను మభ్యపెట్టలేరు

- జెన్ జెడ్ పేరుతో డిఎస్సీ-2025 నియామకాలపై తప్పుడు ప్రచారం
- ఆర్‌వైఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు

**విజయవాడ, ఆగస్టు 5 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో డిఎస్సీ నియామకాలపై కొందరు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా ఆధారరహితమైనవని, నిరుద్యోగ యువతలో గందరగోళం సృష్టించడమే వాటి లక్ష్యంగా కనిపిస్తోందని రైట్స్ ఫర్ యూత్ అండ్ స్టూడెంట్స్ ఫోరం(ఆర్‌వైఎస్‌ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు పేర్కొన్నారు. విద్యార్థి, యువజన సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో జెన్ జెడ్ పేరుతో సంవత్సరం క్రితం జరిగిన డిఎస్సీ నియామకాలలో అవకతవకలు జరిగినాయని అసత్య ఆరోపణలు చేస్తూ నిరుద్యోగ యువతను మభ్యపెట్టే ప్రయత్నం చేయడంతో పాటుగా రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగ యువతలో అలజడి సృష్టించి పబ్బం గడుపుకోవడానికి ప్రయత్నం చేస్తున్న కొంతమంది వ్యక్తులు నుండి నిరుద్యోగ యువత అప్రమత్తంగా ఉండాలని కోరారు. 2019 నుండి 24 వరకు నాడు అధికారంలో ఉన్న జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తాం, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తాం, డిఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామని చెప్పి తీరా 2024 ఎన్నికల సమయంలో హడావిడిగా నోటిఫికేషన్ ఇచ్చి డిఎస్సీ ప్రకటించామని గొప్పలు చెప్పుకోవడం సరికాదన్నారు. నాడు ఇవ్వగలమని పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే తొలి సంతకం చేసిన విధంగా 16300 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడానికి నోటిఫికేషన్ ఇచ్చి 148 రోజుల కాలవ్యవధిలో 243 పైచిలుకు కోర్టు కేసులను న్యాయపరమైన చిక్కులను ఛేదించి ఏకకాలంలో ఉద్యోగాల భర్తీ చేస్తే ఉద్యోగాలు భర్తీ చేశారని గుర్తుచేశారు. నియామకాలైన 14 నెలల తరువాత డిఎస్సీలో అవకతవకలు జరిగాయని రోజుకొక ఆరోపణ చేస్తూ క్రీడల పట్ల ఉద్యోగాల పట్ల ఉద్యోగాల నియామకాల పట్ల రోస్టర్ విధానాల పట్ల అవగాహన లేకుండా అసత్య



విద్యార్థి, యువజన సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌వైఎస్‌ఎఫ్ అధ్యక్షులు రాజేంద్రబాబు

ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. నేడు జెన్ జెడ్ పేరుతో ఆర్టిఫిషియల్ ఉద్యమాలకు తెరతీసిన నాయకులు రాష్ట్ర అధికారులు అన్ని వివరాలు తెలియజేసిన రాష్ట్ర స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్లో గ్రీవెన్స్ జరుగుతున్న ఫిర్యాదులు లేకుండా అభ్యర్థుల అనుమానాలను నివృత్తి చేయడానికి సిద్ధంగా ఉన్నా వారి పట్ల ఆలోచించకుండా కేవలం రాజకీయాల కోసం అమాయకమైన నిరుద్యోగులను బలిచేస్తున్నారని ఆరోపించారు. అధికారంలోకి వస్తే 16 వేల డిఎస్సీ పోస్టులు రద్దు చేస్తామని ప్రకటించడం సరికాదన్నారు. నిరుద్యోగ యువత భావోద్వేగాలతో రాజకీయాలు చేయడం అత్యంత బాధ్యతారాహిత్యమన్నారు. ఆధారాలు లేకుండా నియామక ప్రక్రియపై సందేహాలు వ్యక్తం చేయడం వల్ల ఉద్యోగాలు పొందిన అభ్యర్థుల భవిష్యత్తుపైనా అనవసరమైన ఆందోళన ఏర్పడుతుందన్నారు. ప్రభుత్వ నియామకాలపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే వాటిని చట్టబద్ధమైన ఆధారాలతో సంబంధిత అధికారుల ముందు ఉంచాలని, కానీ నిరాధార ప్రచారం చేసి నిరుద్యోగ యువతను తప్పుదోవ పట్టించడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. ఉద్యోగాల కల్పన, పారదర్శక నియామకాలు, ఉపాధి అవకాశాలపై రాజకీయ పార్టీలు నిర్మాణాత్మక చర్చ జరపాలని, యువత ఆకాంక్షలను రాజకీయ వివాదాలకు బలిచేయొద్దని, అసత్య ఆరోపణలను తిప్పి కొట్టాల్సినటువంటి బాధ్యత నేటి యువతపై ఉందని, జరుగుతున్న పరిణామాలపై నిరుద్యోగ యువతను చైతన్యం చేస్తామని పరుచూరి రాజేంద్ర బాబు తెలిపారు.

## తిరుమల సమాచారం



### ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్‌కు రూ.2 కోట్లు విరాళం

**తిరుమల, ఆగస్టు 5 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి నిర్వహిస్తున్న పథకాలు, ట్రస్ట్‌లకు దాతలు తమవంతుగా విరాళాలు అందిస్తున్నారు. బుధవారం హైదరాబాద్‌కు చెందిన ట్రినిటీ కంబైన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ టిటిడి వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు రూ.2 కోట్లు విరాళంగా అందించింది. ఆ సంస్థకు చెందిన దాతలు ఆర్.సీతారామ్ రెడ్డి, జి.కవిత, త్రినయ్ రెడ్డి, త్రిభువన్ రెడ్డి శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి విరాళం డిడిలను అందజేశారు.



### 21న వరలక్ష్మీ వ్రతం

- తిరుచానూరు ఆలయంలో విస్తృత ఏర్పాట్లు

**తిరుమల, ఆగస్టు 5 ప్రభాతవార్త ప్రతినిధి:** శ్రావణమాసంలో ఎంతో పవిత్రమైన వరలక్ష్మీవ్రతాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో వేడుకగా నిర్వహిస్తుంది. ఈ నెల 21న జరగనున్న వరలక్ష్మీ వ్రత మహోత్సవం సందర్భంగా పాల్గొనే వేలాది మంది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు విస్తృతంగా చేపట్టాలని టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు అధికారులను ఆదేశించారు. బుధవారం తిరుమలలో ఛైర్మన్ క్యాంపు కార్యాలయంలో పద్మావతి అమ్మవారి ఆలయ అధికారులు, అర్చకులు ఛైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వరలక్ష్మీ వ్రత మహోత్సవానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తాగునీరు, అన్నప్రసాదాల పంపిణీ, సక్రమమైన క్యూ లైన్లు, భద్రత, పారిశుద్ధ్యం, వైద్య సేవలు, ట్రాఫిక్ నియంత్రణ తదితర ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని సూచించారు. భక్తులు ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో వ్రతంలో పాల్గొనేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే పద్మావతి అమ్మవారి ఆలయం, వ్రతం నిర్వహించే ఆస్థాన మండపాన్ని సుందరమైన పుష్పాలంకరణలతో శోభాయమానంగా అలంకరించి, మహోత్సవానికి తగిన ఆధ్యాత్మిక వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ బిఆర్‌నాయుడు దంపతులకు పద్మావతి అమ్మవారి ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణలతో ఆశీర్వచనం అందజేశారు. ఆలయ డిప్యూటీ ఇఒ పి.హరీంద్రనాథ్ పట్టువస్త్రం సమర్పించి అమ్మవారి వరలక్ష్మీవ్రత ఆహ్వానపత్రికను అందజేశారు.

# టిటిడిలో ఊసేలేని అర్చక పోస్టుల భర్తీ

- ఏడుకొండలస్వామి సేవకు అరకొర సిబ్బంది
- నిత్యకైంకర్యాలకు డిప్యూటేషన్ భారం

**తిరుమల, ఆగస్టు 5 ప్రభాతవార్త ప్రతినిధి:** నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లు తున్న తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి ఆలయంలో నిర్వహించే నిత్య కైంకర్యాల సేవలకు అవసరమైన మేరకు అర్చకులు లేకపోతున్నారు. గత ఐదేళ్ళుగా అర్చకుల కొరత వెంటాడుతున్నా భర్తీ చేయడంపై గత టిటిడి బోర్డు పెద్దలుగానీ, ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలోని టిటిడి బోర్డు పెద్దలు కూడా దృష్టి పెట్టలేదని అర్చక వర్గాల్లో వాదన వినిపిస్తోంది. ఆపద మొక్కులవాడు.. అనాథ రక్షకుడు తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి కలియుగ ప్రత్యక్ష దైవంగా ఖ్యాతిచెందాడు. వైఖానస ఆగమోక్తంగా నిత్యకైంకర్యాలు, పూజా కార్యక్రమాలు సేవలు జరుగుతాయి. వేకువజామున 3గంటలకు సుప్రభాతసేవతో శ్రీవారిని మేల్కొలిపే సేవ నుండి అర్ధరాత్రి ఏకాంత సేవ వరకు పలు రకాలుగా నిత్య సేవలు, వారాంతపు సేవలు విశేష సేవలు ఆలయంలో వడ్డీకాసుల వేంకటేశ్వరునికి ఎంతో భక్తితో జరిపిస్తుంటారు. ఇలా ఒకటేమిటి వేకువజామున శ్రీనివాసుడికి సుప్రభాతసేవ, తోమాల, అర్చన, నివేదన, కొలువు, ఆస్థానం, శుద్ధి, శాత్తుమొర కైంకర్యాలు జరుగుతాయి. ఆ తరువాత ఉదయం వేళ ప్రతిరోజూ నిత్యకళ్యాణోత్సవం, ఊంజల్‌సేవ, డోలోత్సవం, ఆర్జిత బ్రహ్మోత్సవం, సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవలు నిర్వహిస్తుంటారు. ఈ సేవలన్నిటికీ వైఖానస ఆగమ వైష్ణవ అర్చకులు, నాలుగు కుటుంబాలకు చెందిన ప్రధాన అర్చకులు సేవలందిస్తారు. ఆలయంలోపల మూడు షిప్టుల్లో గర్భగుడిలో ముగ్గురు అర్చకులు, కులశేఖర పడి వెలుపల నలుగురు పరిచారకులు సేవల్లో విధుల్లో నిమగ్నమవుతుంటారు. ఉదయం వేళ సంపంగి ప్రాకారంలో జరిగే కళ్యాణోత్సవం సేవకు ప్రధాన అర్చకులతోబాటు నలుగురు పరిచారకులు విధులు నిర్వహిస్తుంటారు. కొన్నేళ్ళ క్రిందట పరిస్థితులతో ఇప్పటి అవసరాలకు తగ్గట్లు అర్చకుల సంఖ్య తగ్గడం, డిప్యుటేషన్ సమస్యల వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయని అర్చక వర్గాల్లో వినిపిస్తోంది. దేవదేవునికి జరిగే నిత్య కైంకర్యాల నిర్వహణలో ఉన్న కొద్దిమంది అర్చకులపై తీవ్రమైన ఒత్తిడి పడుతోందనే మాట వుంది.





తిరుపతిలోని గోవిందరాజ స్వామి ఆలయానికి చెందిన 17 మంది అర్చకులు పదేళ్ళుగా డిప్యుటేషన్‌పై విధులు నిర్వర్తించడం, వయోభారం, అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్న అర్చకులు ఉన్నారనేది తెలుస్తోంది. ఆలయంలో అవసరమైన మేరకు సత్వరమే అర్చకుల ఖాళీలను భర్తీ చేయాలని, లేకపోతే సేవలపై ప్రభావం పడే అవకాశం ఉందని గతంలోనే చేసిన సూచనలు వినిపించుకోవడం లేదనే మాటలు లేకపోలేదు.

**యధావిధిగా నిత్యకైంకర్యాలు:** ఏడుకొండలస్వామి ఆలయంలో కైంకర్యాల నిర్వహణకు కొంతకాలం క్రిందట 60మంది వరకు అర్చకులు పనిచేసేవారు. ప్రస్తుతం ఆ సంఖ్య 40కి పరిమితం కావడంతో గత పదేళ్లుగా తిరుపతిలోని గోవిందరాజ స్వామి ఆలయం నుండి 17మందిని డిప్యుటేషన్‌పై తిరుమలలో వినియో గించుకుంటున్నారు. సేవలకు సరిపడే అర్చకులు లేకున్నా ఉన్న అర్చకులతోనే నెట్టుకొస్తున్నారు. ప్రస్తుతం తిరుమలలో పనిచేస్తున్న అర్చకుల కుటుంబాల నుంచి గతంలో 10మందిని పరీక్షల ద్వారా ఎంపిక చేశారు. ఇంకా పదవీ విరమణ చేసిన 7 పోస్టులు ఖాళీ ఉన్నట్లుగా చెబుతున్నారు. వీటిని కూడా భర్తీ చేస్తే ప్రస్తుతం ఉన్న అర్చకులపై భారం తగ్గుతుందంటున్నారు.

# సినీనటుడు ప్రకాశ్‌రాజ్‌పై చర్యలు తీసుకోండి

- సైబర్ సెల్ డిజికి టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాశ్ రెడ్డి ఫిర్యాదు



**తిరుమల, ఆగస్టు 5 ప్రభాతవార్త ప్రతినిధి:** హిందూ దేవుళ్లపై అనుచిత పోస్టులు పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి, టిటిడి బోర్డు సభ్యుడు జి.భానుప్రకాశ్‌రెడ్డి కోరారు. దేవుడిపై నోటికొచ్చినట్టు వ్యాఖ్యానించడం ప్రకాశ్‌రాజ్‌కు సరికాదన్నారు. హిందూ దేవుళ్లను నిందిస్తే తోలు తీస్తామని, సామాజిక మాధ్యమాల్లో హిందూ దేవుళ్లను లక్ష్యంగా చేసుకుని అభ్యంతరకర పోస్టులు పెడుతున్న వారిపై, అలాగే సినీ నటుడు ప్రకాశ్‌రాజ్ చేసిన వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు బిజెపి నాయకులు సైబర్ సెల్ డిజి రవిశంకర్‌కు ఫిర్యాదు చేశారు. మొత్తం 57 మందికి సంబంధించిన వివరాలను సైబర్ పోలీసులకు అందజేశారు. ఫిర్యాదు చేసిన బృందంలో టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాశ్ రెడ్డి, బిజెపి నేతలు వల్లూరు జయప్రకాశ్, షేక్ బాజీ, శ్రీనివాసరెడ్డి ఉన్నారు. హిందూ సంస్కృతి, సాంప్రదాయాలలో శ్రీరామచంద్రుడిని ఆరాధ్య దైవంగా, లక్ష్మీదేవి, సరస్వతి, సీతాదేవిలను పవిత్ర మాతృమూర్తులుగా భావించి పూజిస్తామని గుర్తుచేశారు. కానీ కొందరు వ్యక్తులు నెట్టింట హిందూ దేవతామూర్తులను ఉద్దేశించి అసభ్యకర రీతిలో నోటికొచ్చినట్లు వ్యాఖ్యానించడం సహించరానిదని మండిపడ్డారు. నటుడు ప్రకాశ్ రాజ్ శ్రీరాముడిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ సమాజంలో విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. దమ్ము, ధైర్యం ఉంటే ఇతర మతాల్లో జరిగే అన్యాయాలపై మాట్లాడాలని సవాల్ విసిరారు.

# యాళీవాహనంపై కుమారస్వామి దర్శనం

**శ్రీకాళహస్తి, ఆగస్టు 5 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయంలోని చెంగల్వరాయస్వామి ఆలయంలోనూ అనుబంధంగా ఉన్న విజ్ఞానగిరిపై వెలసిన సుబ్రమణ్యం స్వామి ఆలయంలో ఆడికృత్తిక మహోత్సవాలు కన్నుల పండువగా జరుగుతున్నాయి. ప్రతి రోజూ రెండు వాహనాలపై స్వామి అమ్మవార్ల దర్శనం భాగ్యం భక్తులు కల్గుతుంది. బుధవారం ఉదయం బంగారు యాళీ వాహనంపై వల్లిదేవ సేన సమేత సుబ్రమణ్యం స్వామి దివ్యదర్శనం ఇచ్చారు. అలంకార మండపంలో స్వామి అమ్మవార్లను అలంకార గురుకుల్ ముస్తాబు చేయగా, ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ కొట్టె సాయిప్రసాద్, ఇఒ బికె వెంకటేశులు, ఎఇఒ విద్యాసాగర్‌రెడ్డి, కుమారస్వామి, ధర్మకర్తల మండలి ఛైర్మన్ నెమళ్ళూరు బుజ్జి వారి సహచర సభ్యులు హారతులిచ్చి ఊరేగింపుకు శ్రీకారం చుట్టారు. ఆ తరువాత శివయ్య గోపురం, రాజగోపురం నుంచి వాహనాల మండపం వద్దకు చేర్చారు. ఇక్కడ బంగారు యాళీ వాహనంపై ప్రతిష్టించి గ్రామోత్సవానికి తరలించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ హరి యాదవ్, ఆలయ సిబ్బంది వెంటరాగా ఉత్సవం నాలుగుమాఢ వీధులు, బాబూ అగ్రహారం మీదుగా ఉత్సవం సాగింది.



బంగారు యాళీవాహనంపై కుమారస్వామి దర్శనం

# పరిశ్రమలకు నో పవర్ కట్

- ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి

**తిరుపతి, ఆగస్టు 5 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపిఎస్‌పిడిసిఎల్ పరిధిలో పరిశ్రమలకు విద్యుత్ అంతరాయం రానివ్వొద్దని ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. పారిశ్రామిక విద్యుత్ సమస్యల పరిష్కారానికి బుధవారం వినియోగదారులతో సిఎండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పారిశ్రామిక విద్యుత్ సమస్యల పరిష్కారానికై ప్రతినెలా మొదటి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నామని తెలిపారు. సంస్థ పరిధిలోని 9 జిల్లాల నుంచి 29 మంది పారిశ్రామిక విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సమస్యలను వివరించేందుకు తమ పేర్లను నమోదు చేసుకున్నారని తెలిపారు. ఎస్‌పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయం నుండి బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా 23 మంది పారిశ్రామిక వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలపై చర్చిస్తూ, పరిశ్రమలకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్తును సరఫరా చేయాలని, హెచ్‌టి లైన్ మార్పు, బిల్లింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా సిఎండి శివశంకర్ లోతేటి మాట్లాడుతూ పారిశ్రామిక విద్యుత్ వినియోగదారులకు మెరుగైన, సత్వర సేవలతో నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. పరిశ్రమలకు విద్యుత్ సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు చర్యలు చేపడుతున్నామని, బిల్లింగ్ సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని వివరించారు. క్షేత్రస్థాయిలో క్షేత్రస్థాయిలో పారిశ్రామిక విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు, సిబ్బంది ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కె.గురవయ్య, చీఫ్ జనరల్ మేనేజర్లు ఎం.మురళి కుమార్, కె.సంపత్ కుమార్, జనరల్ మేనేజర్లు శ్రీకాంత్, చక్రపాణి, పిఆర్‌ఒ తోట మధుసూదన తదితరులు పాల్గొన్నారు.

### మురుగా.. షణ్ముఖా.. వేలాయుధా..!

# నేడు ఆడికృత్తిక



**శ్రీకాళహస్తి, ఆగస్టు 5 ప్రభాతవార్త:** మురుగా.. షణ్ముఖా.. వేలాయుధా.. వడివేలా.. అప్పనే.. కార్తీకేయ.. చెంగల్వరాయ.. తిరుత్తణి వాసా.. హరోంహరా ఇవన్నీ సుబ్రహ్మణ్య స్వామిని భక్తులు పిలిచే పేర్లు. ప్రతి ఏడాది ఆడికృత్తిక మహోత్సవాలను ఎంతో అంగరంగ వైభవంగా నిర్వహిస్తుంటారు. ఈ నేపథ్యంలో ప్రసిద్ధపుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తిలోని ఆలయంలోనూ, కుమారస్వామి కొండపై అలాగే తమిళనాడులోని తిరుత్తణితో పాటు, సుబ్రహ్మణ్యస్వామి వెలసిన ఆలయాల్లో ప్రత్యేక పూజలు, వేడుకలు నిర్వహించడం ఆనవాయితీ. నేడు ఆడికృత్తిక మహోత్సవం. శ్రీకాళహస్తి పట్టణంలోని విజ్ఞానగిరిపై వెలసిన సుబ్రమణ్యస్వామి ఉత్సవాలను వైభవంగా నిర్వహించుటకు శ్రీకాళహస్తీశ్వరాలయం ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నారు.

6MN 11 PG-GNT_6MN 11 PG-GNT.qxd 06-08-2026 AM 12:54 Page 1



## కండక్టర్‌పై దాడి కేసులో నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలి.. : ఆర్టీసీ జేఏసీ విజ్ఞప్తి

నరసరావుపేట, ఆగస్టు 5 ప్రభాతవార్త : నరసరావుపేట డిపోకు చెందిన అన్ని కార్మిక సంఘాలు సంయుక్తంగా జేఏసీగా ఏర్పడి, మేరికపూడి గ్రామంలో ఆర్టీసీ కండక్టర్ గోరంట్ల పూర్ణచంద్రరావుపై జరిగిన దాడి ఘటనలో నిందితులను తక్షణమే అరెస్ట్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పల్నాడు జిల్లా ఎస్పీకి విజ్ఞప్తి చేశాయి. నిందితుల అరెస్టులో జాప్యం జరగడం వల్ల వారే బాధితుడిపై మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించారని, కులం పేరుతో దూషించారని తప్పుడు ఆరోపణలు చేస్తూ గుంటూరు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి కేసును తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని జేఏసీ నాయకులు ఆరోపించారు. ఈ ఘటనలో ఎఫ్ఐఆర్‌లో నమోదైన సెక్షన్ల ప్రకారం నిందితులను వెంటనే అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపాలని, బాధితుడైన కండక్టర్ గోరంట్ల పూర్ణచంద్రరావుకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ జేఏసీ నాయకులు బి. నాగార్జున, కె. చందు, పి.ఎస్. రావు, ఈ. కృష్ణ, కె. రామారావు, టి.వి. రెడ్డి తదితరులతో పాటు కండక్టర్ గోరంట్ల పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.



## ప్రజల భాగస్వామ్యంతోనే గ్రీన్ నరసరావుపేట సాధ్యం : కలెక్టర కృతిక శుక్లా

నరసరావుపేట, ఆగస్టు 5 ప్రభాతవార్త "గ్రీన్ నరసరావుపేట" లక్ష్యాన్ని విజయవంతంగా సాధించేందుకు ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరమని కలెక్టర్ కృతిక శుక్లా అన్నారు. బుధవారం కలెక్టరేట్ వీసీ సమావేశ మందిరంలో డిస్ట్రిక్ట్ ఫారెస్ట్ కమిటీ మీటింగ్ కలెక్టర్ కృత్విక శుక్లా అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ, హరితాభివృద్ధి, పరిశుభ్రమైన పరిసరాల కల్పనలో స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ ప్రేమికులు, విద్యాసంస్థలు, పారిశ్రామిక సంస్థలు, వ్యాపార సంస్థలు, సేవా సంఘాలు, యువజన సంఘాలు, మహిళా సంఘాలు, సామాజిక సంస్థలు కీలక పాత్ర పోషించాలన్నారు. నరసరావుపేటను మరింత పచ్చదనం, పరిశుభ్రమైన, పర్యావరణహిత నగరంగా తీర్చిదిద్దేందుకు జిల్లా యంత్రాంగం సమగ్ర కార్యాచరణ చేపట్టిందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా ప్రజల ఉద్యమంగా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. సెప్టెంబర్ చివరి నాటికి 1,24,000 మొక్కలను నాటేందుకు ప్రత్యేక ప్రణాళిక రచించామన్నారు. కుంకుడు, మహాగనీ, వెదురు, సీతాఫలం, ఖర్జూరం వివిధ రకాల మొక్కలను గుర్తించామని, వాటిని తామే అందిస్తామని తెలిపారు. ప్రతి పౌరుడు కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఎన్నో ఏళ్లుగా జిల్లాలో వివిధ సంస్థలు పర్యావరణాన్ని కాపాడటానికి ప్రయత్నిస్తున్నందుకు సంతోషం వ్యక్తం చేశారు. అందరూ కలిసి సమిష్టిగా కృషి చేస్తే మంచి ఫలితాలు సాధిస్తామన్నారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, ప్రభుత్వ కార్యాలయాల సిబ్బంది, పరిశ్రమల యాజమాన్యాలు, కాలనీలు, గ్రామాలు, పట్టణాల్లో ప్రజలు విస్తృతంగా మొక్కలు నాటడం, వాటి సంరక్షణ, నీటి సంరక్షణ, పరిశుభ్రత కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. ప్రభుత్వ కార్యాలయాలలో అంగన్వాడీలు, ఇండస్ట్రీస్, విద్యాసంస్థలలో మొక్కలు నాటాలని సూచించారు. అడవుల్లో డ్రోన్ ద్వారా సీడ్ బాల్స్ వెదజల్లే కార్యక్రమానికి 12 లక్షల సీట్ బాల్స్ ను సిద్ధం చేయడం జరిగిందని డిఎఫ్ఓ తెలిపారు. వాటిని వినుకొండ, మాచర్ల, పిడుగురాళ్ల, నరసరావుపేట రేంజిలోని 34.80 లక్షల హెక్టార్లలో డ్రోన్ టెక్నాలజీ తో సీడ్ బాల్స్ జారవిడిచే ప్రక్రియ అటవీ శాఖ అధికారులు చేపట్టడం జరుగుతుందన్నారు . నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాంతంలో టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ ఉందని, దానిలో పులుల సంఖ్యను కెమెరా ట్రాప్ ద్వారా, డేటా క్యాప్చర్ ద్వారా లెక్కించడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఫారెస్ట్ లో ఇల్లీగల్ బోర్ బావులను నియంత్రించాలని, డీకే పట్టాలు ఇచ్చినచోట అక్రమ మైనింగ్ జరగకుండా చూడాలని అటవీ శాఖ అధికారులకు తెలిపారు. ఎకో టూరిజమ్ పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని టూరిజం శాఖ అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామంలో 3 నుండి ఐదు ఎకరాలలో తాటితోపును పెంచేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎఫ్ఓ కృష్ణప్రియ, సోషల్ ఫారెస్ట్ ఆఫీసర్ అశోక్ కుమార్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.




## వ్యాపారులకు కేటాయించిన స్థలాలలోనే వ్యాపారాలు చేసుకోవాలి : ట్రాఫిక్ సిఐ లోకనాథం

నరసరావుపేట క్రైమ్, ఆగస్టు 5 ప్రభాతవార్త : వ్యాపారులు తమకు కేటాయించిన స్థలాలలోనే తమ వ్యాపారాలు చేసుకోవాలని సిఐ లోకనాథం అన్నారు. బుధవారం పట్టణంలోని లాల్ బహదూర్ కూరగాయల మార్కెట్ వద్ద తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తడంతో సీఐ లోకనాథం వ్యాపారులకు అవగాహన కల్పించారు. డీఎస్పీ ఆదేశాల మేరకు పండ్లు, పూల వ్యాపారులతో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. రోడ్డుపై ఎలాంటి ఆక్రమణలు చేయకుండా, తమకు కేటాయించిన పరిమితుల్లోనే వ్యాపార కార్యకలాపాలు నిర్వహించాలని సూచించారు. అలాగే వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించి, వాహనాలను క్రమబద్ధంగా పార్కింగ్ చేయాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నిర్వహణలో వ్యాపారులు, వాహనదారులు అందరూ సహకరించాలని సీఐ లోకనాథం కోరారు.



## బీసీ కాలనీ శివారులో పేకాట స్థావరంపై పోలీసుల దాడి . రూ.28,740 నగదు, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం

నరసరావుపేట క్రైమ్, ఆగస్టు 5 ప్రభాతవార్త : నరసరావుపేట పట్టణంలోని బీసీ కాలనీ శివారులో పేకాట ఆడుతున్న వారిపై టూ టౌన్ పోలీసులు ఆకస్మికంగా దాడి నిర్వహించి పదుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయాన్ని టూ టౌన్ ఎస్ఐ సౌందర్ రాజన్ బుధవారం వెల్లడించారు.ఆయన తెలిపిన వివరాల ప్రకారం, విశ్వసనీయ సమాచారం అందడంతో బీసీ కాలనీ శివారులో ప్రత్యేక బృందంతో దాడి నిర్వహించారు. అక్కడ పేకాట ఆడుతున్న పదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారిలో పురుషులు, ఒక మహిళ ఉన్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.28,740 నగదు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెల్లడించారు. నిందితులపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.ప్రజలు చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, ఎక్కడైనా పేకాట లేదా ఇతర అక్రమ కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ఎస్ఐ సౌందర్ రాజన్ సూచించారు.

# ముగ్గురు యువకులు అరెస్ట్

గుంటూరు క్రైమ్,ఆగస్టు5,ప్రభాతవార్త: గుంటూరు జిల్లాలో గంజాయి,ఇతర మాదక ద్రవ్యాల కార్యకలాపాలను పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంతో పాత నేరస్థులపై నిఘా పెట్టి,ముమ్మర తనిఖీలు నిర్వహించాలని,అనుమానిత కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపాలని పోలీస్ అధికారులకు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాలు జారీ చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు,ఈస్ట్ డి.ఎస్పీ టి. సీతారాం పర్యవేక్షణ లో పాత గుంటూరు పోలీస్ స్టేషన్ సీఐ వెంకట ప్రసాద్ తన పరిధిలో గంజాయి,ఇతర మాదకద్రవ్యాల కేసుల్లో నిందితులుగా ఉన్న గంజాయి అమ్మే వారి పై నిఘా పెట్టి, వారి కదలికలను ఎప్పటికప్పుడు పసిగడుతూ ఎవరైనా గంజాయి కార్యకలాపాలు నిర్వహిస్తుంటే, వారిపై ఆకస్మిక దాడులు నిర్వహించి అరెస్ట్ చేస్తున్నారు.దీనిలో భాగంగా బుధవారం ఉదయం గుంటూరు టౌన్, పాతగుంటూరు, బాలాజీ నగర్ "0" లైను ఎక్స్టెన్షన్, రైల్వేట్రాక్స్ పక్కన గంజాయి కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని రాబడిన సమాచారం మేరకు ఆకస్మిక దాడులు నిర్వహించి యువకులను అదుపులోకి తీసుకుని,వారి వద్ద నుండి లిక్విడ్ గంజాయి 120 గ్రాముల లిక్విడ్ గంజాయి డబ్బాలను,50 మత్తు టాబ్లెట్ 5షీట్లను స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే గుంటూరు టౌన్, పాతగుంటూరు, బాలాజీ నగర్ "0" లైను ఎక్స్టెన్షన్, రైల్వేట్రాక్స్ పక్కన గంజాయి కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని రాబడిన సమాచారం మేరకు ఆకస్మిక దాడులు నిర్వహించి ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. వారిలో శంకర్ అయ్యన్నార్ చిన్న,10 వ లైను, బాలాజీ నగర్, పాత గుంటూరు, అను అతని వద్ద 8 లిక్విడ్ గంజాయి చిన్న డబ్బాలు 80 గ్రాములు 1 షీట్ మత్తు బిల్లలు ను,బిలకల మురళీకృష్ణారెడ్డి, 6/2వ లైన్, లక్ష్మీనగర్ సుద్దపల్లి డొంక, పాత గుంటూరు, గుంటూరు టౌన్. అను అతని వద్ద 2 లిక్విడ్ గంజాయి డబ్బాలను, 20 గ్రాములు,2 షీట్లు మత్తు బిల్లలను, ఏలయ వెంకట సతీష్,1వ లైను, గోలను కొండలరావు నగర్, సుద్దపల్లి డొంక, పాత గుంటూరు, 2 లిక్విడ్ గంజాయి డబ్బాలను,20 గ్రాములు,2షీట్లు మత్తు బిల్లలను,ఈ ముగ్గురు వద్ద ఉన్న మొత్తం లిక్విడ్ గంజాయి 120 గ్రాములు,12 గంజాయి డబ్బాలు, 50 టాబ్లెట్ లను స్వాధీనం చేసుకున్నారు. గుంటూరు జిల్లా ఈస్ట్ డీఎస్పీ అయిన టి. సీతారాం మాట్లాడుతూఈస్ట్ సబ్ డివిజన్ లో గంజాయి మహమ్మారిని కూకటివేళ్లతో పెకలించి, నిర్మూలించడానికి పటిష్ట ప్రణాళికలు రూపొందించామని, పోలీస్ స్టేషన్ స్థాయిలో ప్రత్యేక పోలీస్ బృందాలను నియమించి,ఈగల్ టీం వారితో సమన్వయం చేసుకుంటూ గంజాయి విక్రయం,వినియోగం,సరఫరా చేసే వారిని కనిపెట్టి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.గంజాయి కేసుల్లోని పాత నేరస్తులపై నిఘా పెట్టి, వారి కదలికలు,వారు చేసే పనులు, వారి జీవన విధానం, వ్యవహార శైలి వంటివి పరిశీలిస్తూ ఎక్కడైనా ఏవైనా అనుమానాస్పద విషయాలు వారిలో కనిపిస్తే వెంటనే వారిని అరెస్ట్ చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



## ఎమ్మెల్యే గల్లా మాధవి చేతుల మీదుగా ఆజాది బ్యాడ్మింటన్ టోర్నమెంట్-2026 బ్రోచర్ ఆవిష్కరణ

గుంటూరు విద్య, ఆగస్టు 5 ప్రభాతవార్త : 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించనున్న "ఆజాది బ్యాడ్మింటన్ టోర్నమెంట్-2026" బ్రోచర్‌ను గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ, ఆగస్టు 15, 16 తేదీల్లో స్థానిక ఎన్టీఆర్ మునిసిపల్ స్టేడియం, గుంటూరులో ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాలకు చెందిన బ్యాడ్మింటన్ క్రీడాకారులతో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువ క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభను చాటాలని, మెరుగైన ఆటతీరు కనబరిచిన వారికి భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణించే అవకాశాలు లభిస్తాయని ఆమె పేర్కొన్నారు. టోర్నమెంట్ నిర్వాహకులు, తెలుగు యువత నాయకులు కొణిదే మోహన్ గోపికృష్ణ మాట్లాడుతూ, ఈ టోర్నమెంట్‌ను యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు బాధ్యతాయుతమైన ఆన్‌లైన్ ప్రవర్తనపై అవగాహన కల్పించే లక్ష్యంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ టోర్నమెంట్ ఆగస్టు 15, 16 తేదీల్లో రెండు రోజుల పాటు ఘనంగా జరుగుతుందని, యువ బ్యాడ్మింటన్ క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు ఇది మంచి వేదికగా నిలుస్తుందని అన్నారు. ఈ టోర్నమెంట్‌లో బాయ్స్ (11-15 సంవత్సరాలు), బాయ్స్ (16-19 సంవత్సరాలు), మెన్స్ (20-40 సంవత్సరాలు), సీనియర్స్ (41 సంవత్సరాలు పైబడిన వారు) విభాగాల్లో సింగిల్స్ మరియు డబుల్స్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విజేతలకు భారీ నగదు బహుమతులు, ట్రోఫీలు మరియు మెమెంటోలు ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు. పోటీలలో పాల్గొనదలచిన క్రీడాకారులు తమ ఎంట్రీలను 9885622777 నంబర్‌కు సంప్రదించి నమోదు చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో పరుచూరి సంజీవరావు (తెలుగుదేశం పార్టీ గుంటూరు జిల్లా పార్లమెంటరీ ఆర్గనైజింగ్ సెక్రటరీ), రాజు పుత్ర సత్యం సింగ్ (మాజీ యార్డ్ డైరెక్టర్), బ్యాడ్మింటన్ కోచ్ మనోజ్, వంశీ, రాజీవ్, దోవ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు. గుంటూరు, కృష్ణా జిల్లాలకు చెందిన బ్యాడ్మింటన్ క్రీడాకారులతో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువ క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభను చాటాలని, మెరుగైన ఆటతీరు కనబరిచిన వారికి భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణించే అవకాశాలు లభిస్తాయని ఆమె పేర్కొన్నారు.



## చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

కారంపూడి, ఆగస్టు 5, ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక , కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా సెప్టెంబర్ ఒకటో తేదీ నుండి మార్పు కావాలి అనే పేరుతో కార్యక్రమం చేపట్టినట్టు కార్యదర్శి మేకపోతు శ్రీనివాస్ రెడ్డి బుధవారం తెలిపారు. ఆగస్టు ఆరో తేదీ నుండి 15వ తేదీ వరకు పాదయాత్రలు చేపట్టి, 17 తేదీ నుండి 28వ తేదీ వరకు ప్రజా సంఘాల ప్రచార ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కారంపూడి లోని కాలనీలో గోడపత్రాలను ఆవిష్కరించారు. వడపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి షేక్ సైదా, ఏఐటీయూసీ నాయకులు నూనె వెంకటేశ్వర్లు, సుభాని, వెంకయ్య, బ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు



## కారంపూడి ఎస్ఐ వాసుపై సస్పెన్షన్ వేటు



కారంపూడి, ఆగస్టు5, ప్రభాతవారనత: కారంపూడి పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న ఎస్సై వాసు పై ఉన్నతాధికారులు సస్పెండ్ చేసినట్లు బుధవారం తెలిసింది. కారంపూడి మండలం లోని గాదివారిపల్లె గ్రామానికి చెందిన మిర్చి వ్యాపారి చల్లా అయ్యప్ప ను ఒక కేసు విషయంలో అతని భార్యతో కలిసి పోలీస్ స్టేషన్ కు పిలిపించినట్లు తెలుస్తుంది. ఈ నేపథ్యంలోనే భార్య ఎదుటే అయ్యప్ప పై ఎస్ఐ వాసు దాడి చేశాడని ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనతో మనస్థాపానికి గురైన అయ్యప్ప భార్య లక్ష్మి పురుగుమందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. ఆమెను వెంటనే వైద్యశాలకు తీసుకువెళ్లి వైద్య సేవలు అందించారు. ఈ ఘటనపై వచ్చిన ఫిర్యాదులు, ఆరోపణలు నేపథ్యంలో ఎస్ఐ వాసు పై పోలీస్ ఉన్నతాధికారులు సస్పెన్షన్ చర్యలు తీసుకున్నట్టు తెలిసింది. ఈ మేరకు కారంపూడి ఇంచార్జ్ ఎస్ఐగా దుర్గి ఎస్సై ను నియమించినట్లు సమాచారం.

## 2027 ఫిబ్రవరి నాటికి వరికపూడిశెలకు శంకుస్థాపన : ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి



వెల్దుర్తి, ఆగస్టు 5, ప్రభాతవార్త: దశాబ్దాల నాటి పల్నాడుజిల్లా ప్రజల కల వరికపూడిశెల ప్రాజెక్టు నిర్మాణం తన జీవితాశయమని, అన్ని రకాల అనుమతులతో వచ్చే ఏడాది ఫిబ్రవరి నాటికి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభిస్తామని మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి వెల్లడించారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మేజర్, మైనర్ ఇరిగేషన్, నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ (విళీశి), లిఫ్ట్ ఇరిగేషన్ శాఖల నియోజకవర్గ స్థాయి అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలువల నిర్వహణ, మరమ్మతులు, చెరువు కట్టల పరిరక్షణ, వాగుల రక్షణ, చెరువులను నింపడం, ఎన్.ఎస్.పి ఆయకట్టు పటిష్టత, ఎత్తిపోతల పథకాల పనితీరుపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. సమీక్ష అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే జూలకంటి మాట్లాడుతూ, గత ఐదేళ్ల వైసీపీ పాలనలో సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. ఎన్.ఎస్.పి కుడి కాలువ ఆయకట్టు రైతులలో నీటి సంరక్షణపై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం తాగునీటి అవసరాల కోసం 1.865 టీఎంసీల సాగర్ జలాలను అందించేందుకు చర్యలు చేపడుతున్నామని, రైతులు ప్రతి నీటి బొట్టును ఆదా చేస్తూ ఆరుదలు పంటల వైపు అడుగులు వేయాలని విజ్ఞప్తి చేశారు.

## పత్తిలో శాస్త్రీయ పద్ధతులు పాటించాలి

దుర్గి ,ఆగస్టు 5,ప్రభాతవార్త;ఎల్నినో వాతావరణ పరిస్థితుల వల్ల కలిగే అధిక ఉష్ణోగ్రతలు, తేమ కొరతను తట్టుకునేందుకు పత్తి రైతులు శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు పాటించాలని దుర్గి మండల వ్యవసాయ అధికారి వై. అమిర్ రెడ్డి సూచించారు. బుధవారం కోలగట్ల గ్రామంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేలలో తేమ కోసం కలుపు నివారణ, పంట అవశేషాలతో మల్చింగ్ చేయాలన్నారు. పూత, కాయ దశలో లీటరు నీటికి 10 గ్రాముల 19:19:19 లేదా 13:0:45 ఎరువును, అలాగే ఎకరానికి 1 కిలో మెగ్నీషియం సల్ఫేట్ + 250 గ్రాముల బోరాన్ కలిపి పిచికారీ చేయడం ద్వారా పూత రాలడాన్ని తగ్గించవచ్చన్నారు. తామర పురుగు, గులాబీ కాయ తొలుచు పురుగుల పట్ల అప్రమత్తంగా ఉంటూ, అధికారుల సలహాతోనే మందులు వాడాలని కోరారు. కార్యక్రమంలో ఏఈఓ కె. రంగనాయక్, వీఏఏ ళి. కళ్యాణ్ నాయక్, రైతులు పాల్గొన్నారు.

## ఆత్మ రక్షణకు కరాటే ఎంతో ముఖ్యం

విజయపురిసౌత్,ఆగస్టు 5, ప్రభాతవార్త: నేడు సమాజంలో పెరుగుతున్న మహిళలపై పెరుగుతున్న అకృత్యాల దృశ్య మహిళలకు ఆత్మ ధైర్యంతో పాటు మనోధర్యం లాంటి కరాటే విద్య కూడా ఎంతో ముఖ్యమని సాగర్ క్యాంప్ హెడ్ మాస్టర్ వెంకటేశ్వర్లు అన్నారు.స్థానిక శ్రీ సీతారామాలయం లో కోలా.సుబ్బారెడ్డి తనయుడు కోలా.వేంకటకృష్ణ రెడ్డి సహకారంతో అయిదవ తరగతి నుండి పదవ తరగతి చదువుతున్న విద్యార్థినియులు ఉచితం గా కరాటే శిక్షణ ఇప్పించబడుతుందని రామాలయ కమిటీ సభ్యులు తెలిపారు.సాగర్ క్యాంప్ 1 హెడ్ మాస్టర్ మల్లికార్జున రావు మాట్లాడుతూ బాలికలకు కరాటే విద్యని అందించాలని దృఢ సంకల్పంతో నేటి సమాజంలో విద్య తో పాటు అవసరమైనప్పుడు తమ చేతులను సైతం ఆయుధాలు గా మలుచుకోవలని గుండె ధైర్యం తో పాటు మానసిక ధైర్యం కూడా ముఖ్యమని అన్నారు.కరాటే శిక్షకుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కరాటే అసోసియేషన్ సభ్యులు నాలుగవ డాన్ బ్లాక్ బెల్ట్ హోల్డర్ కె.నాగరాజు కుమార్ సుమారు వంద మంది విద్యార్థినియులకు కరాటే నేర్పించారు.ఆసక్తి గల విధార్థిని యులు ప్రతి బుధ,గురువారాలలో స్థానిక రామాలయంలో సాయంత్రం ఐదు గంటలకు నేర్పించబడుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈకార్యక్రమంలో మన్నెపల్లి.రామాంజనేయులు, కృష్ణమూర్తి,సత్తిబాబు, పవన్,కృష్ణ,బాలస్వామి, నారసింహులు,చిట్టి,సాగర్ క్యాంప్ హెడ్ మాస్టర్ వెంకటేశ్వర్లు,జ్యోతి,ఉపాధ్యాయులు వెంకటకృష్ణ, రామాంజనేయులు,సిసింద్రీ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో పాల్గొన్న పుడా చైర్మన్ చిరుమామిళ్ల మధుబాబు

మాచర్ల టౌన్ ఆగష్టు 5 ప్రభాతవార్త: ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో పాల్గొన్న పుడా చైర్మన్ చిరుమామిళ్ల మధుబాబుగుంటూరు పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆధ్వర్యంలో నిర్వహించిన "ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమం బుధవారం ఉత్సాహంగా సాగింది. ఈ కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిశీలకులు,పుడా చైర్మన్ చిరుమామిళ్ల మధుబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి, పుడా చైర్మన్ చిరుమామిళ్ల మధుబాబు ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు.ప్రభుత్వం చేపట్టిన పథకాలు, ప్రజలకు అందుతున్న ప్రయోజనాలపై వివరించి అవగాహన కల్పించారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమం,అభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని అమలు చేస్తున్న పథకాలను ప్రతి కుటుంబానికి చేరవేయడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని వారు తెలిపారు.ప్రజలు కూడా ప్రభుత్వ కార్యక్రమాలపై సానుకూలంగా స్పందిస్తూ తమ సమస్యలను నాయకుల దృష్టికి తీసుకువచ్చారు.



## ప్రపంచ స్థాయి పెట్టుబడులకు గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్: ఎంపీ భాష్యం రామకృష్ణ

గుంటూరు విద్య ఆగస్టు 5 ప్రభాతవార్త: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ ప్రపంచ స్థాయి పెట్టుబడిదారులకు ప్రధాన గమ్యస్థానంగా అవతరించిందని రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ అన్నారు. బుధవారం సహచర తెలుగు దేశం పార్టీ రాజ్యసభ సభ్యులు సానా సతీష్, చింతకాయల విజయ్ లతో కలిసి ఢిల్లీలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు విజన్ వల్ల విధానపరమైన స్థిరత్వం, వ్యాపారానికి అనుకూల వాతావరణం కల్పించడం ద్వారా ఆంధ్రప్రదేశ్ ని పెట్టుబడులకు అగ్రగామి స్థానంలో నిలబెట్టిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పెట్టుబడిదారుల విశ్వాసం పెరగడాన్ని ప్రతిబింబిస్తూ, ఎఫ్ డి ఐ ఈక్విటీ పెట్టుబడుల ప్రవాహం 2023-24లో ఉన్న 92 మిలియన్ల నుండి 2025-26 నాటికి 609 మిలియన్లకు భారీగా పెరిగింది అని తెలిపారు.అలాగే భారతదేశం మొత్తం ఎఫ్ డి ఐ ఈక్విటీ ప్రవాహంలో ఆంధ్రప్రదేశ్ వాటా 0.21 నుండి 1.03 కి దాదాపు ఐదు రెట్లు పెరిగిందన్నారు. పెట్టుబడులు తగ్గుతున్నాయని వైసీపీ ప్రచారం చేసిన తప్పుడు కథనాన్ని ఈ గణాంకాలు స్పష్టంగా తిప్పికొడుతున్నాయని ఎంపీ భాష్యం రామకృష్ణ స్పష్టం చేశారు.




## ధృతి బి2 ఎక్స్‌పో - 2026కు సర్వం సిద్ధం

గుంటూరు విద్య ఆగస్టు 5 ప్రభాతవార్త : గుంటూరు నగరంలో నిర్వహించనున్న బి2 ఎక్స్‌పో - 2026కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని నిర్వాహకులు తెలిపారు. మూడు రోజుల పాటు జరగనున్న ఈ మహా ప్రదర్శనలో వివిధ రంగాలకు చెందిన 140 స్టాల్స్ సందర్శకులను ఆకట్టుకోనున్నాయి. బి2 ఎక్స్‌పో అధ్యక్షులు కె. శ్రీధర్ బాబు మాట్లాడుతూ, "గృహోపకరణాలు, ఫర్నిచర్, సోలార్, రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగం, విద్యా సంస్థలు, సహజ ఉత్పత్తులు, హెల్త్‌కేర్, ఆటోమొబైల్స్, లైఫ్ స్టైల్, ఫైనాన్స్, టెక్నాలజీ తదితర అనేక విభాగాలకు చెందిన మొత్తం 140 స్టాల్స్ ఒకే వేదికపై ఏర్పాటు చేయడం విశేషం. వ్యాపారవేత్తలు, పెట్టుబడిదారులు, వినియోగదారులకు ఇది అత్యుత్తమ అవకాశంగా నిలుస్తుంది" అన్నారు. బి2 ఎక్స్‌పో కార్యదర్శి బి. హేమంత్ మాట్లాడుతూ, ఎక్స్‌పోలో భాగంగా ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ స్క్రీనింగ్, రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్, అలాగే వివిధ రకాల ఉచిత రక్త పరీక్షలు మరియు ఇతర ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఉపాధ్యక్షులు మాట్లాడుతూ, వినియోగదారులతో ప్రత్యక్ష అనుసంధానానికి ఈ ఎక్స్‌పో ఉత్తమ వేదికగా నిలుస్తుందని ప్రజలు, వ్యాపారవేత్తలు, విద్యార్థులు, యువత, కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ మహా వ్యాపార ప్రదర్శనను విజయవంతం చేయాలని బి2 ఎక్స్‌పో కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈ సందర్భంగా ధృతి బి2 ఎక్స్‌పో కోకన్వీనర్లు బద్రి, రమణమూర్తి, నిర్వాహక కమిటీ సభ్యులు చైతన్య, వంశీ మాధవ్ తదితరులు పాల్గొన్నారు.



## మున్సిపల్ ఉపాధ్యాయుల తీవ్ర సేవా సమస్యలపై ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి పిఎంటిఎఫ్ కి వినతి

గుంటూరు విద్య ఆగస్టు 5 ప్రభాతవార్త: రాష్ట్రంలోని మున్సిపల్ యాజమాన్య పాఠశాలల్లో సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్న సుమారు 14,000 మంది మున్సిపల్ ఉపాధ్యాయుల తీవ్ర సేవా సమస్యలు, పరిపాలనాపరమైన వివక్షను తొలగించి, వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ప్రోగ్రెసివ్ మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పుపశ్చిమ గోదావరి జిల్లాల పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి కి బుధవారం సమగ్ర వినతిపత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ, పాఠశాల విద్యాశాఖలో విలీన ప్రక్రియ జరిగి ఏళ్లు గడుస్తున్నా మున్సిపల్ ఉపాధ్యాయులకు స్పష్టమైన సేవా నిబంధనలు వర్తింపజేయకపోవడం దారుణమన్నారు. జిల్లాల పునర్విభజన లో మున్సిపల్ ఉపాధ్యాయులకు సీనియార్టీ నష్టపోకుండా సొంత జిల్లాలకు వెళ్ళడానికి వీలుగా వెంటనే అమల్లోకి తీసుకురావాలనీ, ఎంఈఓ ప్రమోషన్లలో సమాన ప్రాతినిధ్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సమాన విద్యార్హతలు, అనుభవం ఉన్నప్పటికీ ఎంఈఓ 2 పరిపాలనా పోస్టుల కేటాయింపులో కేవలం జడ్పీ /ప్రభుత్వ ఉపాధ్యాయులకే అవకాశం ఇస్తూ మున్సిపల్ ఉపాధ్యాయులను మినహాయించడం తీవ్ర అన్యాయం. నిష్పత్తి ఆధారంగా మున్సిపల్ టీచర్లకు ఎంఈఓ పదోన్నతులు కల్పించాలనీ కోరారు. దీనిపై ఎమ్మెల్సీ సానుకూలంగా స్పందిస్తూ, మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. సుమంత్ కమిటీ ప్రతినిధులు, బాధ్యులు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## బాలుడు ప్రాణ రక్షక చికిత్స కోసం స్పందించండి.

గుంటూరు విద్య ఆగస్టు 5 ప్రభాతవార్త: తమ వద్ద సి ఏ అభ్యసించి తెనాలిలో స్థిరపడ్డ హరీష్, బాల నవ్య శ్రీ దంపతుల కుమారుడు ఖీఅశ్వత్‌ఖీ జన్యుపరమైన అరుదైన కండరాల వ్యాధి డిఎండి తో తీవ్ర అనారోగ్యంతో ఉన్నాడని అరుదైన ఈ వ్యాధికి అమెరికాలో మాత్రమే ఉండే ఇంజక్షన్ ఖరీదు 26 కోట్ల రూపాయలు అవుతుందని అంత శక్తి లేని ఆ కుటుంబ సభ్యులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, వివిధ రాజకీయ పార్టీలు సభ్య సమాజం, ప్రభుత్వాలు, ఆదుకోవాలని మాస్టర్ మైండ్ అధినేత మట్టుపల్లి మోహన్ విజ్ఞప్తి చేశారు. బుధవారం బ్రాడీపేట లోని సత్య క్యాంపస్ లో జరిగిన విలేకరుల సమావేశంలో మాస్టర్ మైండ్స్ మోహన్ మాట్లాడుతూ తల్లిదండ్రులు ఇద్దరు తమ వద్ద సి ఏ పూర్తిచేసుకుని తెనాలిలో వృత్తిని కొనసాగిస్తున్నారని చెప్పారు నాలుగు సంవత్సరాల కుమారుడు అశ్వత్ కు గత ఏడాది చివర్లో బెంగళూరు శివాన్సీ న్యూరో మెడికేర్ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించగా అరుదైన వ్యాధి బయటపడిందన్నారు. మాస్టర్ మైండ్స్ అధ్యాపకులు, యాజమాన్యం, విద్యార్థులు కొంత ఇతర మార్గాల ద్వారా ఎప్పటికీ మూడు కోట్ల 11 లక్షల రూపాయలు చేశామని తెలిపారు. అయినప్పటికీ 26 కోట్ల రూపాయలు భారం మోయలేని పరిస్థితులలో మీడియా ద్వారా దయా హృదయులైన ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేస్తున్నారని తెలిపారు. పునర్విక శ్రీ అనే బాలిక కు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తక్షణమే స్పందించి ఆమెకు పునర్జన్మ అందించారని అదేవిధంగా ఈ బాలుడిని కూడా పునర్జన్మ ప్రసాదించాలని కోరుతున్నామన్నారు. దాతలు తమ విరాళాలు ఫోన్ పే నెంబర్ 9700365341 కు పంపాలని తల్లిదండ్రులు హరీష్, నవ్య శ్రీ విజ్ఞప్తి చేశారు




## సంక్షేమం-అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం

మాచర్ల టౌన్ ఆగష్టు 5 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేసే లక్ష్యంతో మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని 18వ వార్డులో బుధవారం టీడీపీ ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు జూలకంటి గౌతమ్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలను ప్రజలకు అందజేస్తూ వాటి ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమానికి ముందుగా 89వ బూత్ ఇంచార్జి కొమెర ఈశ్వర్,గౌతమ్ రెడ్డికి ఘన స్వాగతం పలికారు. ప్రచార కార్యక్రమం అనంతరం వార్డులోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాచర్ల టౌన్ అధ్యక్షులు కొమెర దుర్గారావు,టీడీపీ సీనియర్ నాయకులు(బీసీ నాయకులు)బృంగా రమణారావు,కొమెర అనంతరాములు,యూనిట్ ఇంచార్జి మాచర్ల వాసు,మంజుల అంజి,పార్టీ కార్యకర్తలు,అభిమానులు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి గ్రామంలో ప్రగతి పరుగులు పెడుతోంది: ఎమ్మెల్యే జూలకంటి

రెంటచింతల ఆగష్టు 5 ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వం రాకతో వెనుకబడిన పల్నాడు ప్రాంతంలోని ప్రతి గ్రామంలో ప్రగతి పరుగులు పెడుతుందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఉద్ఘాటించారు. బుధవారం మండల పరిధిలోని మల్లవరం గ్రామంలో నిర్వహించిన ఇంటింటికీ తెలుగుదేశం ప్రతి ఇంటికీ మీ జూలకంటి కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పంపిణీమల్లవరం గ్రామంలో రెవిన్యూ శాఖ నిర్వహించిన రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే జూలకంటి 973 మంది రైతులకు నూతన పట్టాదారు పాసుపుస్తకాలు అందజేశారు. తహసీల్దార్ దీప్తి,టిడిపి మండల నాయకులు పొట్ల నరసింహారావు,చపారపు అబ్బిరెడ్డి,గొంతు సుమంత్ రెడ్డి, రామకృష్ణ, మందలపు హనిమిరెడ్డి,అల్లం బ్రహ్మారెడ్డి, సర్పంచ్ మేకల బాలయ్య, షేక్ సైదా (బుజ్జి), బాణావత్ కొండా నాయక్,ఎర్రయ్య,కృష్ణ, మోలాలి,శ్రీను తదితరులు పాల్గొన్నారు.



# కృష్ణ-పృథ్వీ సంచలనం




**న్యూఢిల్లీ:** భారత జంట కృష్ణ గరగ ప్రసాద్-పృథ్వీ కృష్ణమూర్తి రాయ్ కొరియా మాస్టర్స్‌లో అతిపెద్ద సంచలనం సృష్టించారు. పురుషుల డబుల్స్ పోటీలో అగ్రశ్రేణి థాయ్ జంట చలోఎంపోన్ చరోయెన్‌కిటమోర్న్-వొర్రాపోల్ థోంగ్సా ంగాను ఓడించి రెండో రౌండ్‌కు దూసుకెళ్లారు. ఈ ఈవెంట్‌లో పోటీపడిన సీడింగ్ లేని ఈ భారత జంట, 42 నిమిషాల్లో జరిగిన పోరులో 21-16, 21-18 తేడాతో విజయాన్ని నమోదు చేసింది. దీంతో ఈ జోడీ ఇప్పుడు తమ రెండో రౌండ్‌కు చేరుకుంది. ఇక మిగిలిన భారత బృందానికి మిశ్రమ ఆరంభం లభించింది. పురుషుల డబుల్స్ మొదటి రౌండ్‌లోనే దొడ్డవరపు అచ్యుతాదిత్యరావు-పోచన అర్జున్‌రెడ్డి ద్వయం కొరియాకు చెందిన చోయ్ సోల్ గ్యూ-మలేషియాకు చెందిన గో వి షెమ్‌ల చేతిలో 3-21, 10-21 తేడాతో ఓడిపోయి టోర్నమెంట్ నుండి నిష్క్రమించారు. మహిళల డబుల్స్‌లో, జపాన్‌కు చెందిన రెండో సీడెడ్ జోడీ రిరినా హిరామోటో-కోకోనా ఇషికావాల చేతిలో 15-21, 13-21 తేడాతో ఓటమి పాలైన ప్రియా కొంజెంగ్‌బామ్, శృతి మిశ్రాలు కూడా టోర్నమెంట్ నుండి నిష్క్రమించారు. పురుషుల సింగిల్స్ క్వాలిఫైయర్స్‌లో, తుషార్ సువీర్ కెనడాకు చెందిన శౌర్య గుల్లయ్యపై 21-15, 21-12 తేడాతో ఘనవిజయంతో ప్రారంభించాడు, కానీ తదుపరి క్వాలిఫైయింగ్ రౌండ్‌లో జపాన్‌కు చెందిన షోగో ఒగావా చేతిలో 10-21, 17-21 తేడాతో ఓడిపోవడంతో మెయిన్ డ్రాకు అర్హత సాధించలేకపోయాడు.

# కొరియా మాస్టర్స్.. తొలి రౌండ్‌లో తన్వి గెలుపు




**న్యూఢిల్లీ:** భారత్ టీనేజ్ షట్లర్ తన్వి శర్మ చైనాకు చెందిన యువాన్ ఆన్ క్విని ఓడించి కొరియా మాస్టర్స్ 2026 రెండవ రౌండ్‌లోకి ప్రవేశించగా, పురుషుల సింగిల్స్‌లో ఇజ్రాయెల్‌కు చెందిన డానిల్ దుబోవెంకో చేతిలో మాజీ ప్రపంచ ఛాంపియన్ భారత్ షట్లర్ కిదాంబి శ్రీకాంత్ ఓటమితో టోర్నీ నుండి నిష్క్రమించాడు. 17 ఏళ్ల మూడో సీడ్ టీనేజ్ క్రీడాకారిణి తన్వి బుధవారం ఆసన్‌లో జరిగిన మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌కు చేరుకోవడానికి చైనాకు చెందిన యువాన్ ఆన్ క్విని 21-16, 21-15 తేడాతో ఓడించింది. చైనీస్ తైపీకి చెందిన పై యుపోను 21-15, 21-14 తేడాతో ఓడించిన శ్రియాంశి వాలిశెట్టితో ఈ భారతీయ టీనేజర్ తదుపరి తలపడనుంది. మహిళల సింగిల్స్‌లో కూడా భారత్ మరో విజయాన్ని నమోదు చేసింది. మాన్సీ సింగ్ వెనుకబడినప్పటికీ పుంజుకుని దక్షిణ కొరియాకు చెందిన కిమ్ జూ యున్‌ను 14-21, 21 -19, 21-9 తేడాతో ఓడించింది. ఇక పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ఇజ్రాయెల్‌కు చెందిన డానిల్ దుబోవెంకో చేతిలో 22-20, 21-14, 21-12 తేడాతో ఓడిపోవడంతో, కిదాంబి శ్రీకాంత్ కొరియా మాస్టర్స్ 2026 ప్రయాణం తొలి అడుగులోనే ముగిసింది. శ్రీకాంత్ తన లయను కనుగొనడానికి చాలా ఇబ్బంది పడి పునరాగమనం చేయలేకపోయాడు, దీంతో దుబోవెంకో ఈ పోటీని సునాయాసంగా ముగించాడు. ఈ ఓటమితో సూపర్ 300 ఈవెంట్‌లో శ్రీకాంత్ ప్రస్థానం ముగియగా, భారత పురుషుల సింగిల్స్ ఆశలకు గట్టి దెబ్బ తగిలింది.

## వన్డే ప్రపంచకప్..

# ఫిబ్రవరి 22 నుండి క్వాలిఫైయర్స్ మ్యాచ్‌లు

## అక్టోబరు 4 నుండి మెయిన్ వరల్డ్ కప్

**న్యూఢిల్లీ:** వచ్చే ఏడాది సౌతాఫ్రికా వేదికగా జరగనున్న ప్రతిష్టాత్మక 2027 వన్డే ప్రపంచకప్ టోర్నమెంట్‌కు సంబంధించి ఐసీసీ కీలక అప్‌డేట్ ఇచ్చింది. ఈ టోర్నీకి అర్హత సాధించేందుకు నిర్వహించే క్వాలిఫైయర్స్ మ్యాచ్‌ల తేదీలను ఐసీసీ బుధవారం అధికారికంగా ప్రకటించింది. 10 జట్లు పాల్గొనే ఈ క్వాలిఫైయర్ రౌండ్ 2027 ఫిబ్రవరి 22 నుంచి మార్చి 23 మధ్య జరగనుంది. ఈసారి జరగబోయే వన్డే ప్రపంచకప్‌ను ఐసీసీ సరికొత్త ఫార్మాట్‌లో నిర్వహించబోతోంది. ఈ మెగా టోర్నీలో మొత్తం 14 జట్లు పోటీపడనున్నాయి. క్వాలిఫైయర్స్ పాయింట్ల పట్టికలో రెండు, మూడు, నాలుగు స్థానాల్లో నిలిచే జట్ల మధ్య సూపర్ సిరీస్ పోరు జరుగుతుంది. ఇది ప్రపంచకప్ మొదటి రౌండ్‌గా పరిగణించబడుతుంది. ఈ రౌండ్‌లో విజయం సాధించిన జట్లు ఆ తర్వాత టాప్12 లోకి అడుగుపెడతాయి. ఈసారి వన్డే ప్రపంచకప్ టోర్నమెంట్ మూడు ఆఫ్రికన్ దేశాలు సౌతాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలు సంయుక్తంగా నిర్వహించనున్నాయి. టోర్నీలోని



మొత్తం మ్యాచ్‌లను 12 వేర్వేరు స్టేడియంలలో నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. క్వాలిఫైయర్ రౌండ్‌లో మొత్తం 10 జట్లు పాల్గొంటాయి.

సెప్టెంబర్ 30, 2026 నాటికి ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో చివరన ఉండే రెండు ఫుల్ మెంబర్ జట్లు (ఆతిథ్య దేశాలైన సౌతాఫ్రికా, జింబాబ్వేలు మినహా) ఈ క్వాలిఫైయర్‌లో ఆడాల్సి ఉంటుంది. వీరితో పాటు సిడబ్ల్యూసి లీగ్ 2లో టాప్4 లో నిలిచిన జట్లు, అలాగే వరల్డ్ కప్ క్వాలిఫైయర్ ప్లేఆఫ్స్ లో టాప్4 లో నిలిచిన జట్లు కలసి మొత్తం 10 జట్లు ఈ క్వాలిఫైయర్స్ లో తలపడతాయి. మెయిన్ ప్రపంచకప్ మ్యాచ్‌లు 2027 అక్టోబర్ 4 నుంచి నవంబర్ 21 వరకు జరగనున్నాయి.



## శ్రీలంక మ్యాచ్‌లో..

# అత్యధిక వికెట్ల హీరోలు

**న్యూఢిల్లీ:** టీమిండియా ఈ నెల 15 నుంచి శ్రీలంకలో రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లో తలపడనుంది. ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025-27 సైకిల్‌లో భారత్‌కు ఈ సిరీస్ అత్యంత కీలకంగా మారింది. డబ్ల్యూటీసీ ఫైనల్ రేసులో నిలవాలంటే శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలో టీమిండియా ఈ సిరీస్‌ను ఖచ్చితంగా గెలవాల్సి ఉంటుంది. డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో భారత్ ప్రస్తుతం ఐదో స్థానంలో, శ్రీలంక ఆరో స్థానంలో కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో భారత్, శ్రీలంక టెస్ట్ చరిత్రలో అత్యధిక వికెట్లు పడగొట్టిన బౌలర్ల వివరాలు ఆసక్తికరంగా మారాయి. భారత్, శ్రీలంక మధ్య 1982 నుంచి టెస్ట్ మ్యాచ్‌లు జరుగుతున్నాయి. ఈ రెండు దేశాల మధ్య జరిగిన టెస్ట్ సిరీస్ చరిత్రలోనే అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా శ్రీలంక స్పిన్ దిగ్గజం ముత్తయ్య మురళీధరన్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఆయన భారత్‌పై 22 టెస్టుల్లో ఏకంగా 105 వికెట్లు పడగొట్టి ఎవరికీ అందనంత ఎత్తులో నిలిచాడు. భారత మాజీ స్పిన్నర్ అనిల్ కుంబ్లే 18 టెస్టుల్లో 74 వికెట్లతో రెండో స్థానంలో ఉన్నాడు. ఇటీవలే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన భారత స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ 11 మ్యాచ్‌ల్లో 62 వికెట్లతో మూడో స్థానంలో నిలిచాడు. నాలుగో స్థానంలో హర్భజన్ సింగ్ (53 వికెట్లు), ఐదో స్థానంలో కపిల్ దేవ్ (45 వికెట్లు) ఉన్నారు. యాక్టివ్ ప్లేయర్లలో ఒక్కడే ఉండటం విశేషం. ఈ హెవీవెయిట్ బౌలర్ల జాబితాలో ప్రస్తుతం ఆడుతున్న ఆటగాళ్లలో భారత స్టార్ ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా ఒక్కడే చోటు దక్కించుకోవడం విశేషం. 37 ఏళ్ల జడేజా ఇప్పటివరకు శ్రీలంకపై 7 టెస్టులాడి 33 వికెట్లు పడగొట్టి ఎనిమిదో స్థానంలో ఉన్నాడు. రాబోయే లంక పర్యటనకు జడేజా భారత జట్టులో ఎంపికయ్యాడు. ఈ జాబితాలో ఆరో స్థానంలో ఇషాంత్ శర్మ (36 వికెట్లు), ఏడో స్థానంలో శ్రీలంక మాజీ స్పిన్నర్ అజంతా మెండిస్ (34 వికెట్లు), తొమ్మిదో స్థానంలో రంగన హేరత్ (33 వికెట్లు), పదో స్థానంలో చమిండ వాస్ (30 వికెట్లు) నిలిచారు.

# వెస్టిండీస్ గడ్డపై విధ్వంసం

## పట్టు బిగించిన పాకిస్థాన్

**న్యూఢిల్లీ:** వెస్టిండీస్‌పై అబ్దుల్లా షఫీక్ 160 పరుగులతో చరిత్ర సృష్టించాడు. 49 ఏళ్ల తర్వాత కరేబియన్ గడ్డపై పాక్ బ్యాటర్ 150 ప్లస్ స్కోరు సాధించాడు. బాబర్ ఆజంతో 183 పరుగుల భాగస్వామ్యం, పాక్ ఆధిక్యంతో పట్టు బిగించడంతో విండీస్ ఓటమి అంచున నిలిచింది. రెండో ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లు కోల్పోయింది. క్వీన్స్ పార్క్ ఓవల్ మైదానంలో వెస్టిండీస్‌తో జరుగుతున్న రెండో టెస్టు మ్యాచ్ మూడో రోజు బుధవారం పాకిస్థాన్ జట్టు అత్యంత బలమైన స్థితికి చేరుకుంది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి వెస్టిండీస్ తన రెండో ఇన్నింగ్స్‌లో కేవలం 60 పరుగుల స్వల్ప ఆధిక్యంతో 6 వికెట్లు కోల్పోయి తీవ్ర కష్టాల్లో పడింది. కరేబియన్ గడ్డపై వెస్టిండీస్‌పై టెస్టుల్లో 150 కంటే ఎక్కువ పరుగులు సాధించి ఏకంగా 49 ఏళ్ల క్రితం నాటి రికార్డును అబ్దుల్లా షఫీక్ తిరగరాశాడు. పాకిస్థాన్ ఇన్నింగ్స్ ప్రారంభంలో ఓపెనర్లు అజాన్ అవైస్ (55), ఇమామ్ ఉల్ హక్ (14) కలసి 98 పరుగులు జోడించి అవుట్ అయ్యారు. మూడో వికెట్‌కు బ్యాటింగ్‌కు వచ్చిన షఫీక్, కెప్టెన్ బాబర్ ఆజమ్‌తో కలిసి కొండంత భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. వీరిద్దరూ కలిసి మూడో వికెట్‌కు ఏకంగా 183 పరుగులు జోడించారు. కెప్టెన్ బాబర్ ఆజం ఎంతో నిలకడగా ఆడి సెంచరీ దిశగా సాగినప్పటికీ, బ్రాండన్ కింగ్ వేసిన అద్భుతమైన త్రోకి 88 పరుగుల వద్ద రనౌట్ అయ్యాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా అబ్దుల్లా షఫీక్ చివరి వరకు నిలబడి 160 రన్లతో పాకిస్థాన్‌ను 387 పరుగుల మార్కుకు చేర్చాడు ఈ మ్యాచ్‌ను గెలిచి రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను 1-1 తో సమం చేసే అవకాశాన్ని పాకిస్థాన్ చేజిక్కించుకుంది. పాక్ సాధించిన తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం తర్వాత రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన వెస్టిండీస్ ఆటగాళ్లు పాక్ బౌలర్ల ధాటికి నిలవలేకపోయారు. మూడో రోజు ఆట ముగిసే సమయానికి వెస్టిండీస్ 6 వికెట్ల నష్టానికి కేవలం 103 పరుగులు మాత్రమే చేసింది. ప్రస్తుతం విండీస్ చేతిలో 4 వికెట్లు మాత్రమే ఉండగా, కేవలం 60 పరుగుల స్వల్ప ఆధిక్యంలో ఉండి ఓటమి అంచున నిలిచింది. అంతకు ముందు తొలి ఇన్నింగ్స్‌లో వెస్టిండీస్ 344 పరుగులు చేసింది.





# ఆర్‌బిఐ రెపో రేటు యధాతథం

## 5.25 శాతంగానే కొనసాగింపు



**ముంబయి, ఆగస్టు 5:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్రవ్య విధాన కమిట సమావేశం అనంతరం రెపో రేటును 5.25 శాతం వద్ద యథాతథంగా కొనసాగిస్తూ ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకుంది. ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలోని ఎంపీసీ ఈ నిర్ణయాన్ని ప్రకటించింది. స్టాండింగ్ డిపాజిట్ ఫెసిలిటీ (ఎస్‌డీఎఫ్) రేటును 5 శాతం, మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ (ఎంఎస్ఎఫ్), బ్యాంక్ రేట్లను 5.5 శాతం వద్ద కొనసాగించింది. ద్రవ్య విధాన వైఖరినితటస్థలంగానే కొనసాగించింది.16 నెలల తర్వాత వినియోగదారుల ధరల సూచీ ద్రవ్యోల్బణం ఆర్‌బీఐ లక్ష్యమైన 4 శాతాన్ని దాటి జూన్‌లో 4.4 శాతానికి చేరి ఆర్‌బీఐ అంచనాల కంటే 30 బేసిస్ పాయింట్లు తక్కువగా ఉందని పేర్కొంది. అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికంలో ద్రవ్యోల్బణం గరిష్ఠ స్థాయికి చేరి, అనంతరం క్రమంగా తగ్గుముఖం పడుతుందని ఎంపీసీ అంచనా వేసింది.2026-27 ఆర్థిక సంవత్సరానికి సీపీఐ ద్రవ్యోల్బణ అంచనాను 10 బేసిస్ పాయింట్లు తగ్గించి 5 శాతానికి సవరించింది. త్రైమాసికాల వారీగా రెండో త్రైమాసికంలో 4.7 శాతం, మూడోత్రైమాసికంలో 5.9 శాతం, చివరి త్రైమాసికంలో 5.5 శాతం, 2027-28 తొలి త్రైమాసికంలో 5.3 శాతంగా ఉంటుందని అంచనా వేసింది. అలాగే 2026-27లో కోర్ ద్రవ్యోల్బణం 4.3 శాతంగా ఉండనుందని, విలువైన లోహాలను మినహాయించిన కోర్ ద్రవ్యోల్బణం 4.3 శాతం కంటే తక్కువగానే కొనసాగే అవకాశముందని తెలిపింది.దేశీయ డిమాండ్ బలంగా కొనసాగడం, ఆర్థిక కార్యకలాపాలు అంచనాల కంటే మెరుగ్గా ఉండటంతో 2026-27 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి అంచనాను 10 బేసిస్ పాయింట్లు పెంచి 6.7 శాతానికి సవరించింది. దేశ ఆర్థిక వ్యవస్థకు పలు ప్రమాదాలు ఉన్నాయని గవర్నర్ సంజయ్ మల్హోత్రా హెచ్చరించారు. దేశవ్యాప్తంగా నైరుతి రుతుపవనాల లోపం, అసమాన వర్షపాతం, అంతర్జాతీయ ముడి చమురు ధరల అస్థిరత, పశ్చిమాసియా ఉద్రిక్తతలు, ప్రధాన దేశాల ఆర్థిక పరిస్థితుల బలహీనత, ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, గ్లోబల్ వాణిజ్య విధానాలపై అనిశ్చితి వంటి అంశాలు ప్రధాన సవాళ్లుగా పేర్కొన్నారు.ప్రస్తుతం ద్రవ్యోల్బణం పెరుగుదల ప్రధానంగా ఆహార, ఇంధన సరఫరా సంబంధిత ఒత్తిళ్ల వల్లేనని, వృద్ధి రేటు కూడా ఆశించిన స్థాయిలో లేదని, పరిస్థితులపై మరింత స్పష్టత వచ్చిన తర్వాతే ద్రవ్య విధానంలో మార్పులపై నిర్ణయం తీసుకుంటామని గవర్నర్ తెలిపారు. ద్రవ్యోల్బణం, వృద్ధి పరిస్థితుల పరిణామాలను పరిగణనలోకి తీసుకుని అవసరమైతే భవిష్యత్తులో విధాన రేట్లను పునఃసమీక్షించే అవకాశం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

# రెపోరేట్ల ఎఫెక్ట్... లాభాల్లో ముగిసిన మార్కెట్లు



**ముంబయి, ఆగస్టు 5:** భారతీయ రిజర్వుబ్యాంకు రెపో రేటును 5.25 శాతం వద్ద యథాతథంగా కొనసాగించడంతో పాటు తటస్థ ద్రవ్య విధానాన్ని కొనసాగించడంతో దేశీయ ఈక్విటీ మార్కెట్లు బుధవారం స్వల్ప లాభాలతో ముగిశాయి. అలాగే 2026-27 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి అంచనాను 6.7 శాతానికి పెంచడం, ద్రవ్యోల్బణ అంచనాను 5 శాతానికి తగ్గించడం ఇన్వెస్టర్లలో సానుకూల భావనను పెంచింది. ప్రపంచ మార్కెట్లలో బలమైన ధోరణి, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల కొనుగోళ్లు, ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టడం కూడా మార్కెట్లకు మద్దతు ఇచ్చాయి.ఎస్అండ్‌పీ బీఎస్ఈ సెన్సెక్స్ 152.05 పాయింట్లు పెరిగి 78,581 వద్ద ముగియగా, నిఫ్టీ50 సూచీ 9.75 పాయింట్లు లాభపడి 24,624.65 వద్ద స్థిరపడింది. నిఫ్టీలో శ్రీరామ్ ఫైనాన్స్ 3.23 శాతం, లార్సెన్ అండ్ టుబ్రో 1.68 శాతం, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 1.18 శాతం చొప్పున పెరిగి సూచీకి ప్రధాన మద్దతు అందించాయి.బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 0.34 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.70 శాతం చొప్పున లాభపడ్డాయి. బీఎస్ఈలో 2,330 షేర్లు లాభపడగా, 1,911 షేర్లు నష్టపోయాయి. 216 షేర్లలో ఎలాంటి మార్పు లేదు. సెప్టెంబర్ 2026 డెలివరీ బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 1.33 డాలర్లు పెరిగి 80.69 డాలర్లకు చేరుకుంది. భారత 10 ఏళ్ల ప్రభుత్వ బాండ్ యీల్డ్ 6.816 శాతం నుంచి 6.787 శాతానికి తగ్గింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 95.28 నుంచి 95.15 వద్ద బలపడింది. ఎంసీఎక్స్‌లో అక్టోబర్ 5 డెలివరీ బంగారం ఫ్యూచర్స్ ధర 1.31 శాతం పెరిగి 10 గ్రాములకు రూ.1,46,186కు చేరాయి. అమెరికా 10 ఏళ్ల బాండ్ యీల్డ్ 4.612 శాతానికి దిగివచ్చింది. భారతి ఎయిర్‌టెల్ సమీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 41.63 శాతం పెరిగి రూ.8,424.29 కోట్లకు చేరడంతో షేరు 0.40 శాతం లాభపడింది. ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ 7.60 శాతం, క్యాస్ట్రోల్ ఇండియా 2.40 శాతం, స్నోమాన్ లాజిస్టిక్స్ 2.76 శాతం, గోద్రేజ్ ప్రాపర్టీస్ 3.22 శాతం, శిల్పా మెడికేర్ 12.93 శాతం, దీపక్ నైట్రైట్ 0.37 శాతం చొప్పున పెరిగాయి. మరోవైపు ప్రోటియన్ ఈగవర్నెన్స్ టెక్నాలజీస్ 8.22 శాతం, కళ్యాణ్ జ్యువెలర్స్ ఇండియా 3.70 శాతం, ఓఎన్‌జీసీ 0.74 శాతం చొప్పున నష్టపోయాయి.




# క్లోజింగ్ ఆక్షన్‌లో ఎన్ఎస్ఇదే ఆధిపత్యం

**ముంబయి,ఆగస్టు 5:** మార్కెట్ ముగింపు ధర నిర్ణయానికి ఇటీవల అమల్లోకి వచ్చిన క్లోజింగ్ ఆక్షన్ సెషన్‌లో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) తన ఆధిపత్యాన్ని కొనసాగించింది. ఆగస్టు 5న సీఏఎస్‌లో ఎన్ఎస్ఈ రూ.1,383.8 కోట్ల టర్నోవర్ నమోదు చేసి 99.1 శాతం మార్కెట్ వాటాను దక్కించుకుంది. బీఎస్ఈలో రూ.12.5 కోట్ల టర్నోవర్ నమోదై 0.9 శాతం వాటా మాత్రమే లభించింది. రెండు ఎక్స్ఛేంజ్‌ల కలిపి టర్నోవర్ రూ.1,396.3 కోట్లుగా నమోదైంది.సీఏఎస్ ప్రారంభమైన తొలి రోజున ఎన్ఎస్ఈలో రూ.1,276.2 కోట్లు, బీఎస్ఈలో రూ.10.8 కోట్ల టర్నోవర్ నమోదవగా ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఇన్ఫోసిస్, భారతి ఎయిర్‌టెల్, బజాజ్ ఫైనాన్స్, ఎటర్నల్, టీసీఎస్, సీజీ పవర్, యాక్సిస్ బ్యాంక్ షేర్లలో అధిక లావాదేవీలు జరిగాయి. ఈ 10 షేర్లే ఎన్ఎస్ఈ క్లోజింగ్ ఆక్షన్ టర్నోవర్‌లో సుమారు 30 శాతం వాటా కలిగి ఉండటం విశేషం.సెబీ సవరించిన ముగింపు ధర నిర్ణయ విధానంలో తొలి దశగా క్లోజింగ్ ఆక్షన్ సెషన్‌ను అమలు చేసింది. గతంలో అమలులో ఉన్న వాల్యూమ్ వెయిటెడ్ యావరేజ్ ప్రైస్ విధానానికి బదులుగా, కొనుగోలు-అమ్మకాల ఆర్డర్లకు సమతుల్య ధరను నిర్ణయించే వేలం విధానంలో ముగింపు ధరను ఖరారు చేస్తున్నారు. నిఫ్టీ50, సెన్సెక్స్ ముగింపు స్థాయిల్లో కనిపించిన వ్యత్యాసం పూర్తిగా మార్కెట్ శక్తుల ప్రభావమేనని, సాంకేతిక లోపాలు కారణం కాదని స్పష్టం చేశాయి. ప్రస్తుతం ఈ విధానం ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్‌కు అనుబంధంగా ఉన్న అర్హత గల నగదు మార్కెట్ షేర్లకు వర్తిస్తుండగా, దశలవారీగా మరిన్ని సెక్యూరిటీలకు విస్తరించాలని సెబీ యోచిస్తోంది.

## ఎయిర్ ఇండియాకు కొత్త సిఇఓగా

# టెవోల్డే గెబ్రెమారియం

## విస్తరణకు సిద్ధమైన టాటా గ్రూప్ సంస్థ..

## క్యాంప్‌బెల్ విల్సన్ స్థానంలో నియామకం

**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** టాటా గ్రూప్‌కు చెందిన ఎయిర్ ఇండియా కొత్త చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ), మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ)గా ఇథియోపియన్ ఎయిర్‌లైన్స్ మాజీ అధినేత టెవోల్డే గెబ్రెమారియంను నియమించింది. సంస్థ పునరుద్ధరణ ప్రక్రియను పూర్తి చేసి, అంతర్జాతీయ స్థాయిలో వేగవంతమైన విస్తరణ దిశగా అడుగులు వేస్తున్న నేపథ్యంలో ఈ నియామకం ప్రాధాన్యత సంతరించుకుంది. బుధవారం జరిగిన డైరెక్టర్ల బోర్డు సమావేశంలో గెబ్రెమారియం నియామకానికి ఆమోదం తెలిపినట్లు ఎయిర్ ఇండియా వెల్లడించింది. ప్రపంచ వ్యాప్తంగా పలువురు ప్రముఖ విమానయాన నిపుణులను పరిశీలించిన అనంతరం ఆయనను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు తెలిపింది.టాటా గ్రూప్‌కు ఎయిర్ ఇండియా తిరిగి వచ్చిన తర్వాత సంస్థ పునరుద్ధరణ కార్యక్రమాలకు నాయకత్వం వహించిన క్యాంప్‌బెల్ విల్సన్ స్థానంలో గెబ్రెమారియం బాధ్యతలు చేపట్టనున్నారు.ఎయిర్ ఇండియా ఛైర్మన్, టాటా సన్స్ ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ మాట్లాడుతూ విల్సన్ నాయకత్వంలో సంస్థ స్థిరీకరణ, విలీన ప్రక్రియ, భారీ విమానాల కొనుగోలు వంటి కీలక కార్యక్రమాలు పూర్తయ్యాయని తెలిపారు. ప్రస్తుతం సంస్థ వృద్ధి, విస్తరణకు సంబంధించిన అమలు దశలోకి ప్రవేశించిందని, ప్రపంచ స్థాయి విమానయాన సంస్థను నిర్మించడంలో గెబ్రెమారియం అనుభవం ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు.






# వచ్చే రెండేళ్లలో ప్లాస్టిక్ కరెన్సీ!

**ముంబయి, ఆగస్టు 5:** భారతదేశంలో 2028 ఆర్థిక సంవత్సరానికి పాలిమర్ కరెన్సీ నోట్లను చలామణీలోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ద్రవ్య విధాన సమీక్ష తర్వాత మీడియాతో మాట్లాడుతూ ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రస్తుతం పాలిమర్ నోట్లపై క్షేత్రస్థాయి పరీక్షలు కొనసాగుతున్నాయని ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా తెలిపారు. మార్కెట్ లోకి తీసుకురాకముందు పాలిమర్ నోట్ల పనితీరును పూర్తిగా పరిశీలిస్తామని ఆయన స్పష్టం చేశారు. పరీక్షల ఫలితాలను విశ్లేషించిన తర్వాత విస్తృతస్థాయిలో చలామణీ చేసే అంశంపై తుది నిర్ణయం తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఇటీవల రూ.10, రూ.20 విలువ ఉన్న పాలిమర్ నోట్ల క్షేత్రస్థాయి పరీక్షలకు ఆర్బీఐ ప్రతిపాదనకు కేంద్రం ఆమోదం తెలిపింది. పాలిమర్ నోట్లను నకిలీ చేయటం చాలా కష్టం పైలెట్ ప్రాజెక్ట్ లో భాగంగా ఒక్కో విలువలో 100కోట్ల నోట్లు విడుదల చేసి అవి ఎంత కాలం మన్నుతాయి, భారత వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా ఉంటాయా అన్నది పరిశీలించనున్నారు. అయితే ప్రస్తుతం మనదేశంలో కాగితపు కరెన్సీ చెల్లుబాటులో ఉంది. సాధారణంగా కాగితపు కరెన్సీతో పోలిస్తే పాలిమర్ కరెన్సీ ఎక్కువ కాలం మన్నుతాయి. వీటిలో ట్రాన్స్పరెంట్ విండోలు, అధునాతనమైన భద్రతా ఫీచర్లు ఉండటం కారణంగా వీటిని నకిలీ చేయటం చాలా కష్టం.

# ద్రవ్యోల్బణ అంచనాను 5 శాతానికి తగ్గించిన ఆర్‌బిఐ

**న్యూఢిల్లీ:** రిజర్వుబ్యాంకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్రవ్యోల్బణ (సీపీఐ) అంచనాను 10 బేసిస్ పాయింట్లు తగ్గించి 5 శాతానికి సవరించింది. జూన్‌లో ప్రకటించిన 5.1 శాతం అంచనాను తాజా ద్రవ్య విధాన సమీక్షలో 5 శాతానికి తగ్గించింది. అదే సమయంలో రెపో రేటును 5.25 శాతం వద్ద యథాతథంగా కొనసాగించింది.ఆర్‌బీఐ తాజా అంచనాల ప్రకారం తొలి త్రైమాసికంలో ద్రవ్యోల్బణం 5.3 శాతం, రెండో త్రైమాసికంలో 4.7 శాతం, మూడో త్రైమాసికంలో 5.9 శాతం, నాలుగో త్రైమాసికంలో 5.5 శాతంగా




వాణిజ్యం

ఉండే అవకాశం ఉంది. ద్రవ్య విధాన కమిటీ నిర్ణయాలను ప్రకటించిన ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా మాట్లాడుతూ, ఈ ఏడాది ద్రవ్యోల్బణ అంచనాను 5 శాతానికి తగ్గించినట్లు తెలిపారు. జూన్ నెలలో ద్రవ్యోల్బణం పెరగడానికి ప్రధానంగా ఆహార, ఇంధన ధరల పెరుగుదల కారణమని చెప్పారు.ఆహార, ఇంధన ధరలను మినహాయించి లెక్కించే కోర్ ఇన్‌ఫ్లేషన్ మే, జూన్ నెలల్లో 3.9 శాతం వద్ద స్థిరంగా కొనసాగిందని పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కోర్ ఇన్‌ఫ్లేషన్ 4.3 శాతంగా ఉండొచ్చని ఆర్‌బీఐ అంచనా వేసింది.అయితే ద్రవ్యోల్బణంపై పలు అనిశ్చితులు కొనసాగుతున్నాయని గవర్నర్ హెచ్చరించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం సమయం, భౌగోళిక పంపిణీలో మార్పులు వచ్చే అవకాశం ఉందని, ఇది ఆహార ధరలపై ప్రభావం చూపవచ్చని తెలిపారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14